

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



మంగళవారం | 3-6-2025 | పేజీలు: 18 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 48 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మఋతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం తిథి: అష్టమి రా.9.57 తదుపరి నవమి, నక్షత్రం: పుబ్బ రా.12.59 తదుపరి ఉత్తర, వర్జ్యం: ఉ.7.37-9.21, దుర్ముహూర్తం: ఉ.8.19-9.11, రా.10.18-11.01, అమృతఘడియలు: సా.6.02-7.46, రాహుకాలం: మ.3.00-4.30, సూర్యోదయం: 5.43, సూర్యాస్తమయం: 6.43 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 3-6-2025

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విజయవాడ సిటీ**

www.andhrajyothy.com
విజయవాడ సిటీ


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 3-6-2025

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

తీరానికి పచ్చతోరణం!



975 కిలోమీటర్ల మేర సముద్రతీరంలో వనాలు

ఉపాధి హామీ, అటవీ నిధులతో తీరం వెంబడి మొక్కల పెంపకం

ఎల్లుండి ప్రారంభించనున్న ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి

కొల్లేరుకు మానవీయ పరిష్కారం

13

సరస్సును పరిరక్షిస్తూనే స్థానికులకూ న్యాయం.. సమీక్షలో సీఎం

క్షణాల్లో వాతావరణ సమాచారం

షార్‌తో ఆర్‌టీజీఎస్ కీలక ఒప్పందం 2

బనకచర్లకు నిధులివ్వండి

కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం వినతి

ఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖతో పీయూష్ బృందం భేటీ

పోలవరం-బనకచర్ల అనుసంధానంపై ప్రజెంటేషన్

ఏటా జూలై 1 నుంచి అక్టోబరు దాకా గోదారికి వరద

3 వేల టీఎంసీలు కడలిపాలు.. ఇందులో 200 టీఎంసీలను వంద రోజుల్లో ఎత్తిపోస్తాం 3

వరద జలాల ఆధారంగా దేశంలో ఇదే తొలి నదుల అనుసంధాన పథకం

పోలవరం కంటే బనకచర్ల పెద్ద ప్రాజెక్టు

ఏడేళ్లు దీర్ఘకాలిక సాయం అందించండి: పీయూష్

సమగ్ర రిపోర్టు ఇస్తే నిధుల విడుదలపై కార్యాచరణ

కేంద్ర అధికారుల హామీ.. నెలాఖరుకల్లా ఇస్తాం: రాష్ట్రం



సీఎం చంద్రబాబుతో సమావేశమైన నాస్కామ్ ప్రతినిధులు

గ్లోబల్ టెక్ హబ్‌గా ఏపీ

లక్ష మంది నిపుణుల తయారీకి అప్రెంటీస్ ప్రోగ్రాం

నాస్కామ్ ప్రతినిధులతో చంద్రబాబు 13

మన జోనే 'టాప్'

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జాతీయస్థాయి టాప్-10లో హైదరాబాద్ జోన్ నుంచి ఇద్దరు

అత్యధికంగా 12,946 మంది అర్హత

ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కేరళ ఈ జోన్‌లోనే

ఏపీకి చెందిన రుత్విక్ సాయికి 18వ ర్యాంకు

ప్రతిభ చాటిన విజయనగరం, సిక్కోలు విద్యార్థులు

ఢిల్లీ విద్యార్థి రజిత్ గుప్తాకు మొదటి ర్యాంకు

బాలికల్లో దేవదత్త మాఝీ ఫస్ట్ 12

మొత్తం 1.80 లక్షల మంది పరీక్ష రాయగా అర్హత సాధించిన 54,378 మంది

నీట్ పీజీ వాయిదా.. త్వరలో కొత్త తేదీ 2



ట్రోఫీతో బెంగళూరు, పంజాబ్ కెప్టెన్లు రజత్, శ్రేయాస్

ఐపీఎల్ ఫైనల్ నేడే

బెంగళూరుతో పంజాబ్ ఢీ 11

రాష్ట్రంలో మరో 2 కొవిడ్ కేసులు 2

త్వరలో 46 వేల మంది టీచర్లకు తప్పనిసరి బదిలీ

స్కూల్ అసిస్టెంట్లు 23,113, ఎస్జీటీలు 23 వేల మందికి తప్పనిసరి కోటా కింద స్థానచలనం

రిక్వెస్ట్ బదిలీలకు మరో 39 వేల మంది దరఖాస్తు.. 1,872 మంది ప్రైమరీ స్కూళ్ల హెచ్ఎంల బదిలీ

పలు కేడర్లలో టీచర్లకు పదోన్నతులు.. ఉద్యోగుల బదిలీల గడువు పొడిగింపుపై జీవో జారీ 11

ఉద్యోగులకు ఎల్లుండి

ప్రత్యేక సెలవు

ఏపీజీఈఏ సమావేశాల కోసం సర్కారు మంజూరు 3

'డీఎస్సీ'పై జోక్యం చేసుకోం

ఈ దశలో 'స్టే' విధించలేం 12

హాల్‌టికెట్లు జారీ చేశారు.. పరీక్షలకు ఏర్పాట్లూ చేశారు

అలా చేస్తే ఉద్యోగార్థుల ప్రయోజనాలకు తీవ్ర నష్టం

స్పష్టంచేసిన హైకోర్టు.. అన్ని పిటిషన్లు కొట్టివేత

రౌడీషీటర్లకు మద్దతా!

- కానిస్టేబుల్‌పై ఇటీవల రౌడీషీటర్ల దాడి
- బహిరంగంగా 'ట్రీట్మెంట్' ఇచ్చిన పోలీసులు
- అదే రౌడీ షీటర్లకు మద్దతుగా జగన్
- నేనూ దళితురాలినే.. కానిస్టేబుల్ భార్య వీడియో

వైసీపీ అధ్యక్షుడి వైఖరిపై విస్మయం.. నేడు తెనాలికి వస్తున్న జగన్

(తెనాలి, గుంటూరు-ఆంధ్రజ్యోతి)

ప్రమాద బాధితులను పరామర్శించవచ్చు. రాజకీయ హత్యలు, ఆందోళనల్లో బాధితులైన వారినీ ఓదార్చవచ్చు. కానీ.. వైసీపీ అధ్యక్షుడు జగన్ తీరే వేరు! పోలీసులకే సవాలు విసురుతూ, శాంతిభద్రతలకు తరచూ విఘాతం కల్గిస్తూ.. ఏకంగా కానిస్టేబుల్‌పైనే హత్యాయత్నం చేసిన రౌడీషీటర్లకు ఆయన వత్తాసు పలుకుతున్నారు. కానిస్టేబుల్‌పై దాడిచేసిన కేసులో అరెస్టయిన రౌడీషీటర్ల కుటుంబాలను పరామర్శించేందుకు మంగళవారం ఆయన తెనాలిలోని ఐతానగర్‌కు వస్తున్నారు. వారికి భరోసా ఇచ్చేందుకు ఆయన వస్తున్నారని వైసీపీ వర్గాలు ప్రకటించాయి.

అసలేం జరిగింది...

తెనాలిలో గంజాయి బ్యాచ్ రౌడీషీటర్లను పోలీసులు ఎన్నిమార్లు మందలించినా, కేసులు నమోదు చేసినా మార్పు రావడం లేదు. బెయిల్‌పై వచ్చి మళ్లీ అరాచకాలకు పాల్పడుతున్నారు. ఇటీవల చిరంజీవి అనే కానిస్టేబుల్‌పై తిరగబడి హత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధిత కానిస్టేబుల్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. రౌడీషీటర్లలో భయం కలిగించాలనే ఉద్దేశంతో కానిస్టేబుల్‌పై దాడి చేసినవారిని పోలీసులు బహిరంగంగా లాఠీలతో అరికాళ్లకు కొట్టారు (నాడా ట్రీట్‌మెంట్). వైసీపీకి వంతపాడి ప్రస్తుతం జైలులో ఉన్న ఐపీఎస్ అధికారి పీఎస్‌ఆర్ ఆంజనేయులు గుంటూరు ఎస్పీగా ఉన్నప్పుడు రౌడీషీటర్లపైనే కాకుండా అమాయకులపై కూడా కాళ్లు వాచేలా డార్మెటరీలో థర్డ్ డిగ్రీ ప్రయోగించేవారు. ఇలా బహిరంగంగా కొట్టడం చట్టవిరుద్ధమే! జగన్ దీన్ని ఖండిస్తే ఎవరూ తప్పుపట్టేవారు కారేమో. కానీ.. ఏకంగా రౌడీషీటర్ల కుటుంబాలను పరామర్శించేందుకు రావడంపై విస్మయం వ్యక్తమవుతోంది. 'వీరికేనా మీ మద్దతు..?' అంటూ ప్రశ్నిస్తున్నారు. వైసీపీ హయాంలో తెనాలిలోని అదే ఐతానగర్‌లో రౌడీషీటర్‌లు రెచ్చిపోయి అమాయకపు జనంపై దాడులకు దిగిన వీడియోలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.

నేనూ దళితురాలినే...

తెనాలిలో రౌడీషీటర్ల చేతిలో హత్యాయత్నానికి గురైన కానిస్టేబుల్ చిరంజీవి భార్య కల్యాణి తానూ దళితురాలినే నంటూ ఓ వీడియో విడుదల చేశారు. 'దళిత సంఘ పెద్దలను, రాజకీయ నాయకులను ఒక దళిత సోదరిగా వేడుకుంటున్నా! రౌడీ షీటర్లను కొట్టిన సంఘటనలో వారికి మద్దతుగా నిలుస్తున్న వారికి ఇదే నా విన్నపం! నేను కూడా దళిత మహిళనే. నాకు తల్లిదండ్రులు లేరు. బీసీ సామాజికవర్గానికి చెందిన చిరంజీవిని పదేళ్ల క్రితం వివాహం చేసుకున్నా. నా భర్తను రౌడీషీటర్లు మారణాయుధాలతో దాడిచేసి చంపబోయారు. మేం కేసు పెట్టాం. దాడికి పాల్పడిన వారిని పోలీసులు పట్టుకొని దండించారు. రౌడీషీటర్లకు అండగానిలవాలని చూస్తే దళిత సోదరినైన నాకు అన్యాయం చేసినట్టే' అన్నారు.

రౌడీషీటర్లకు కులం రంగా?: గుంటూరు ఎస్పీ

రౌడీషీటర్లకు కుల, రాజకీయ రంగు పులిమి మద్దతు ఇవ్వటం సముచితం కాదని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ పేర్కొన్నారు. తెనాలిలో జరిగిన సంఘటనపై ఉన్నతస్థాయి పోలీసు అధికారితో దర్యాప్తు చేయిస్తున్నామని, దీనిని రాద్ధాంతం చేయటం తగదని ప్రకటించారు.

తప్పులు చేసిన వారికి కులమేంటి?

- పోలీసులపై దాడి చేసిన వారికి మద్దతా: హోం మంత్రి
- బాధితులకు ఏం సమాధానం చెబుతారు: మంత్రి నాదెండ్ల

అమరావతి/విజయవాడ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): తప్పు చేసిన వారికి కులం, మతమేంటని హోంమంత్రి అనిత మండిపడ్డారు. తెనాలిలో పోలీసులపై దాడిచేసిన వారి నేరచరిత్ర ఏంటి? వారిపై ఎన్ని కేసులు ఉన్నాయి? అనే విషయాన్ని డీజీపీ ప్రకటన ద్వారా తెలిపారన్నారు. చట్టాన్ని ఎక్కడా పోలీసులు చేతిలోకి తీసుకోలేదని స్పష్టం చేశారు. పోలీసులపై చేయిచేసుకున్న వారికి రాజకీయ రంగు పులిమి మద్దతు ఇస్తున్నారా అని ప్రశ్నించారు. కాగా, తెనాలి పట్టణాన్ని గత వైసీపీ ప్రభుత్వం హయాంలో గంజాయికి అడ్డాగా మార్చేశారని మంత్రి నాదెండ్ల మనోహర్ విమర్శించారు. తెనాలి పర్యటనకు వస్తున్న జగన్.. తాను సృష్టించిన గంజాయి గ్యాంగ్‌ల బాధితులకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.

ఆరు ఆస్పత్రులకు సీటీ స్కాన్ మిషన్లు

- రూ.27 కోట్లతో ఏర్పాటుకు మంత్రి సత్యకుమార్ ఆమోదం
- రూ.17 కోట్లతో మూడు ఆస్పత్రులకు క్యాథ్‌ల్యాబ్‌లు

అమరావతి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజనాస్పత్రుల్లో (జీజీహెచ్) రోగ నిర్ధారణ పరీక్షల సామర్థ్యాన్ని పెంచే ప్రయత్నంలో భాగంగా జీజీహెచ్‌ల్లో సీటీ స్కాన్లు, క్యాథ్‌ల్యాబ్‌ల ఏర్పాటుకు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆమోదం తెలిపారు. విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, తిరుపతి, కర్నూలు జీజీహెచ్‌ల్లో సీటీ స్కాన్లు ఏర్పాటు చేయనున్నారు. విశాఖలోని ప్రభుత్వ చెస్ట్ అండ్ కమ్యూనికబుల్ డిసీజెస్ ఆస్పత్రిలో తొలిసారిగా సీటీస్కాన్ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీనికి రూ.27 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసి, నిధుల విడుదలకు ఆమోదం తెలిపింది. ఇప్పటికే రాష్ట్రంలోని 18జీజీహెచ్‌ల్లో 21 సీటీస్కాన్ పరికరాలు ద్వారా రోగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. తాజాగా శ్రీకాకుళం, నెల్లూరు, తిరుపతి జీజీహెచ్‌ల్లో గుండె పరీక్షలు చేసే క్యాథ్‌ల్యాబ్‌లు ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటయ్యే ఈ పరికరాల కొనుగోలుకు దాదాపు రూ.17కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఈ నిధుల విడుదలకు మంత్రి ఆమోదం తెలిపారు. ప్రస్తుతం విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ, గుంటూరు, ఒంగోలు, కర్నూలు, కడప, అనంతపురం జీజీహెచ్‌ల్లో క్యాథ్‌ల్యాబ్‌ల ద్వారా యాంజియోగ్రామ్, స్టెంట్ల ఏర్పాటు సేవలందిస్తున్నారు.

కొవిడ్ పరీక్షల సామర్థ్యం పెంచండి

- ప్రతిరోజు వెయ్యి మందికి పరీక్షలు జరిపే స్థాయికి రావాలి
- స్పెషల్ సీఎస్ కృష్ణబాబు ఆదేశాలు

అమరావతి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కేసులు పెరుగుతున్న దృష్ట్యా కొవిడ్ పరీక్షల సామర్థ్యాన్ని పెంచాలని ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు అధికారులను ఆదేశించారు. రోజుకు వెయ్యి మందికి కొవిడ్ పరీక్షలు చేసేస్థాయిలో ఏర్పాట్లు ఉండాలని కోరారు. సోమవారం ఆయన సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్రంలో తక్కువ స్థాయిలో కొవిడ్ కేసులు నమోదవుతున్నాయని, జ్వరం వంటి రోగ లక్షణాలతో ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తున్న వారికి కొవిడ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. కొవిడ్ పరీక్షలు చేయడానికి అవసరమయ్యే వీటీఎం, ఆర్ఎన్ఏ, ఆర్‌టీపీసీఆర్ కిట్ల లభ్యతపై కృష్ణబాబు వాకబు చేశారు. పాత జీజీహెచ్‌ల్లో (గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్) రోజుకు వంద చొప్పున, కొత్త జీజీహెచ్‌ల్లో రోజుకు 50 చొప్పున పరీక్షలు చేసేందుకు అవసరమైన కిట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. నెల రోజులకు అవసరమయ్యే కిట్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో రెండు లక్షలకు పైగా పీపీఈ కిట్లు, 60 వేలకు పైగా వీటీఎం కిట్లు ఉన్నాయని, ఆస్పత్రుల అవసరాల మేరకు వాటిని అందించాలన్నారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ కమిషనర్ జి.వీరపాండియన్, ఎండీ వి. గిరీశ, డీఎంఈ డాక్టర్ నరసింహం, సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ ఎ.సిరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గుంటూరులో రెండు కొవిడ్ కేసులు

గుంటూరు మెడికల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో సోమవారం రెండు కొవిడ్-19 పాజిటివ్ కేసులు నమోదైనట్టు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే విజయలక్ష్మీ వెల్లడించారు. జిల్లాలో ఇప్పటి వరకు తెనాలి, ఉండవల్లి ప్రాంతాల్లో కొవిడ్ పాజిటివ్ కేసులు నమోదు కాగా, తాజాగా గుంటూరు నగర పరిధిలో కేసులు వెలుగుచూశాయి. బాధితులను ఆస్పత్రిలో చేర్చుకొని వైద్యచికిత్స అందిస్తున్నారు. కొవిడ్ అనుమానిత లక్షణాలతో వచ్చే వారికి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు గుంటూరు ప్రభుత్వాస్పత్రి క్యాజువాలిటీ సమీపంలో ప్రత్యేక ఓపీ ఏర్పాటు చేశారు. రోజుకి కనీసం వంద మందికి పరీక్షలు చేసే విధంగా ఏర్పాట్లు చేశారు. కరోనా రోగులకు చికిత్స నిమిత్తం బీ క్లాస్ వార్డులో 15 పడకలతో ఐసోలేషన్ వార్డును ఏర్పాటు చేశారు. ఇక్కడ వెంటిలేటర్లతో పాటు ఆక్సిజన్‌ను కూడా సిద్ధం చేశారు.



ఇండిగో విమానాన్ని ఢీకొట్టిన పక్షి

రాంచీ, జూన్ 2: ఇండిగో విమానానికి సోమవారం ప్రమాదం తప్పింది. దాదాపు 175 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఇండిగో ఎయిర్‌బస్ 320 విమానాన్ని రాబందు ఢీ కొట్టింది. దీంతో ఆ విమానాన్ని రాంచీలోని బిర్సా ముండా విమానాశ్రయంలో అత్యవసరంగా దింపాల్సి వచ్చిందని ఓ అధికారి తెలిపారు. విమానం రాంచీకి దాదాపు 10 నుంచి 12 నాటికల్ మైళ్ల దూరంలో 3-4వేల అడుగుల ఎత్తులో ఉండగా పక్షి ఢీకొన్నదని, దీంతో పైలెట్ విమానాన్ని అత్యవసరంగా ల్యాండింగ్ చేయాల్సి వచ్చిందని విమానాశ్రయ డైరెక్టర్ ఆర్ఆర్ మౌర్య పేర్కొన్నారు. పట్నా నుంచి రాంచీకి విమానం వస్తుండగా మధ్యాహ్నం 1.14 గంటలకు ఈ ఘటన జరిగింది.

ఆర్టీఐ దరఖాస్తులకు ఓటీపీతో మెయిల్ ధ్రువీకరణ

న్యూఢిల్లీ, జూన్ 2: సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద చేసే అన్ని దరఖాస్తుల ఈ-మెయిల్ ధ్రువీకరణను జూన్ 16 నుంచి వన్ టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ) ద్వారా అమలు చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు సమాచార హక్కు చట్టం అధికారిక వెబ్‌సైట్‌లో వ్యక్తిగత, శిక్షణా విభాగం కింద సోమవారం ప్రచురితమైన ఓ సందేశంలో పేర్కొంది. దరఖాస్తుదారుల వివరాలను గోప్యంగా ఉంచడం, సమాచార భద్రతను మెరుగుపరచడంతో పాటు పోర్టల్ సైబర్ సెక్యూరిటీ ఫ్రేమ్‌వర్క్‌ను బలోపేతం చేయడం కోసం ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపింది.

6న వక్ఫ్ పోర్టల్ 'ఉమీద్' ప్రారంభం

- ఆరు నెలల్లో ఆస్తుల రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి: కేంద్రం

న్యూఢిల్లీ, జూన్ 2: వక్ఫ్ సవరణ చట్టం అమలుపై ముందుకెళ్లాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం ఉద్దేశించిన ప్రత్యేక పోర్టల్ 'ఉమీద్' (యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్, ఎంపవర్‌మెంట్, ఎఫిషియన్సీ అండ్ డెవలప్‌మెంట్)ను ఈ నెల 6న ఆవిష్కరించనుంది. వక్ఫ్ ఆస్తులు అన్నింటినీ ఆరు నెలల్లోగా ఈ పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుందని సూచించింది. ఆస్తుల కొలతలు, వివరాలు, జియో ట్యాగింగ్ లోకేషన్‌ను కూడా జత చేయాల్సి ఉంటుంది. సకాలంలో ఆస్తులను రిజిస్టర్ చేయకపోతే వాటిని వివాదాస్పద ఆస్తులుగా పరిగణించి ట్రిబ్యునల్ పరిశీలనకు పంపిస్తారు. మహిళల పేరున వక్ఫ్‌ను ఏర్పాటు చేయకూడదని తెలిపింది. మరోవైపు, వక్ఫ్ సవరణ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పలు వ్యాజ్యాలపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది.

నీట్ పీజీ పరీక్ష వాయిదా

హైదరాబాద్, జూన్ 2: వైద్య విద్యలో పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే 'నీట్ పీజీ' పరీక్ష వాయిదా పడింది. ఈ నెల 15న జరగాల్సిన ఈ పరీక్షను వాయిదా వేస్తున్నట్లు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామ్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) సోమవారం ప్రకటించింది. ఈ జాతీయ పరీక్షను రెండు షిఫ్టుల్లో కాకుండా దేశవ్యాప్తంగా ఒకే షిఫ్టులో నిర్వహించాలంటూ సుప్రీంకోర్టు మే 30 కీలక ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తగిన పరీక్షా కేంద్రాలు, మౌలిక సదుపాయాల ఏర్పాటు కోసం నీట్ పీజీ పరీక్షను వాయిదా వేస్తున్నట్లు ఎన్‌బీఈఎంఎస్ పేర్కొంది. పరీక్ష నిర్వహించే కొత్త తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలిపింది.

మహిళా సెక్స్ వర్కర్లలో తెలుగు రాష్ట్రాలు టాప్ ఫైవ్‌లో!

న్యూఢిల్లీ, జూన్ 2: దేశవ్యాప్తంగా ఉన్న మహిళా సెక్స్ వర్కర్లలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో, తెలంగాణ ఐదో స్థానంలో ఉన్నాయి. ఏపీలో 12శాతం, తెలంగాణలో 7.6శాతం మహిళా సెక్స్ వర్కర్లు ఉన్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ప్రొగ్రామెటిక్ మ్యాపింగ్ అండ్ పాపులేషన్ సైజ్ ఎస్టిమేషన్ (పీఎంపీఎస్ఈ) పేర్కొంది. ఈ మేరకు 15.4 శాతం మహిళా సెక్స్ వర్కర్లతో కర్ణాటక దేశంలోనే ప్రథమ స్థానంలో ఉంది.

క్షణాల్లో వాతావరణ సమాచారం

- షార్‌తో ఆర్‌టీజీఎస్ కీలక ఒప్పందం

అమరావతి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఉపగ్రహం ద్వారా క్షణాల్లో వాతావరణ సమాచారం అందించేలా షార్ (ఇస్రో)తో ఆర్‌టీజీఎస్ కీలక ఒప్పందం చేసుకుంది.



సీఎం సమక్షంలో ఒప్పంద పత్రాలతో షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, ఆర్‌టీజీఎస్ సీఈవో ప్రఖర్ జైన్

సీఎం చంద్రబాబు, సీఎస్ విజయానంద్ సమక్షంలో ఐదేళ్లపాటు వాతావరణ సమాచారాన్ని అందించేలా షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, ఆర్‌టీజీఎస్ సీఈవో ప్రఖర్ జైన్ మధ్య అవగాహన ఒప్పందం జరిగింది. ఒప్పందం వల్ల వాతావరణ సమాచారం ఉపగ్రహ ఛాయాచిత్రాలతో సహా ఆర్‌టీజీఎస్‌కు చేరతాయి. దీని ఆధారంగా అధికారులు ఎస్ఎంఎస్‌లు, సోషల్ మీడియా ద్వారా ప్రజలను అప్రమత్తం చేస్తారు. ఒప్పందంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు.

దాడి చేసిన విమానాలు ధ్వంసం

ఉక్రెయిన్ 'ఆపరేషన్ స్పైడర్ వెబ్' టార్గెట్ అదే.. రష్యా టీయూ-22ఎం3, టీయూ-95 బాంబర్లకు చావు దెబ్బ

- 34% దీర్ఘశ్రేణి క్షిపణి వాహకాలు ధ్వంసం
- నష్టం విలువ సుమారు 59 వేల కోట్లు
- వెల్లడించిన ఉక్రెయిన్ సైన్యం
- మా గడ్డ పైనుంచే దాడి జరిగింది: రష్యా



ఎస్‌బీయూ చీఫ్ మాలిక్‌ను అభినందిస్తున్న జెలెన్‌స్కీ

కీవ్/ఇస్తాంబుల్, జూన్ 2: మూడేళ్లుగా ఉక్రెయిన్‌పై రష్యా ముప్పేట దాడులు చేస్తోంది. దీర్ఘశ్రేణి క్షిపణులతో విరుచుకుపడుతోంది. ఇందుకోసం తన దీర్ఘశ్రేణి క్షిపణి వాహక యుద్ధ విమానాలు(బాంబర్లు) టీయూ22ఎం3, టీయూ-95, టీయూ-160లను వినియోగిస్తోంది. వీటికి నావిగేషన్ సహకారం అందించేందుకు ఏ-50 అవాక్స్‌ను ఉపయోగించుకుంటోంది. దాంతో ప్రతీకారేచ్ఛతో రగిలిపోయిన ఉక్రెయిన్.. ఈ యుద్ధ విమానాలను టార్గెట్‌గా చేసుకుంది. అందుకోసం 18 నెలల క్రితం 'ఆపరేషన్ స్పైడర్ వెబ్'కు శ్రీకారం చుట్టింది. ఆపరేషన్ అమలు బాధ్యతలను సెక్యూరిటీ సర్వీస్(ఎస్‌బీయూ)కు అప్పగించింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్వయంగా ఈ ఆపరేషన్‌ను పర్యవేక్షించారు. తమ ఆపరేషన్‌ను అతి క్లిష్టమైన ఆధునిక యుద్ధ తంత్రంగా పేర్కొంటూనే.. బెలాయా(సైబీరియా సమీపంలో), ఒలేన్యా(ఆర్కిటిక్ సమీపంలో.. కోలా ద్వీపకల్పంలో), ఇవానోవో, డియాగిలెవ్‌లో ఉన్న రష్యన్ ఎయిర్‌బేస్‌ల వద్ద 117 ఎఫ్‌పీవీ డ్రోన్లను మోహరించింది. వీటిని రష్యాకు తరలించేందుకు ట్రక్కు డ్రైవర్లు, రష్యన్ భాష తెలిసిన ఉక్రెనియన్లను ఏజెంట్లుగా నియమించింది. గగనతలంలో చొచ్చుకువచ్చే డ్రోన్లను, క్షిపణులను అడ్డుకునే సాంకేతికత రష్యా వద్ద ఉన్న నేపథ్యంలో.. ట్రక్కుల్లో రోడ్డు మార్గాల్లో తన డ్రోన్లను తరలించింది. అంతేకాదు.. ఈ ఆపరేషన్ కోసం శ్రమించిన చివరి ఏజెంట్ కూడా క్షేమంగా ఉక్రెయిన్ భూభాగంలోకి అడుగుపెట్టాకే.. ఆదివారం ఉదయం ఆపరేషన్‌ను అమలు చేసి, 41 యుద్ధ విమానాల(బాంబర్ల)ను ధ్వంసం చేసింది. ఈ విజయంపై ఎస్‌బీయూ చీఫ్ మాలిక్‌ను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అభినందించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ వివరాలను బయటి ప్రపంచానికి తెలియజేశారు. ఇన్నాళ్లు తమ ఏజెంట్లు రష్యా ఎఫ్ఎస్‌బీ(నిఘా సంస్థ) ప్రధాన కార్యాలయం సమీపంలోనే మకాం వేశారని వెల్లడించారు. ఉక్రెయిన్ సైన్యం కూడా ఈ ఆపరేషన్ తమకు అతిపెద్ద విజయం అని పేర్కొంది. రష్యా వద్ద సుమారు 120 వరకు దీర్ఘశ్రేణి క్షిపణి వాహక బాంబర్లు ఉన్నాయని.. వాటిల్లో 34% (41 విమానాలు) ధ్వంసమయ్యాయని తెలిపింది. తమ దాడుల వల్ల రష్యాకు కలిగిన నష్టం అంచనా రూ.59 వేల కోట్లుగా ఉంటుందని వెల్లడించింది. అటు రష్యా కూడా నాలుగు ఎయిర్ బేస్‌లపై ఉగ్రవాద దాడులు జరిగాయని ప్రకటించింది. డ్రోన్లు ఉక్రెయిన్ భూభాగం నుంచి రాలేదని స్పష్టం చేసింది. అవి తమ భూభాగం నుంచే ఎగిరినట్లు పరోక్షంగా అంగీకరించింది. ఆదివారం నాటి ఉక్రెయిన్ 'ఆపరేషన్ స్పైడర్ వెబ్'కు ప్రతీకారంగా రష్యా తన దాడులను కొనసాగిస్తోంది. అయితే.. సరిహద్దుల్లో ముఖాముఖి ఘర్షణల్లో ఆదివారం ఒక్కరోజే 1,140 మంది రష్యా సైనికులు చనిపోయారని ఉక్రెయిన్ సైన్యం ప్రకటించింది. దీనిపై రష్యా నుంచి అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

తేలని శాంతి చర్చలు

ఇస్తాంబుల్‌లో రష్యా-ఉక్రెయిన్ మధ్య జరిగిన శాంతి చర్చలు ఎటూ తేలలేదని అంతర్జాతీయ మీడియా పేర్కొంది. 30 రోజుల కాల్పుల విరమణకు ఉక్రెయిన్ ప్రతిపాదించగా.. 2-3 రోజులకు అయితే సుముఖమని రష్యా వెల్లడించింది. ఈ నెల 20 నుంచి 30 వరకు ఉన్నతస్థాయిలో చర్చలు జరపాలని ఉక్రెయిన్ కోరగా.. రష్యా ఎలాంటి సమాధానమివ్వలేదు. అదేవిధంగా యుద్ధం ప్రారంభంలో డాన్‌బాస్(లుహాన్స్క్, డోనెట్స్క్), ఖార్కివ్, మారియపోల్ వంటి ప్రాంతాల నుంచి రష్యా సైన్యం అపహరించిన చిన్నారుల జాబితాను అందజేసిన ఉక్రెయిన్.. వారిని భేషరతుగా తిరిగి అప్పగించాలని కోరింది. దీనికి కూడా రష్యా అంగీకారం తెలపలేదని అంతర్జాతీయ మీడియా వెల్లడించింది. యుద్ధ ఖైదీల మార్పిడి, యుద్ధంలో అమరుల మృతదేహాల అప్పగింతకు ఇరుదేశాల మధ్య తాజా చర్చల్లో ఏకాభిప్రాయం కుదిరింది. యువ సైనికులను, యుద్ధ ఖైదీలను 1:1 ప్రతిపాదికన 6వేల మందిని అప్పగించుకోవాలని ఇరుదేశాలు అంగీకరించాయి. ఈ విషయాన్ని ఉక్రెయిన్ రక్షణ మంత్రి ఉమెరోవ్ నిర్ధారించారు.

అన్నా వర్సిటీ విద్యార్థినిపై రేప్ కేసు.. బిర్యానీ మాస్టరే దోషి

- తేల్చిన చెన్నై మహిళా కోర్టు
- నిందితునికి యావజ్జీవ కారాగార శిక్ష

చెన్నై, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సంచలనం రేపిన అన్నా యూనివర్సిటీ విద్యార్థినిపై అత్యాచారం కేసులో చెన్నై మహిళా కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. మొదటినుంచి నిందితునిగా ఉన్న వ్యక్తే దోషి అని తేల్చిన కోర్టు.. అతనికి యావజ్జీవ కారాగారశిక్ష, రూ.90వేల జరిమానా విధించింది. ఈ తీర్పు ప్రకారం ముద్దాయి జ్ఞానశేఖరన్ ఎలాంటి జైలు రాయితీలు లేకుండా 30 ఏళ్లపాటు ఏకబిగిన కఠినకారాగార శిక్ష అనుభవించాలని, అపరాధ సొమ్మును బాధిత విద్యార్థినికి అందజేయాలని స్పష్టం చేసింది. గత ఏడాది డిసెంబర్ 23 రాత్రి అన్నా విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఉన్న పీజీ ద్వితీయ సంవత్సరం విద్యార్థినిపై అదే ప్రాంతానికి చెందిన వ్యక్తి లైంగిక దాడికి పాల్పడి ఆ దృశ్యాలను మొబైల్‌లో వీడియో తీశాడు. ఈ ఘటనపై బాధిత విద్యార్థిని కోట్టూరుపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఆ ప్రాంతంలో బిర్యానీ షాపు నడుపుతున్న జ్ఞానశేఖరన్(37)ను డిసెంబర్ 24న అరెస్టు చేశారు. నిందితునికి డీఎంకే నేతలతో సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ కేసును సీబీఐకి అప్పగించాలని అన్నాడీఎంకే హైకోర్టును ఆశ్రయించగా.. మహిళా ఐపీఎస్ అధికారులు స్నేహప్రియ, బృందా, ఐమాన్ జమాల్‌తో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించారు. ఆ దర్యాప్తు బృందం విచారణ జరిపి గత ఫిబ్రవరి 24న సైదాపేట 9వ క్రైం కోర్టులో ఛార్జిషీటు సమర్పించింది. విద్యార్థినిపై జరిగిన అత్యాచారం కేసులో జ్ఞానశేఖరన్ తప్ప ఇతరులెవరికీ సంబంధంలేదని నివేదించింది. గత మార్చి 7న ఈ కేసు విచారణను చెన్నై మహిళా కోర్టుకు బదిలీ చేశారు. అక్కడ కేసు విచారణ ముగియడంతో న్యాయాధికారి ఎం.రాజలక్ష్మి సోమవారం తీర్పు వెలువరించారు.

భారత్‌కు మరో రెండు స్క్వాడ్రన్ల ఎస్-400

- వచ్చే ఏడాది నాటికి అందజేస్తాం
- రష్యా ఉప రాయబారి బాబుష్కిన్ వెల్లడి

న్యూఢిల్లీ, జూన్ 2: ముందు అనుకున్న ప్రకారమే 2025-26 నాటికి మిగిలిన రెండు స్క్వాడ్రన్ల ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థలను భారత్‌కు అందజేస్తామని.. భారత్‌లో రష్యా ఉప రాయబారి రోమన్ బాబుష్కిన్ స్పష్టం చేశారు. ఇటీవలి భారత్-పాకిస్థాన్ ఘర్షణల సందర్భంగా ఎస్-400 సమర్థవంతంగా పని చేసినట్లు తమకు తెలిసిందన్నారు. 543 కోట్ల డాలర్ల విలువైన ఐదు ఎస్-400 స్క్వాడ్రన్ల కొనుగోలుకు భారత్ 2018లో రష్యాతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇప్పటికే మూడు స్క్వాడ్రన్లు భారత్‌కు చేరాయి. భారత్‌తో రక్షణ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు వీలుగా.. గగనతల రక్షణ వ్యవస్థలకు సంబంధించిన చర్చలను ముందుకు తీసుకెళ్లటానికి సిద్ధంగా ఉన్నామని బాబుష్కిన్ వెల్లడించారు. భారత్-పాక్ ఘర్షణలో డ్రోన్లను భారీఎత్తున వినియోగించటాన్ని గుర్తుచేస్తూ.. డ్రోన్ల సమస్యను తాము చాలాకాలంగా ఎదుర్కొంటున్నామన్నారు. డ్రోన్లను నిలువరించే సాంకేతికతను తాము ఎప్పటికప్పుడు ఆధునీకరిస్తున్నామని, భారత్-రష్యా రక్షణ భాగస్వామ్యం చర్చల్లో యాంటీ డ్రోన్ వ్యవస్థలు కూడా కీలకాంశమని గుర్తు చేశారు.

4 వేలకు పెరిగిన కొవిడ్ కేసులు

న్యూఢిల్లీ, జూన్ 2: దేశవ్యాప్తగా కొవిడ్ మహమ్మారి విజృంభిస్తోంది. కొవిడ్ పాజిటివ్ కేసుల సంఖ్య 3,758 నుంచి క్రమేపీ పెరిగి సోమవారం నాటికి 3,961కి చేరింది. ఈమేరకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఓ ప్రకటన చేసింది. పశ్చిమ బెంగాల్‌లో పాజిటివ్ కేసుల వ్యాప్తి ఎక్కువగా ఉంది. మొత్తం కేసుల సంఖ్య 280కి చేరింది. ఢిల్లీ, కేరళ, గుజరాత్‌లలో కూడా గుర్తించతగ్గ స్థాయిలో ఈ పెరుగుదల ఉంది. తాజాగా కర్ణాటక, కేరళలో ఇద్దరు మరణించారు. దీంతో కొవిడ్ మరణాల సంఖ్య 28కి చేరింది. కొవిడ్ వ్యాప్తికి ప్రధానంగా ఎన్‌బీ.1.8.1, ఎల్ఎఫ్ 7 రకాలే కారణమని మంత్రిత్వ శాఖ ప్రకటించింది.

ముందే ముగిసిన వేసవి!



- అంచనాల కంటే ముందే విచ్చేసిన నైరుతి
- అకాల వర్షాలతో చల్లబడిన వాతావరణం

న్యూఢిల్లీ, జూన్ 2: మే నెల మొదలైందంటే చాలు.. ఎండలు మండిపోతాయి. విపరీతమైన ఎండలు, వేడిగాలులు, ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. 2024లోనూ భారత్‌లో ఎండలు఼ ఠారెత్తించాయి. కాబట్టి.. ఈ ఏడాది కూడా ఉష్ణోగ్రతలు మండిపోతాయని అందరూ బావించారు. కానీ, దానికి భిన్నంగా ఈసారి వేసవి ఆరంభానికి ముందే చాలా ప్రాంతాలు అనూహ్యంగా చల్లబడ్డాయి. నైరుతి రుతుపవనాలు ముందే రావడం, అకాల వర్షాలు కురవడం, మేఘావృతంగా ఉండడంతో మే నెలలో ఎక్కువగా చల్లని వాతావరణం నెలకొంది. రికార్డులు నమోదుచేయడం ప్రారంభించినప్పటి నుంచి 2024 అత్యంత వేడి సంవత్సరంగా నిలవగా.. 2025లో మాత్రం ఎండలు ఎక్కువయ్యే సమయాని కంటే ముందే వేసవి ముగిసింది. గతేడాది మే, జూన్ నెలల్లో అనేక ప్రాంతాల్లో వేడి గాలులు, ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. కరువు పరిస్థితులు తీవ్రమయ్యాయి. కానీ.. ఈ ఏడాది చాలా ప్రాంతాల్లో వాతావరణం చల్లబడింది. దేశ వాతావరణ నమూనాల్లో ఇదొక పెద్ద మార్పును సూచిస్తోంది.

తేమ గాలులు.. మారిన నమూనాలు..

అయితే ఈ క్రమరాహిత్యానికి అనేక అంశాలు దోహదపడి ఉండొచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ముందస్తు తేమ గాలుల ప్రభావం, మారిన గాలి నమూనాలతో పాటు రుతుపవనాల రాకలో మార్పులు ఉష్ణోగ్రతల పెరుగుదలను తగ్గించడంలో కీలక పాత్ర పోషించాయని చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో మేఘావృతమైన వాతావరణం, అప్పుడప్పుడూ కురిసిన వర్షాలతో ఉష్ణోగ్రతలు మరింత తగ్గాయి. వాతావరణం చల్లబడడం వల్ల తీవ్రమైన వేడి నుంచి ఉపశమనం దక్కింది. అలాగే విద్యుత్ డిమాండ్ కూడా తగ్గింది. వేసవి ముందే ముగియడం వల్ల కొన్ని సమస్యలు కూడా ఎదురవుతాయి. ముఖ్యంగా వ్యవసాయ చక్రం దెబ్బతింటుంది. అధిక ఉష్ణోగ్రతలు అవసరమైన కొన్ని పంటల పెరుగుదలపై ఇది ప్రభావం చూపుతుంది. రైతులు ఈ పరిణామాలను నిశితంగా పరిశీలించి విత్తనాలు, కోత సమయాలను తదనుగుణంగా మార్చుకోవాల్సి ఉంటుంది. ఈ ఏడాది వేసవి ఆరంభంలోనే వేడి నుంచి తాత్కాలిక ఉపశమనం లభించినప్పటికీ.. భారత వాతావరణానికి సంబంధించి సంక్లిష్టమై, మారుతున్న స్వభావాన్ని ఇది సూచిస్తోందని నిపుణులు అంటున్నారు.

సైనిక శిబిరంపై పడ్డ కొండచరియలు

- ముగ్గురి మృతి.. ఆరుగురి గల్లంతు

గ్యాంగ్‌టక్, జూన్ 2: సిక్కింలోని ఛటేన్‌లో సైనిక శిబిరంపై కొండచరియలు విరిగిపడడంతో ముగ్గురు భద్రతా సిబ్బంది మృతిచెందగా, ఆరుగురి జాడ గల్లంతయింది. ఆదివారం రాత్రి 7గంటల సమయంలో భారీ వర్షం పడడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకున్నట్లు రక్షణ శాఖ అధికారి ఒకరు తెలిపారు. ఈ ప్రమాదంలో మరణించిన సిబ్బంది లఖ్వీందర్ సింగ్, లాన్స్ నాయక్ మునీశ్ ఠాకూర్, అభిషేక్ లఖాడ మృతదేహాలను వెలికి తీశామని ఆయన వెల్లడించారు. మరో నలుగురు సైనికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారని చెప్పారు. గల్లంతైన వారిని రక్షించేందుకు సహాయక బృందాలు శ్రమిస్తున్నాయన్నారు.



సిక్కింలోని ఛటేన్‌లో కొండచరియలు విరిగిపడిన ప్రాంతం

లోకం తీరు



'బనకచర్ల'కు సాయం చేయండి

- కేంద్రానికి రాష్ట్రప్రభుత్వం వినతి
- ఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖతో పీయూష్ బృందం భేటీ
- పోలవరం-బనకచర్ల అనుసంధానంపై ప్రజెంటేషన్
- సమగ్ర రిపోర్టు అందిస్తే నిధుల విడుదలపై కార్యాచరణ
- కేంద్ర అధికారుల హామీ
- నెలాఖరుకల్లా అందిస్తామన్న ప్రభుత్వం

అమరావతి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కరువు ప్రాంతం రాయలసీమను సస్యశ్యామలం చేయడానికి, పల్నాడు ప్రాంతాన్ని దుర్భిక్షానికి దూరం చేసేందుకు తలపెట్టిన పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకానికి సహకరించాలని రాష్ట్రప్రభుత్వం కేంద్రాన్ని అభ్యర్థించింది. దీనికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను సమర్పించాలని కేంద్ర ఆర్థిక శాఖ సూచించింది. అది అందితే నిధుల విడుదలపై కార్యాచరణ సిద్ధంచేస్తామని హామీ ఇచ్చింది. దాదాపు రూ.80 వేల కోట్ల అంచనా వ్యయంతో రూపుదిద్దుకుంటున్న ఈ ప్రాజెక్టుపై సోమవారం ఢిల్లీలో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్.. కేంద్ర ఆర్థిక శాఖ (వ్యయం) కార్యదర్శి నాగరాజును కలిసి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో జల వనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి, ఎస్‌ఈ రాంబాబు, కేంద్ర ఆర్థిక శాఖ అండర్ సెక్రటరీ అనిల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. దేశంలో మొదటిసారిగా వరద జలాలను ఎత్తిపోయడం ద్వారా కృష్ణా, గోదావరి నదుల అనుసంధానం తలపెట్టామని పీయూష్ తెలిపారు. 'జలహారతి' పేరిట ప్రతిష్ఠాత్మకంగా చేపట్టదలచిన ఈ పథకానికి ప్రాథమికంగా రూ.80,000 కోట్ల మేర వ్యయమవుతుందని అంచనా వేసినట్లు చెప్పారు. దీనికి నదుల అనుసంధాన కార్యక్రమంలో భాగంగా కేంద్రం ప్రత్యేకంగా ఇచ్చే నిధులతోపాటు విదేశీ ఆర్థిక సంస్థల నుంచి కూడా రుణాలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇది పోలవరం ప్రాజెక్టు కంటే చాలా పెద్దదైనందున స్వల్పకాలికంగా కాకుండా దీర్ఘకాలం.. ఏడేళ్లపాటు ఆర్థిక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. దీని ప్రాథమిక సాధ్యాసాధ్యాల నివేదికను ఇప్పటికే కేంద్ర జల సంఘానికి పంపామన్నారు. దీంతో సమగ్ర ప్రాజెక్టు నివేదికను సమర్పించాలని అనిల్ యాదవ్ సూచించారు. ఈ నెలాఖరునాటికి రిపోర్టును సిద్ధం చేసి సమర్పిస్తామని పీయూష్ తెలిపారు.

వరద జలాల సద్వినియోగానికి..

బనకచర్ల పథకం రూపకల్పనపై పీయూష్ చెప్పిన సమాచారాన్ని ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు సావధానంగా విన్నారు. 'ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి జలాలను సద్వినియోగం చేసుకునేలా తెలంగాణ భూభాగంలో ప్రాజెక్టుల నిర్మాణం జరిగింది. విభజిత ఆంధ్రప్రదేశ్ కూడా గోదావరి జలాలను సంపూర్ణంగా సద్వినియోగం చేసుకోవాలంటే పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకాన్ని చేపట్టాల్సిన అవసరం ఉంది. ఏటా 2,800 నుంచి 3,200 టీఎంసీల గోదావరి జలాలు వరదల సమయంలో వృఽథాగా కడలిపాలవుతున్నాయి. ఈ వరదనీటి సద్వినియోగానికే బనకచర్ల పథకం చేపట్టాలని నిర్ణయించాం. వరద జలాలను సద్వినియోగం చేసుకునే నదుల అనుసంధాన పథకం దేశంలో ఇదే మొట్టమొదటిది. దిగువ రాష్ట్రంగా సముద్రంలో కలసిపోతున్న వరద జలాలను వాడుకునే స్వేచ్ఛ ఆంధ్రప్రదేశ్‌కు ఉంది. ఈ పథకం కింద వరద జలాలనే తరలిస్తాం' అని స్పష్టంచేశారు. మరింత సవివరంగా చెప్పాలని అనిల్ యాదవ్ కోరారు. గోదావరి నదికి జూలై 1 తేదీ నుంచి అక్టోబరు మధ్యదాకా వరద ఉధృతంగా ఉంటుందని పీయూష్ వెల్లడించారు. ఈ వరద నీటిలో 200 టీఎంసీలను 100 రోజుల్లో ఎత్తిపోస్తామని తెలిపారు. ఈ వివరాలు ఆలకించాక కేంద్ర ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించారు. డీపీఆర్‌ను సమర్పిస్తే.. నిధుల విడుదలపై కార్యాచరణ వెల్లడిస్తామని హామీ ఇచ్చారు.

పెద్దిరెడ్డి పిటిషన్‌పై కౌంటర్ వేయండి

- బుగ్గమఠం భూముల వ్యవహారంపై ప్రభుత్వానికి సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): బుగ్గమఠం భూముల వ్యవహారంపై ఏపీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సోమవారం నోటీసులు జారీ చేసింది. మాజీ మంత్రి, వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిటిషన్‌పై వారం రోజుల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. అదేవిధంగా ఆ కౌంటర్‌కు వారం రోజుల్లో రిజాయిండర్ దాఖలు చేయాలని పెద్దిరెడ్డికి న్యాయస్థానం ఆదేశాలు జారీచేసింది. అప్పటి వరకు భూములపై యథాతథ స్థితి కొనసాగించాలని జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సతీష్ చంద్ర శర్మ ధర్మాసనం స్పష్టం చేసింది. పిటిషన్ మరోసారి ఆగస్టు 5న విచారణకు వచ్చే అవకాశముంది. తిరుపతి నగరంలోని ఎమ్మార్ పల్లి పరిధి సర్వే నంబరు 261/1లో 1.50 ఎకరాలు, 261/2లో 2.38 ఎకరాలు బుగ్గమఠానికి చెందిన భూములను పెద్దిరెడ్డి ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని, వాటిని పది రోజుల్లో ఖాళీ చేయాలని పేర్కొంటూ ఈవో గతంలో ఉత్తర్వులిచ్చారు. వీటిని సవాలు చేస్తూ పెద్దిరెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. ఆక్రమిత భూమిని ఖాళీ చేయాలని, అందులోని నిర్మాణాలను తొలగించాలని మఠం ఈవో/అసిస్టెంట్ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులపై అభ్యంతరాలు ఉంటే ఎండోమెంట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాలని హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు తీర్పును మాజీ మంత్రి పెద్దిరెడ్డి గత నెల 28న సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్‌పై సోమవారం విచారణ సందర్భంగా ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా, పిటిషనర్ తరఫున ముకుల్ రోహిత్గి వాదనలు వినిపించారు. ఈవో/అసిస్టెంట్ కమిషనర్ ఉత్తర్వులపై ఎండోమెంట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాలని, విషయాన్ని హైకోర్టు స్పష్టం చేసిందని సిద్ధార్థ్ లూథ్రా పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత ధర్మాసనం పై మేరకు ఆదేశాలు ఇచ్చింది.

ఆస్పత్రి నుంచి జైలుకు వంశీ



విజయవాడ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ విజయవాడలోని ఆయుష్ ఆస్పత్రి నుంచి సోమవారం డిశ్చార్జి అయ్యారు. విజయవాడ జిల్లా జైలులో ఉన్న ఆయనను హైకోర్టు ఆదేశాలతో మే 30న ఆస్పత్రిలో చేర్పించారు. మూడు రోజులు ఇన్‌పేషెంట్‌గా ఉంచి సోమవారం సాయంత్రం డిశ్చార్జి చేయడంతో తిరిగి జిల్లా జైలుకు తరలించారు.

పీఎస్ఆర్‌కు మళ్లీ వైద్య పరీక్షలు



విజయవాడ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూపు-1 పరీక్ష పేపర్ల మూల్యాంకనంలో అవకతవకలకు పాల్పడిన కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులును జైలు సిబ్బంది సోమవారం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బీపీలో హెచ్చుతగ్గులు, రాత్రిపూట నిద్రపట్టడం లేదని ఆయన ఇటీవల చెప్పడంతో ఒకరోజు ఆస్పత్రిలో ఉంచారు. మళ్లీ అదే సమస్యను చెప్పడంతో సోమవారం జైలు నుంచి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లో వైద్య పరీక్షలు చేయించి సాయంత్రం వరకు పరిశీలనలో ఉంచారు. అనంతరం డిశ్చార్జి చేయడంతో తిరిగి జైలుకు తరలించారు. మంగళవారం మరోసారి వైద్యపరీక్షల కోసం పీఎస్ఆర్‌ను తీసుకురావాలని వైద్యులు సూచించినట్టు అధికారులు తెలిపారు.

జల రవాణాలో అధిక పెట్టుబడులే లక్ష్యం

- ఆ మార్గాలను మూడింతలు పెంచేలా చర్యలు: మంత్రి జనార్దన్



బోట్ మారథాన్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి జనార్దన్‌రెడ్డి తదితరులు

జలరవాణాలో అధిక పెట్టుబడులే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం విజయవాడలోని కృష్ణా నదిలో పున్నమిఘాట్ వద్ద బోట్ మారథాన్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జలమార్గాల ద్వారా పోర్టు కనెక్టివిటీ పెరుగుతుందని, పర్యాటకం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. పీపీపీ విధానంలో ఆయా ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇన్‌లాండ్ క్యాయిజ్ టూరిజాన్ని ప్రోత్సహిస్తాన్నారు.

మున్సిపల్ వర్కర్ల సమస్యలు సీఎం దృష్టికి

- పురపాలక శాఖ మంత్రి నారాయణ

అమరావతి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ వర్కర్ల సమస్యలపై సీఎం చంద్రబాబుతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ తెలిపారు. అమరావతి సచివాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో టెక్నికల్, నాన్ టెక్నికల్ వర్కర్లు పని చేస్తున్నారని, గత వైసీపీ ప్రభుత్వం వారిలో కొంతమందికి రూ.6 వేలు పెంచిందని, మిగిలిన వారు తమకు కూడా రూ.6 వేలు పెంచాలని కోరుతున్నారని మంత్రి నారాయణ తెలిపారు. వారి డిమాండ్లపై యూనియన్ ప్రతినిధులతో చర్చించామన్నారు. ఆర్థిక మంత్రి, అధికారులతో కూడా చర్చిస్తామని తెలిపారు.

రాష్ట్రంలో రాజ్య హింస: సజ్జల

- గుంటూరు సబ్ జైల్లో నందిగంతో ములాఖత్

గుంటూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, లోకేశ్‌ల డైరెక్షన్‌లో టార్గెట్లు పెట్టి మరీ వైసీపీ నేతలపై అక్రమ కేసులు పెడుతున్నారని వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. గుంటూరు సబ్‌జైల్లో వున్న మాజీ ఎంపీ నందిగం సురేశ్‌తో ఆయన సోమవారం అర్ధగంటకు పైగా ములాఖత్ అయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలో రాజ్యహింస జరుగుతోంది. కేవలం వైసీపీ నేతలపై కావాలని ఏదో ఒక స్క్రిప్ట్ తయారు చేసి కేసులు బనాయించి జైలుకు పంపే ప్రయత్నం కొనసాగుతోంది. ఇప్పటికే మాజీ ఎంపీ నందిగం సురేశ్‌పై అక్రమంగా 12 కేసులు బనాయించారు. మరో వైపు మాచర్లలో వైసీపీ నాయకుడు తురకా కిశోర్‌పై 8 కేసులు బనాయించారు. కొత్తగా మరొకటి ఫైల్ చేస్తున్నట్లు మాకు సమాచారం అందింది. నాలుగేళ్ల తరువాత మేం ఏం చేయాలో ఇప్పుడు టీడీపీ నేతలు నేర్పుతున్నారు. ఎల్లకాలం తమకే అధికారం ఉంటుందని చంద్రబాబు, లోకేశ్ అనుకోవద్దు. 3న తెనాలిలో పోలీసుల చేతుల్లో థర్డ్ డిగ్రీకి గురైన బాధితులను పరామర్శించేందుకు జగన్‌కు అనుమతి లేదు. కోర్టు ద్వారా అనుమతి పొందాలని ప్రయత్నాలు చేస్తున్నాం' అని సజ్జల అన్నారు. ఆయనవెంట ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీమంత్రులు విడదల రజనీ, మేరుగ నాగార్జున, అంబటి రాంబాబు, నేతలు నిమ్మకాయల రాజనారాయణ ఉన్నారు.

తహసీల్దార్ కుటుంబం సేఫ్

న్యూఢిల్లీ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): సిక్కింలో ఇటీవల సంభవించిన వరదల వల్ల ఆ రాష్ట్రంలో చిక్కుపోయిన ఏపీకి చెందిన తహసీల్దార్ కుటుంబసభ్యులు సురక్షితంగా ఉన్నారని ఏపీ భవన్ స్పెషల్ కమిషనర్ అర్జా శ్రీకాంత్ తెలిపారు. వరద నీరు తగ్గుముఖం పట్టడంతో విజయనగరం తహసీల్దార్ కూర్మనాథరావు, ఆయన భార్య ఉమ, ఇద్దరు పిల్లలు సిక్కిం రాజధాని గాంగ్‌టక్‌కు సోమవారం బయలుదేరారని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఎల్లుండి ప్రత్యేక సెలవు

- ఏపీజీఈఏ సమావేశాల కోసం సర్కారు మంజూరు

అమరావతి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) ఆధ్వర్యంలో జరగనున్న సమావేశాలకు హాజరయ్యే రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం ఒక రోజు ప్రత్యేక సాధారణ సెలవు మంజూరు చేసింది. ఈ మేరకు సోమవారం జీవో జారీచేసింది. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 5, 6 తేదీల్లో సమావేశాలు నిర్వహించాలని ఏపీజీఈఏ నిర్ణయించింది. వీటిలో ఉద్యోగులు పాల్గొనేందుకు వీలుగా రెండ్రోజులు ప్రత్యేక సెలవులివ్వాలని ప్రభుత్వాన్ని సంఘం అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ కోరారు. ఈ విజ్ఞప్తిని ప్రభుత్వం పాక్షికంగా అంగీకరించింది. 5వ తేదీన మాత్రమే సెలవు మంజూరుచేస్తూ ఆదేశాలిచ్చింది. ఈ ప్రత్యేక సెలవును పొందాలనుకునే ఉద్యోగులు తప్పనిసరిగా సాధారణ సెలవు కోసం దరఖాస్తు చేసుకోవలసి ఉంటుందని, వారికి మాత్రమే సెలవు లభిస్తుందని జీవోలో తెలిపింది.

ఇంటర్ మార్కులు సరిచూసుకోవాలి

- ఏపీఈఏపీసెట్ చైర్మన్ సీఎస్ఆర్కే ప్రసాద్

జేఎన్టీయూకే, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఏపీఈఏపీసెట్ ఫలితాలను ఈ నెల రెండో వారంలో విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ర్యాంకుల కేటాయింపులో ఇంటర్ మార్కులకు 25 శాతం వెయిటేజీ ఉన్నందున పరీక్షకు హాజరైన విద్యార్థులు ఈఏపీసెట్ వెబ్‌సైట్‌లోని డిక్లరేషన్ ఫారం ద్వారా తమ మార్కులను పరిశీలించుకోవాలని సెట్ చైర్మన్, ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. ఏపీ, తెలంగాణల్లోని ఇంటర్ రెగ్యులర్ విద్యార్థుల గ్రూపు మార్కులను వెబ్‌సైట్‌లో పొందుపరిచామని ఆయన చెప్పారు. డిక్లరేషన్ ఫారంలో అందుబాటులో ఉన్న ఇంటర్ రెగ్యులర్, ఇతర బోర్డుల విద్యార్థులకు సంబంధించిన గ్రూపు మార్కుల్లో ఎటువంటి తప్పిదాలు ఉన్నా వెంటనే 0884-2359599, 2342499 ఫోన్ నెంబర్ల ద్వారా గానీ, helpdeskapeapcet@apsche.org మెయిల్ ఐడీ ద్వారా గానీ సంప్రదించి మార్కులను మెయిల్ ద్వారా అందజేయాలని ఈఏపీసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు సూచించారు. 10+2 మార్కులను గ్రూపు మార్కులను డిక్లరేషన్ ఫారం ద్వారా అప్‌లోడ్ చేయని వారు, గ్రూప్ మార్కుల్లో తప్పిదాలు ఉన్న విద్యార్థులకు ఈ నెల 5వ తేదీలోపు సవరించుకునేందుకు అవకాశం కల్పించినట్టు కన్వీనర్ తెలిపారు.

రాజకీయాల్లో ఆర్యవైశ్యులు రాణించాలి

- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- అరుణాచలంలో ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం భవనం ప్రారంభం



అరుణాచలంలో ఆర్యవైశ్య వాసవీ నిత్యాన్నదాన సత్రం నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): దేశ రాజకీయాల్లో ఆర్యవైశ్యులు రాణించాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. తమిళనాడు రాష్ట్రం అరుణాచలం క్షేత్రంలో నూతనంగా నిర్మించిన ఆర్యవైశ్య వాసవీ నిత్య అన్నదాన సత్రం ట్రస్ట్ భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ వ్యాపార రంగంలోనే కాదు ప్రజలకు సేవలు చేయడంలోనూ, ఆధ్యాత్మిక సేవల్లో ఆర్యవైశ్యులు ముందు వరుసలో ఉంటారని తెలిపారు. ఎలాంటి విపత్తులు, ఆపదలు సంభవించినా సాయం చేసేందుకు ఆర్యవైశ్య సంఘాలు సంఘటితంగా ముందుకొస్తారని, రాజకీయాల్లో సైతం రాణించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. తెలుగు రాష్ట్రాల్లో ఆర్యవైశ్యులంటే దివంగత మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య, మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్‌లు గుర్తుకొస్తారన్నారు. ఆర్యవైశ్యుల ఆస్తుల పరిరక్షణ బాధ్యతలను టీజీ వెంకటేశ్‌పై రోశయ్య పెట్టారని గుర్తు చేశారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. దేశంలో ఎక్కడ ఆర్యవైశ్యులకు ఏ కష్టమొచ్చినా తనతో పాటు తన తండ్రి టీజీ వెంకటేశ్ అండగా ఉంటామని స్పష్టం చేశారు. అంతకుముందు మంత్రి టీజీ భరత్ దంపతులు అరుణాచల స్వామి, అపీత కుచాంబదేవిలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, మాజీ ఎమ్మెల్సీ పోతుల సునీత, పోతుల సురేశ్, వాసవీ పత్రాల సముదాయాల ప్రధాన కార్యదర్శి ఇల్లూరి లక్ష్మయ్య, ఏపీ ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శబరీశ్, బీజేపీ యువమోర్చ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా వంశీ పాల్గొన్నారు.

ఫైనాన్స్ కంపెనీ వేధింపులు భరించలేక కల్లుగీత కార్మికుని ఆత్మహత్య

- ఆర్థిక సమస్యలతో మనోవేదన
- వాయిదాలు కట్టాలంటూ ఒత్తిడి
- ఇంటిగోడపై అప్పు ఉన్నట్టు రాతలు



భార్య, కొడుకుతో మృతుడు రత్తయ్య (ఫైల్)

కలిగిరి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధుల వేధింపులు తట్టుకోలేక నెల్లూరు జిల్లా కలిగిరి మండలం భట్టువారిపాలెంలో కొమరా రత్తయ్య (35) అనే వ్యక్తి సోమవారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. బంధువుల కథనం మేరకు వివరాలు.... జలదంకి మండలం చామదల పంచాయతీ వేణుగోపాలపురానికి చెందిన కొమరా రత్తయ్య కుటుంబం 30 ఏళ్ల క్రితం భట్టువారిపాలెం చేరుకుని కల్లుగీత పనులు చేసుకుంటూ జీవిస్తోంది. మూడేళ్ల క్రితం ఓ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో రత్తయ్య రూ.3.25 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. భార్య అనారోగ్యం, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో ఉన్న రత్తయ్య 8 నెలలుగా వాయిదాలు చెల్లించలేదు. దీంతో ఫైనాన్స్ సిబ్బంది ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో రత్తయ్య అప్పు ఉన్నట్టు ఇంటి గోడపై ఫైనాన్స్ ప్రతినిధులు రాశారు. ఇంతటితో ఆగని వారు ఆదివారం రత్తయ్య ఇంటికి చేరుకుని డబ్బు కట్టాల్సిందేనంటూ పట్టుబట్టారు. దీంతో తన ఇంటి సమీపంలో ఉన్న బంధువైన ఓ వృద్ధురాలి రూ.4వేల పెన్షన్, ఆమె తనయుడి వద్ద రూ.2వేలు తీసుకుని ఫైనాన్స్ సిబ్బందికి చెల్లించాడు. మిగిలిన నగదు త్వరగా చెల్లించాలని హెచ్చరించి వెళ్లారు. ఒక్కసారిగా అన్ని సమస్యలు చుట్టుముట్టడంతో తీవ్ర మనోవేదనకు గురైన రత్తయ్య సోమవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని రత్తయ్య స్వగ్రామమైన కోదండరామపురానికి కుటుంబ సభ్యులు, బంధువులు తీసుకెళ్లారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

క్యూలైన్‌లో నినాదాలు చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

- కేసు నమోదు చేయాలి: టీటీడీ బోర్డు సభ్యులు

తిరుమల, జూన్2(ఆంధ్రజ్యోతి): తిరుమల క్యూలైన్‌లో టీటీడీకి వ్యతిరేకంగా నినాదాలు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలంటూ టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, నరేష్‌కుమార్ సోమవారం తిరుమల టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భానుప్రకాశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, 30వ తేదీ రాత్రి ఓ వైసీపీ నాయకుడు ఉద్దేశపూర్వకంగా భక్తులను రెచ్చగొట్టి నినాదాలు చేశారని పేర్కొన్నారు. గోశాలలో ఆవులు చనిపోతున్నాయని గతంలో కూడా వైసీపీ నేత భూమన కరుణాకరరెడ్డి అబద్ధపు ప్రచారాన్ని చేశారన్నారు. అలాగే ఒక ముస్లిం వ్యక్తిని నమాజు చేసుకోమని చెప్పి, వీడియో తీసి సోషల్‌మీడియా, మీడియాకు వైసీపీకి చెందిన వ్యక్తి లీక్ చేశాడన్నారు. తాజాగా క్యూలైన్‌లోనూ నినాదాలు చేశారని, దీనిపై వెంటనే కేసు నమోదు చేయాలని టీటీడీ విజిలెన్స్, పోలీసులకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. వీడియో తీసిన ఉద్యోగిని సస్పెండ్ చేయడం కాకుండా ఉద్యోగం నుంచి తొలగించాలని రానున్న బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకుంటామన్నారు. టీటీడీలో 2వేల మంది ఉద్యోగులు తమకు నిఘా నేత్రాలు ఉన్నారని కరుణాకరరెడ్డి చెప్పారని, ఈ నిఘా నేత్రాలను గుర్తించి త్వరలోనే ఇంటికి పంపేస్తామన్నారు.

శ్రీవారి సేవలో జస్టిస్ దుప్పల వెంకటరమణ

- అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



జస్టిస్ దుప్పల వెంకటరమణ

తిరుమల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. అనంతరం టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు కుమార్తె సాత్విక పేరుతో రూ.10 లక్షలు విరాళం చెక్‌ను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి న్యాయమూర్తి అందజేశారు.

ఉత్తమ పీఏసీఎస్‌లు, ఎఫ్‌పీవోల ఎంపికకు కమిటీ

అమరావతి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఉత్తమ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతు ఉత్పత్తి సంఘాలకు జాతీయ సహకార అభివృద్ధి సంస్థ(ఎన్సీడీసీ) ఎక్స్‌లెన్స్ అండ్ మెరిట్ అవార్డు-2025ను ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఈ అవార్డులకు అర్హత కలిగిన పీఏసీఎస్, ఎఫ్‌పీవోల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. రైతులకు, మహిళలకు రుణాలు, సహకారం అందించి ఉత్తమ సేవలు అందించినందుకు ప్రథమ బహుమతిగా రూ.35 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.25 వేలు ఇవ్వనున్నట్లు ఎన్సీడీసీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఎన్సీడీసీ అవార్డులకు దరఖాస్తులను పరిశీలించి, ఉత్తమ సంఘాలను ఎంపిక చేయడానికి సహకార శాఖ రిజిస్ట్రార్ అధ్యక్షతన రాష్ట్ర స్థాయి ఎంపిక కమిటీని ప్రభుత్వం నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా ఏపీ ఆయిల్‌ఫెడ్ పర్సన్ ఇన్‌చార్జిని మరో ఆరు నెలలు(21.11.2025 వరకు) పొడిగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సత్యాసత్యాలు

పాకిస్థాన్‌పై ఇటీవల జరిపిన దాడిలో భారత వైమానికదళానికి కూడా నష్టం వాటిల్లిందని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) అనిల్ చౌహాన్ అంగీకరించారు. భారత్‌కు చెందిన ఆరు విమానాలను కూల్చేశానని పాకిస్థాన్ చెప్పడం శుద్ధ అబద్ధమని అంటూనే, ఎన్ని విమానాలను భారత్ కోల్పోయిందో ఇదమిత్థంగా చెప్పకుండా త్రిదళాధిపతి ఈ యుద్ధానికి సంబంధించి కొన్ని వ్యాఖ్యలు చేశారు. విమానాలు కోల్పోవడం కంటే, ఎందుకు, ఎలా జరిగిందన్న కారణాలు తెలుసుకోవడం ముఖ్యం కనుక, వ్యూహాత్మక తప్పిదాలను సరిదిద్దుకొని, వ్యూహాలను మెరుగుపరుచుకొని అమలు చేశామని అన్నారాయన. ఆదిలో వేసిన ఈ తప్పటడుగుల వల్ల ఒనగూరిన నష్టమెంతో చెప్పలేదు కానీ, సరిదిద్దుకున్న అనంతరం పాకిస్థాన్‌ను అద్భుతంగా దెబ్బతీయగలిగామన్నారు. ఎంతో కచ్చితత్వంతో పాక్ స్థావరాలపై దాడులు చేయడంతో వాటిని ఆపాల్సిందిగా ఆ దేశం ప్రాధేయపడిందని ఆయన వివరించారు. చైనా చేయూతతో భారత్‌ను పాకిస్థాన్ గట్టిదెబ్బ కొట్టిందన్న ప్రచారం ఉధృతంగా జరిగిన నేపథ్యంలో, అసలు చైనా సమకూర్చిన రక్షణ వ్యవస్థలు సరిగా పనిచేయనేలేదని కూడా ఆయన గాలి తీసేశారు.

విపక్షాలకు చౌహాన్‌వ్యాఖ్యలు మంచి మందుగుండు సమకూర్చాయి. మోదీ సర్కారు దేశాన్ని తప్పుదోవపట్టిస్తున్నదనీ, గుట్టు విప్పడం లేదు, నిజం చెప్పడం లేదు అంటూ ఆదినుంచీ ఆగ్రహిస్తున్న విపక్షాలు ఇప్పుడు మళ్ళీ పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను డిమాండ్ చేస్తున్నాయి. ఎన్ని విమానాలు?, ఏమిటవి అన్న ప్రశ్నలతో పాటు చాలా అనుమానాలు నివృత్తిచేసుకోవాలని, అమెరికా అధ్యక్షుడు ఒకటికి పదిసార్లు వాణిజ్యం బూచి చూపి తానే యుద్ధం ఆపానంటూ బల్లగుద్దుతున్న సంగతీ మాట్లాడుకోవాలని అవి అంటున్నాయి. కాల్పుల విరమణ ఒప్పందంలో ఉన్నదేమిటో జనానికి తెలియనక్కరలేదా? అన్నది మంచిప్రశ్న. ఇప్పటి వరకూ పొరుగుదేశం చెబుతున్న గొప్పలను, లెక్కలను సహజంగానే నమ్మకపోవడంతో పాటు, అంతర్జాతీయ మీడియానూ, రక్షణ రంగ విశ్లేషణలను సైతం భారతీయులు అనుమానించారు. పాక్ మీద ప్రేమతో పాశ్చాత్యదేశాలన్నీ అసత్యాలు ప్రచారం చేస్తున్నాయని భావించారు. కానీ, యుద్ధం ముగిసిన మూడువారాల తరువాత చౌహాన్ చేసిన వ్యాఖ్యలు ఆశ్చర్యంతో పాటు కీలకమైన ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. యుద్ధం అన్నాక నష్టాలు సహజం అని అప్పట్లో ఎయిర్‌మార్షల్ భారతి, ఇప్పుడు చౌహాన్ ప్రత్యేకంగా ఉద్ఘాటించాల్సిన అవసరం ఏమీ లేదు. పోరాటంలో నెగ్గడంతో పాటు, పోగొట్టుకోవడం కూడా ఉంటుందని సామాన్యుడికి సైతం తెలుసు. అయితే, ఐదువిమానాలను కూల్చినట్టుగా పాక్ తొలిరోజునే చేసిన ప్రకటనను వమ్ముచేయడానికి కాబోలు, వాయుసేన పైలట్లందరూ సురక్షితంగా తిరిగివచ్చారని చెప్పి వైమానిక నష్టాలేమీ జరగలేదన్నట్టుగా ఎయిర్‌మార్షల్ దేశప్రజలకో అభిప్రాయాన్ని కలిగించారు. సరికొత్త ఒప్పందంతో, ఫ్రాన్స్‌నుంచి మరింత ఖరీదుకు కొనుక్కున్న రాఫెల్‌కు అప్రదిష్ఠ రాకూడదన్న జాగ్రత్త అందులో ఉండివుండవచ్చు. ఇప్పుడు సీడీఎస్ చౌహాన్ పాకిస్థాన్ అంటున్న స్థాయిలో కాకున్నా నష్టం అధికంగానే సంభవించిందని తేల్చేశారు.

యుద్ధకాలంలో పాక్ పని అయిపోయిందంటూ ఎన్నిరకాల ప్రచారాలు జరిగాయో, అందులో బీజేపీ నాయకులు ఎంత ముందున్నారో అందరికీ తెలుసు. ఆ ఉద్వేగాల మధ్య, మరోపక్క పాకిస్థాన్ దీనికి ప్రతిగా, ప్రతీకారంగా మరింత విషప్రచారం సాగించిన నేపథ్యంలో, వాస్తవిక స్థితిని చెప్పడానికి సైన్యం కత్తి మీద సాముచేయాల్సివచ్చింది. అయితే, సత్యాన్ని దాచడంవల్లనో, అర్థసత్యాలు చెప్పడం వల్లనో అసత్యప్రచారాలను వమ్ముచేయడం సాధ్యంకాదు. దేశం కోసం ప్రాణాలకు తెగించిపోరాడే సైన్యానికి రాజకీయాలతో నిమిత్తం లేదు కనుక, ఉన్నదివున్నట్టు చెప్పడానికి ఏ దశలోనూ సందేహించనక్కరలేదు. ఈ యుద్ధంలో పాకిస్థాన్‌కు తీరని నష్టం చేశామని, ఉగ్రస్థావరాలను కుప్పకూల్చి ఒక కొత్త లక్ష్మణరేఖ గీశామన్నది వాస్తవం. జాగ్రత్తగానైనా కొన్ని నిజాలు విప్పినందుకు చౌహాన్‌ను అభినందించాల్సిందే. అయితే, మూడు వారాల తరువాత కూడా అది 145కోట్లమంది దేశప్రజల సమక్షంలో గాక, కఠినమైన ప్రశ్నలు, విశ్లేషణలు ఎదుర్కొనే సందర్భంలో, ఒక విదేశీ వేదికమీద జరగడం కాస్తంత అసంతృప్తిని కలిగిస్తున్న మాట నిజం.

పాక్‌కు సింధు జలాలు... ఇంకానా?

భారతదేశ సమగ్రతను, భారతీయుల ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'.. మన సైనిక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది. ఏప్రిల్ 22న పహల్గాంలో పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదుల ఉన్మాదానికి ప్రతీకారంగా.. మే 7వ తేదీ తెల్లవారుజామున (6వ తేదీ అర్ధరాత్రి తర్వాత), 9వ తేదీన పాకిస్థాన్‌లోని ఉగ్రవాద కేంద్రాలు లక్ష్యంగా సంధించిన మిసైళ్లు, పాక్ సైనిక స్థావరాలపై జరిపిన మెరుపుదాడులకు యావత్ ప్రపంచం సాక్షీభూతంగా నిలిచింది. 'ఆపరేషన్ సిందూర్' విషయంలో భారతదేశం చూపించిన పరిపక్వతకు, స్పష్టతకు యావత్ ప్రపంచం జేజేలు పలికింది. బ్రహ్మోస్, స్కాల్ప్ మిసైళ్లను వాడుతూ.. ఎస్–400, ఆకాశ్ ద్వారా వైమానిక రక్షణ వ్యవస్థతో స్వీయరక్షణ చేసుకుంది.

పహల్గాం ఘటన జరిగిన మూడురోజుల లోపే సింధుజలాల ఒప్పందాన్ని నిలిపేస్తున్నట్లు భారత దేశం చాలా స్పష్టంగా తెలియజేసింది, కఠినంగా వ్యవహరించింది. 'ఆపరేషన్ సిందూర్'కు తాత్కాలిక విరామం ఇస్తూ.. కాల్పుల విరమణకు అంగీకరించిన సందర్భంలోనూ 'సింధు జలాల ఒప్పందం' నిలుపుదలపై యథాతథస్థితిని కొనసాగించింది. 1965, 1971 (బంగ్లాదేశ్ ఏర్పాటు సందర్భంగా), 1999 (కార్గిల్), 2001 (పార్లమెంటుపై దాడి), 2008 (ముంబైపై ఉగ్ర దాడి), 2016 (యురీ), 2019 (పుల్వామా) ఘటనల సందర్భంలోనూ భారత్, పాక్ మధ్య తీవ్రస్థాయిలో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నప్పటికీ సింధునదీ జలాల ఒప్పందంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కానీ పహల్గాం ఉగ్రదాడి తర్వాత, దేశవ్యాప్తంగా ఉద్విగ్న వాతావరణం నెలకొనడం, ఇరుదేశాల మధ్య సంబంధాలు పూర్తిగా క్షీణించిన సందర్భంలో మోదీ సర్కారు సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తూ గొప్ప నిర్ణయం తీసుకుంది.

భారతదేశం స్వాతంత్ర్యాన్ని పొందిన తొలినాళ్లలో జరిగిన ఓ చారిత్రక తప్పిదమే ఈ సింధు జలాల ఒప్పందం. నాటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, నాటి పాక్ అధ్యక్షుడు జనరల్ అయూబ్ ఖాన్ 19 సెప్టెంబర్ 1960లో సద్భావనాపూర్వక ఒప్పందంగా దీనిపై సంతకాలు చేశారు. సింధు జలాల ఒప్పందం (ఇండస్ వాటర్ ట్రీటీ)లో భాగంగా.. సింధు నది, దాని అయిదు ఉప నదుల జలాల్లో.. 80 శాతం పాకిస్థాన్, 20 శాతం భారత్ వినియోగించుకోవాలి. పాకిస్థాన్‌కు సింహభాగం నీటిని అప్పగిస్తున్నందుకు బదులుగా రావి, బియాస్, సట్లేజ్ నదుల నీటిని భారత్, సింధు, జీలం, చీనాబ్ నదుల నీటిని పాకిస్థాన్ వినియోగించుకోవాలని ఒప్పందంలో పేర్కొన్నారు.

రావి, బియాస్, సట్లేజ్ నదుల నీటిని భారత్ వాడుకుంటున్నందున.. పాకిస్థాన్ భూభాగంలో ఈ నదీ పరివాహక ప్రాంతంలో జీలం, సింధు, చీనాబ్ నదులకు లింక్ కెనాళ్ల నిర్మాణ ఖర్చులుగా రూ.83.3 కోట్లను భారతదేశం భరించాలని పేర్కొన్నారు.



akbar

> సింధు జలాల ఒప్పందంపై అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ సంతకం చేయడంపై అప్పుడే కాంగ్రెస్ నాయకులతో పాటు దేశవ్యాప్తంగా బహిరంగంగా అసంతృప్తి వ్యక్తమైంది. దీనికి తోడు భారత్, పాకిస్థాన్, ప్రపంచబ్యాంకు మధ్య జరిగిన ఈ త్రైపాక్షిక ఒప్పందానికి భారతదేశమే చాలా రాయితీలు ఇచ్చింది. అందుకు ప్రతిఫలంగా మనకేమీ దక్కలేదు.

ప్రస్తుతం ఇది రూ.8వేల కోట్లతో సమానం. ఆ తర్వాత ప్రపంచ బ్యాంకు జోక్యంతో పాకిస్థాన్‌కు మరో రూ.400 కోట్ల నిధులు అందాయి. అదే సమయంలో భారతదేశం.. కెనాళ్ల నిర్మాణానికి రూ.100 కోట్ల సొంత నిధులను ఖర్చు చేసుకోవాలని ఒప్పందంలో పేర్కొన్నారు. ఇందుకోసం భారత్‌కు ప్రపంచబ్యాంకు కేవలం రూ.30కోట్ల నిధులను ఇచ్చింది. అది కూడా రుణంగానే. ఈ ఒప్పందం పాకిస్థాన్‌కు అనుకూలంగా ఎంత ఏకపక్షంగా సాగిందో చెప్పేందుకు ఇదొక ఉదాహరణ మాత్రమే.



ఈ ఒప్పందంపై నెహ్రూ సంతకం చేయడంపై అప్పుడే కాంగ్రెస్ నాయకులతో పాటు దేశవ్యాప్తంగా బహిరంగంగా అసంతృప్తి వ్యక్తమైంది. 30 నవంబర్, 1960 నాడు.. సింధుజలాల ఒప్పందంపై పార్లమెంటులో చర్చ సందర్భంగా.. కాంగ్రెస్ ఎంపీ హరీశ్‌చంద్ర మాథుర్ మాట్లాడుతూ.. టైమ్స్ ఆఫ్ ఇండియాలో వచ్చిన కథనాన్ని ప్రస్తావిస్తూ.. 'ఈ ఒప్పందంలోని ప్రతి అంశం వివాదాస్పదమే. పాకిస్థాన్ ఆకాంక్షలను పూర్తి చేసేందుకు భారతదేశం తన ప్రయోజనాలను పణంగా పెట్టి మరీ డబ్బులు వెచ్చిస్తోంది' అని గుర్తు చేశారు. నాటి వాస్తవ పరిస్థితిని హరీశ్‌చంద్ర మాథుర్ మాటలు కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నాయి. దీనికితోడు భారత్, పాకిస్థాన్, ప్రపంచ బ్యాంకు మధ్య జరిగిన ఈ త్రైపాక్షిక ఒప్పందానికి భారతదేశమే చాలా రాయితీలు ఇచ్చింది. అందుకు ప్రతిఫలంగా మనకేమీ దక్కలేదు. ఇది సింధునదీ జలాల ఒప్పందంలో భారతదేశానికి జరిగిన తీవ్రమైన అన్యాయం.

ఇదే భావన.. నాడు పార్టీలకు అతీతంగా ప్రతి పార్లమెంటు సభ్యుడు ఎలుగెత్తి చాటారు. ఈ ఒప్పందం కారణంగా రాజస్థాన్ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగింది. చాలామంది సభ్యులు 1948లో దేశ విభజన సమయంలో జరిగిన ఒప్పందాలను ప్రస్తావిస్తూ అప్పటికే వినియోగంలో ఉన్న కెనాళ్ల ద్వారా భారత్ నుంచి పాకిస్థాన్‌కు నీటి సరఫరాకు అంతరాయం ఉండకూడదని, కొన్నాళ్లపాటు ఇలాగే నీటి సరఫరా జరగాలని పేర్కొన్న అంశాన్ని గుర్తు చేశారు. అయినా, నెహ్రూ దీన్ని పెద్దగా పట్టించుకోలేదు సరికదా, బకెట్ నీళ్లకోసం రాద్ధాంతం చేస్తున్నారంటూ వ్యంగ్యంగా మాట్లాడారు. అయినా ఎంపీలెవరూ వెనక్కు తగ్గకపోవడంతో, ఈ విమర్శల దాడిని తట్టుకునేందుకు, జపాన్ యువరాజు–యువరాణి భారత పర్యటనకు వస్తున్నారని, వారికి స్వాగతం పలికేందుకు వెళ్తున్నానని చెప్పి నెహ్రూ తప్పించుకున్నారు.

తీవ్రమైన గందరగోళం మధ్య నెహ్రూ పార్లమెంటు నుంచి నిష్క్రమించిన తర్వాత అటల్ బిహారీ వాజపేయి నాటి కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగడుతూ ప్రసంగించారు. ఈ ఒప్పందంపై సంతకం చేసిన తర్వాత పాకిస్థాన్ అధ్యక్షుడు మాట్లాడుతూ 'సింధుతో పాటుగా రావి, సట్లెజ్, బియాస్, జీలం, చీనాబ్ నదీ తీరాల ఉమ్మడి తనిఖీ విధానానికి భారత్ అంగీకరించడం ద్వారా పాకిస్థాన్ ఒత్తిడికి తలొగ్గింది. చీనాబ్, జీలం నదుల ఎగువ ప్రాంతంపై (భారత భూభాగంలో) ఉమ్మడి నియంత్రణకు అంగీకరించడం అంటే, ఈ ప్రాంతంపై ఇరు దేశాలకు హక్కు ఉంటుందని అంగీకరించడమేనని అర్థం' అని పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. దీనికి నెహ్రూ ఇచ్చిన సమాధానంపై వాజపేయి సంతృప్తి చెందలేదు. దీనికి సమాధానంగా.. 'రెండు దాయాది దేశాల మధ్య సత్సంబంధాలను, స్నేహాన్ని ఏర్పర్చాలని భావిస్తే.. ఇలా సింధునదీ జలాల ఒప్పందం విషయంలో మన ప్రయోజనాలను తాకట్టుపెట్టేలా వ్యవహరించడం సరికాదు. పాకిస్థాన్ తప్పుగా మాట్లాడినా, అక్రమ డిమాండ్లను ముందు పెట్టినా నిర్వంద్వంగా వ్యతిరేకించాల్సిందే' అని వాజపేయి స్పష్టం చేశారు.

ఇది జరిగిన ఆరున్నర దశాబ్దాల తర్వాత.. ఇవాళ సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయాలని నిర్ణయం తీసుకోవడం ఓ చారిత్రక ఘట్టంగా నిలిచిపోనుంది. ఈ సందర్భంగా భారతదేశం ఇచ్చిన ప్రతిస్పందన.. ఒప్పందాన్ని సంపూర్తిగా గౌరవించినట్లుగా ఉంది. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం ద్వారా భారతదేశం నమ్మకాన్ని పాకిస్థాన్ వమ్ముచేసింది. దేశ భద్రతను, దేశ సమగ్రతను సవాల్ చేసేలా వ్యవహరిస్తే.. ఇచ్చే సమాధానం కూడా అదే స్థాయిలో ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక్క పాకిస్థాన్‌కే కాదు.. యావత్ ప్రపంచానికి స్పష్టమైన సందేశాన్నిచ్చారు. 'రక్తం, నీరు కలిసి ప్రవహించవు' అని భారతదేశం ఆలోచనలను కుండబద్దలు కొట్టారు. భారతదేశ ప్రజల అవసరాలకు, వ్యవసాయ, నీటి పారుదల అవసరాలకు అనుగుణంగా.. ఇకపై మన దేశం సింధు జలాలను వినియోగించుకుంటుందని స్పష్టం చేశారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు తగ్గట్లుగా.. మన అవసరాలకు, దేశాభివృద్ధికి ప్రాధాన్యతగా నిర్దేశించుకునే సింధు జలాల ఒప్పందం నిలిపివేత నిర్ణయం తీసుకున్నారు. దీనిపై గతంలో చాలాసార్లు ప్రభుత్వాలు ఆలోచన చేశాయి. ముంబై దాడుల సందర్భంలోనూ.. సింధుజలాల ఒప్పందాన్ని రద్దు చేయాలనే డిమాండ్ వినిపించింది. కానీ అప్పటి ప్రభుత్వం స్పందించలేదు. ఈసారి భారత ప్రభుత్వం దేశ ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుంటూ.. రెండో ఆలోచనకు తావులేకుండా ఈ ఒప్పందాన్ని నిలిపివేసింది. కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని యావద్భారతం ముక్తకంఠంతో ఆమోదం తెలిపింది. దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తీసుకునే ఎంతటి కఠినమైన నిర్ణయానికైనా భారత ప్రజల మద్దతు ఉంటుందని మరోసారి నిరూపితమైంది.

■ జి. కిషన్‌రెడ్డి
కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి

ఇంతకూ ధర్మాసనం ఎందుకు?

న్యాయస్థానాల్లో పెండింగ్ కేసులు, కేంద్ర రాష్ట్ర కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్ళు పరిపాలన సంబంధిత నిబంధనల నిర్వహణ... ఇవన్నీ ప్రజలకు తక్షణం పరిష్కారం కావాల్సిన అవసరాలు. ఇటీవల బిల్లుల ఆమోదంపై రాష్ట్రపతికి, గవర్నర్లకు కాలపరిమితిని సూచిస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. ఇది కొత్త ఆలోచన కాదు. హోంమంత్రిత్వ శాఖ మార్గదర్శకాల్లోనే ఉంది. హోంమంత్రిత్వ శాఖే సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ విచారణలో బిల్లుల ఆమోదంపై గడువును నిర్ణయించాలని అన్నది. ఇప్పుడు మళ్లీ సుప్రీం తీర్పుపై వివరణ కోరుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సుప్రీంకోర్టుకు 14 ప్రశ్నలు సంధించారు. గడువు అవసరాన్ని ప్రభుత్వమే ఒప్పుకున్న తర్వాత మరలా ఆ గడువుకు సంబంధించిన తీర్పు మీదనే సుప్రీంకోర్టుకే 14 రెఫరెన్స్‌లు ఎందుకు? అందు కోసం సుప్రీంకోర్టు ప్రత్యేక ధర్మాసనం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇటూ అటూ లాయర్లు సుదీర్ఘ కాలం నడిపిస్తారు. చివరకు సుప్రీంకోర్టు ఏ నిర్ణయం తీసుకున్నా, "మాకిష్టం లేదు. మేం ఒప్పుకోం," అనే అధికారం కేంద్ర ప్రభుత్వానికే ఉందని రాజ్యాంగంలోనే మనం రాసుకున్నాం. అలాంటప్పుడు ఇదంతా వృథా కాదా?

2024 ఏప్రిల్ 8న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో: "మేము కేవలం హోం మంత్రిత్వ శాఖ 2016లో జారీ చేసిన మెమొరండమ్ రూపంలోని మార్గదర్శకాలను అనుసరిస్తున్నాం, అవి మూడు నెలల గడువును సూచించాయి" అని పేర్కొంది. అంటే ఈ కాల పరిమితిని మొదట కేంద్ర ప్రభుత్వమే సూచించింది. అటువంటప్పుడు మళ్ళీ సుప్రీంకోర్టు విచారణ అవసరం ఎందుకు?



భారత రాష్ట్రపతి దేశ పాలనలో రాజ్యాంగ అత్యున్నత పదవిలో ఉన్నారు. రాష్ట్రపతి ఎన్నిక కార్యక్రమంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు ఓటింగ్ చేస్తారు. దేశవ్యాప్తంగా అత్యంత విశాలమైన ప్రజాతంత్ర ప్రాతినిధ్యం కలిగి ఉంటుంది. అందుకే ఆ పదవికి గౌరవం. గవర్నర్లను రాష్ట్రపతి ద్వారా ప్రధానమంత్రి, మంత్రి వర్గ సిఫార్సు మేరకు నియమిస్తారు. ఇది ఎన్నిక కాదు. వారు చేసే ఎంపిక. ఆయా రాష్ట్రాల్లో గవర్నర్లకు అత్యున్నత పరిపాలనాధికారాలు ఉంటాయి. వాటిని దుర్వినియోగం చేయకూడదు. బాధ్యతాయుతంగా పనిచేయాలి. కానీ ఇది జరగటం లేదు. ఇది కేవలం తమిళనాడు సమస్యేకాదు, ఎన్డీయేతర రాష్ట్రాలన్నిటిలోనూ ఈ సమస్య ఉంది. ఆర్టికల్ 200, 201లో కాల పరిమితులు లేకపోవటం తప్పుగా పరిగణించాల్సిన అవసరం లేదు. కానీ పరిపాలనలో సమయానుకూల నిర్ణయాలు కీలకం. గవర్నర్లు ఈ బాధ్యతను విస్మరించరాదు. తాము సంప్రదాయ పరిపాలనా అధికారం కలిగినప్పటికీ, నిర్ణయాలు ఆలస్యం చేయకూడదు. సుప్రీంకోర్టు తీర్పు అందరు గవర్నర్లకు వర్తిస్తుంది. గవర్నర్ – ముఖ్యమంత్రుల మధ్య ప్రతి రాష్ట్రంలోనూ గొడవ ఉండదు. కేంద్రంలో రాష్ట్రాల్లో వేరే పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ఈ ఆలస్యాలు కావాలని చేస్తున్నట్టు కనపడుతూనే ఉంది. ఈ కారణంగా రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు చేసుకోలేక పరిపాలన స్తంభించి పోతున్నది. తమిళనాడు వెర్సస్ గవర్నర్ ఆఫ్ తమిళనాడు (2025) కేసులో గవర్నర్ 'పాకెట్ వీటో' వాడుతున్నారని తీవ్ర విమర్శలు వచ్చాయి. 'పాకెట్ వీటో' అంటే బిల్లులను నిరవధికంగా పెండింగ్‌లో ఉంచటం.

> ప్రజాస్వామ్యంలో పాలన అనేది చర్యల ద్వారా జరగాలి, జడత్వం ద్వారా కాదు. బిల్లుల ఆమోదంపై సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వం కోరుకున్న ప్రకారమే రాజ్యాంగ బద్ధమైన తీర్పు ఇచ్చింది. రాష్ట్రపతి రెఫరెన్స్ ప్రకారం రాజ్యాంగ ధర్మాసనం తప్పనిసరి అవుతున్నది. కానీ ఆర్టికల్ 143 ప్రకారం, సుప్రీంకోర్టు ఇచ్చే సలహాను ప్రభుత్వం పాటించాల్సిన అవసరం లేదు. ఈలోగా మంత్రిత్వ శాఖల ఆమోదానికి పంపిన బోలెడు బిల్లులు ఎక్కడివక్కడే ఆగిపోతాయి. ప్రభుత్వం అడిగిన ప్రకారం రాష్ట్రపతి రెఫరెన్స్ అధికారాన్ని వాడడం వల్ల ఏం ప్రయోజనం?

రాష్ట్రపతి వేసిన ఐదు కీలక ప్రశ్నలు ఇవే: 1) ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్ అధికారాలు న్యాయపరంగా పరిశీలించదగినవేనా? 2) ఆర్టికల్ 361 ప్రకారం గవర్నర్/రాష్ట్రపతి పూర్తిగా న్యాయ సమీక్షకు అతీతమా? 3) రాజ్యాంగ కాలపరిమితి లేకపోతే గవర్నర్ బిల్లుపై నిర్ణయం తీసుకోవడం ఏ విధంగా జరగాలి? 4) ఆర్టికల్ 201 ప్రకారం రాష్ట్రపతి చేసే నిర్ణయాలు న్యాయపరంగా సమీక్షించదగినవేనా? 5) ఆర్టికల్ 201 ప్రకారం బిల్లులపై రాష్ట్రపతికి గడువు విధించవచ్చా? ఉందనుకుంటే సుప్రీంకోర్టు గడువులు ఇవ్వవచ్చా?

రకరకాల అనుమానాలు: 1) ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్‌కి నిర్ణయాల విచక్షణాధికారాలు ఉన్నాయా? గవర్నర్ రాష్ట్ర కేబినెట్ సలహా మేరకే పనిచేయాలా? అప్పుడు రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహా తీసుకోవచ్చా? 2) ఆర్టికల్ 142 ప్రకారం కోర్టులు గవర్నర్/రాష్ట్రపతిని తొలగించే ఆదేశాలు ఇవ్వగలవా? 3) గవర్నర్ అంగీకారం లేకుండా రాష్ట్ర శాసనసభ ఆమోదించిన చట్టం చట్టబద్ధమా? 4) ఈ అంశంపైన ఆర్టికల్ 145(3) ప్రకారం కనీసం ఐదుగురు న్యాయమూర్తులతో రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేయాల్సిన అవసరముందా? 5) ఆర్టికల్ 131 ప్రకారం ఒరిజినల్ సూట్ లేకుండా కేంద్రం – రాష్ట్రాల మధ్య విభేదాలను సుప్రీంకోర్టు పరిష్కరించగలదా?

న్యాయమూర్తి పార్థివాలా అభిప్రాయం ప్రకారం గవర్నర్‌కు ఒక బిల్లు వచ్చాక.. మూడు మార్గాలు మాత్రమే ఉంటాయి. ఒకసారి బిల్లు తిరిగి శాసనసభకి పంపి, అదే రూపంలో తిరిగి వస్తే రాష్ట్రపతికి పంపించే హక్కు గవర్నర్‌కు ఉండదు. ఆయన సూచనల మేరకే మార్పులు జరిగితే తప్ప. గవర్నర్ లేదా రాష్ట్రపతి బిల్లులపై జాప్యం చేస్తే ఆ ప్రభుత్వాలు కోర్టులో మాండమస్ రిట్ వేయవచ్చు.

బిల్లుల ఆమోదంపై సుప్రీంకోర్టు తీర్పు దిశను సూచించినప్పటికీ, తుది స్పష్టత కోసం రాజ్యాంగ ధర్మాసనం అవసరమే. కానీ ఆర్టికల్ 143 ప్రకారం, సుప్రీంకోర్టు ఇచ్చే సలహాను ప్రభుత్వం పాటించాల్సిన అవసరం లేదు. ఈలోగా మంత్రిత్వ శాఖల ఆమోదానికి పంపిన బోలెడు బిల్లులు ఎక్కడివక్కడే ఆగిపోతాయి. ఇది ప్రజల పాలనపై హక్కును దారుణంగా ఉల్లంఘించటమే.

○ మాడభూషి శ్రీధర్

చీకటి అధ్యాయానికి ముగింపు పలికిన రోజు

వైసీపీ అధినేత జగన్‌రెడ్డి జూన్ 4ను వెన్నుపోటు దినంగా పిలుపు ఇవ్వడం చూస్తే, ఓటు వేసిన ప్రజలే ఆయనకు వెన్నుపోటు పొడిచారన్న అర్థం వస్తోంది. తన పాలనను ప్రజలు తిరస్కరించడాన్ని ఆయన వెన్నుపోటుగా వర్ణించి, ప్రజలనే దోషులుగా చిత్రించే ప్రయత్నం చేస్తున్నారు. జూన్ 4– భారత ప్రజాస్వామ్యంలో చీకటి అధ్యాయానికి ముగింపు పలికిన రోజు. ప్రజల చేతుల్లో ఉన్న ఓటు శక్తి, పాలకుల పట్ల సమీక్ష హక్కు ఎంత బలంగా పనిచేస్తుందో మరోసారి నిరూపితమైన దినం. ప్రజలు జగన్‌రెడ్డిని వెన్నుపోటు పొడవలేదు లేదు, నమ్మి అధికారం ఇస్తే ఆయనే ప్రజలకు వెన్నుపోటు పొడిచారు. 2019లో జగన్ పార్టీకి 151 సీట్లు ఇచ్చారు, అప్పుడది వారి నమ్మకం. అదే ప్రజలు 2024లో అత్యధిక స్థానాలను తెలుగుదేశం కూటమికి ఇచ్చారు. అది జగన్ పాలనపై నిరాశ. మరి వెన్నుపోటు ఏమిటి? అది ప్రజల అనుభవం ఆధారంగా ఇచ్చిన తీర్పు మాత్రమే. జగన్ పాపాలను అవినీతిని, అరాచకాన్ని, ఫాసిజాన్ని పాతరేసిన దినం జూన్ 4. రాజధాని లేకుండా; పరిశ్రమలు, ఉద్యోగాలు లేకుండా; ప్రాజెక్టులు లేకుండా అభివృద్ధి నిలిపివేసిన పాలనను ప్రజలు తిరస్కరించిన రోజు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టిన పాలకులకు చరమగీతం పాడిన తేదీ.

వెన్నుపోటు దినం అనే అంశాన్ని చంద్రబాబుపై విమర్శనాత్మకంగా ఉపయోగించి రాజకీయంగా ప్రయోజనం పొందే వ్యూహం. ప్రజల మౌలిక సమస్యలపై దృష్టి పెట్టకుండా, వర్గ విభేదాలు, వ్యక్తిగత విమర్శల వైపు దృష్టి మళ్లిస్తున్నారు. ప్రజలకు అన్యాయం జరిగింది అనే కోణాన్ని ప్రజల్లో నాటాలని, నమ్మకద్రోహం అనే భావాన్ని జనంలో కల్పించాలని జగన్ కుట్ర పన్నారు. ఈ రకమైన దినోత్సవాలు ప్రజలకు అసలైన అవసరాలు తీర్చగలవా? ఇది నిజంగా ప్రజల సమస్యల పరిష్కారానికి దోహదపడుతుందా? అనే ప్రశ్న ప్రతి పౌరుడు ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఓటమికి కారణం తెలుసుకొనే ప్రయత్నం చేయకుండా ప్రజలే వెన్నుపోటు పొడిచారని ప్రచారం చేస్తూ ప్రజల తీర్పును అపహాస్యం చేయడం దురదృష్టకరం. ప్రజలు ఎప్పుడూ విజ్ఞతతో, అనుభవంతో ఓటు వేస్తారు. పాలకులు ప్రజలను ఒకసారి మాత్రమే మోసం చేయవచ్చు, పదే పదే మోసం చెయ్యడం సాధ్యం కాదు. ప్రజల తీర్పును వెన్నుపోటుగా చూపడం జగన్ ముఠా అజ్ఞానానికి, అహంకారానికి నిదర్శనం.

విషపూరితమైన జె బ్రాండ్ మద్యంతో ప్రజారోగ్యాన్ని పొట్టన పెట్టుకుని, ఏపీని గంజాయికి కేరాఫ్‌గా తయారుచేశారు. ఇసుక, మట్టి, విలువైన ఖనిజాల దోపిడీ చేశారు. భూముల కబ్జాలతో రాష్ట్రాన్ని యథేచ్ఛగా కొల్లగొట్టిన జగన్ ముఠాను రాష్ట్ర ప్రజలు అథఃపాతాళానికి తొక్కారు. దాంతో ఆయనకు 11 సీట్లు మాత్రమే మిగిలాయి. యువత, రైతులు, ఉద్యోగులు, మహిళలు, విద్యావంతులు, వ్యాపారులు, మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి, ఉన్నత వర్గాలకు చెందిన ప్రజలు అవినీతి, అసమర్థ పాలనకు చరమగీతం పాడారు. ప్రాంతాలతో నిమిత్తం లేకుండా అన్ని ప్రాంతాలలో ఒకే విధమైన విజయాన్ని కూటమి సాధించింది. 2019 ఎన్నికల్లో తాము మోసపోయామని గ్రహించిన ప్రజలు 2024లో తమ తీర్పును తిరగరాశారు. తనకు తాను అపర దానకర్ణుడిగా బిరుదు తగిలించుకొని ఊరేగినా జగన్ నిజస్వరూపాన్ని జనం తెలుసుకున్నారు. పాలకులు ఎలా ఉండకూడదో తమ తీర్పు ద్వారా రుజువు చేశారు. శాసనసభను కౌరవ సభగా మార్చి తనను తీవ్రంగా అవమానించిన సభలోకి మళ్లీ ముఖ్యమంత్రిగానే అడుగుపెడతానని చంద్రబాబు చేసిన శపథంలోని ధర్మాగ్రహాన్ని ప్రజలు అర్థం చేసుకొని ఆయనని మళ్లీ ముఖ్యమంత్రిని చేశారు. ఓటర్లు సృష్టించిన ఆ నిశ్శబ్ద విప్లవంలో ప్రజలు గెలిచారు, రాష్ట్రం నిలబడింది.

– నీరుకొండ ప్రసాద్

ప్రక్షాళనతోనే ఏపీ వర్సిటీల పునరుత్తేజం

రాష్ట్రంలో ఉన్నత విద్యారంగం గత ఐదేళ్ళ వైసీపీ ప్రభుత్వంలో భ్రష్టుపట్టిపోయింది. ఆ ఫలితాల్ని ఇప్పుడు రాష్ట్ర ప్రజలు అనుభవిస్తున్నారు. ఈ పరిస్థితుల నుంచి ఉన్నత విద్యారంగాన్ని ప్రక్షాళన చేసే పనిలో రాష్ట్ర ప్రభుత్వం తలమునకలై ఉంది. బ్రిటీష్ పాలన నుంచి ఈ రాష్ట్రంలో విజయవంతంగా నడుస్తున్న చరిత్ర కలిగిన ఎయిడెడ్ కళాశాలల వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం నాశనం చేసింది. యూజీ అధ్యాపకుల్లో తమకు ఇష్టమైన కొందరిని తీసుకెళ్ళి డిప్యుటేషన్ మీద యూనివర్సిటీల్లో పీజీ కోర్సుల టీచింగ్‌లో నియమించారు. ఏపీ యూనివర్సిటీల చట్టం, అకడమిక్ సెనేట్ల నియమావళిని పట్టించుకోలేదు. పైగా ఈ అధ్యాపకుల్ని ఎన్ఐఆర్ఎఫ్, నాక్ కమిటీల ముందు ప్రొఫెసర్లుగా చూపించారు.

అప్పటి ఉన్నత విద్యామండలి ఛైర్మన్ హేమ చంద్రారెడ్డి, ఆ శాఖ మంత్రి ప్రమేయం లేకుండా మొత్తం ఉన్నత విద్యారంగంలో ఆధిపత్యం చలాయించారు. ఆయన ముఖ్యమంత్రికి బంధువు కావడంతో రాష్ట్రంలో ఉన్నత విద్యామండలి పరిధిలో విధులు నిర్వహించే ఏ వ్యక్తీ నోరు మెదప లేదు. ఈయనకి తోడు విజయసాయిరెడ్డి దన్నుతో అప్పటి ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాదరెడ్డి తన ఇష్టానుసారం వ్యవహరించారు. ఎయిడెడ్ అధ్యాపకుల్ని విశ్వ విద్యాలయంలోకి తీసుకొచ్చి గందరగోళం సృష్టించారు. మచిలీపట్నం కృష్ణా యూనివర్సిటీ నుంచి ఇద్దరు జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను ఆంధ్ర విశ్వవిద్యాలయానికి బదిలీ మీద తీసుకొచ్చారు. వీరికి మచిలీపట్నంలో ఒక్కొక్కరికీ పది మంది చొప్పున పిహెచ్.డి. పరిశోధకులు కూడా ఉన్నారు. ఈ నిర్ణయం ముందు సహాయక ఆచార్యుల ఉద్యోగాల భర్తీలో ఓపెన్ కేటగిరీ పోస్టుల రోస్టర్ పాయింట్లకి అడ్డంకిగా మారుతుంది. దీంతో ఆశావహులు న్యాయస్థానాల్ని ఆశ్రయిస్తారు. వీటిని ఇప్పటికైనా సంస్కరించకపోతే రాష్ట్రం మొత్తం భర్తీ ప్రక్రియకు ముప్పు వాటిల్లుతుంది. ఏయూ మాజీ వీసీ ప్రసాదరెడ్డి అవినీతి కార్యకలాపాల మీద ప్రభుత్వం విజిలెన్స్ విచారణ చేపట్టనున్నట్లు హెచ్ఆర్డీ మంత్రి నారా లోకేష్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా శాసనమండలిలో ప్రకటించారు.

శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి అవినీతి దారిలో అడ్డగోలుగా వెళ్ళారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి, మాజీ ముఖ్యమంత్రి ఓఎస్డీ ధనంజయరెడ్డి సతీమణిని కూకట్‌పల్లి జేఎన్టీయూ నుంచి తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఫిజిక్స్ విభాగంలోకి సరాసరి ప్రొఫెసర్‌గా నియమించేశారు. ఇవన్నీ యూజీసీ, ఏపీ యూనివర్సిటీ చట్టాన్ని ధిక్కరించడమే కాకుండా, ఉన్నత విద్య, పరిశోధన విలువల్ని మంటగలపడమే అవుతుంది.

ప్రభుత్వం మొత్తంగా మకిలిని కడిగితేనే ప్రక్షాళన జరిగినట్టు. లేకుంటే గత ప్రభుత్వ అవినీతి, అక్రమ మరకల మీద రంగులు పూసినట్టవుతుంది. వైసీపీ ప్రభుత్వ తప్పిదాల మీద విచారణ జరిగితీరాలి. అప్పుడే ఉన్నత విద్యావంతులయిన మేధావులు, నిరుద్యోగులు సంతృప్తి వ్యక్తం చేస్తారు. విజయనగరం జేఎన్టీయూ నుంచి ఒక అధ్యాపకుడిని డిప్యుటేషన్ మీద తీసుకొచ్చి జవాబు పత్రాల వాల్యుయేషన్ ఇన్‌చార్జిగా నియమించారు. అతనితో వాల్యుయేషన్, రీ వాల్యుయేషన్లలో చాలా తప్పులు చేయించారని వర్సిటీ వర్గాల్లో తీవ్రప్రచారం జరిగింది. ఐపీఎస్ అధికారి సంజయ్ ఎంటెక్ పరీక్షలను వేరే వ్యక్తులతో పరీక్షలు రాయించి, ప్రథమ శ్రేణి మార్కులతో ఆయనను పాస్ చేశారు. అంతేగాక వీసీ ప్రసాదరెడ్డి పాలనకు వ్యతిరేకంగా ఉన్న విద్యార్థి నాయకుల్ని ముందస్తు అరెస్టులు చేయించి, స్నాతకోత్సవంలో అతిరథ, మహారథుల సమక్షంలో సంజయ్‌కి డిగ్రీ ప్రదానం చేశారు. ఇటువంటి అతిక్రమణలు ఇంకా ఎన్నో ఉన్నాయి. ఈ ఘటనలన్నీ గత ప్రభుత్వంలో మీడియాకి ఎక్కాయి. అయినా అప్పటి ప్రభుత్వం వీటిని లెక్కచేయలేదు. అప్పటి పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఎగ్జామినేషన్ డీన్, ప్రస్తుత ప్రభుత్వంలో గత ఏడాది జూలైలో ఒక యూనివర్సిటీకి ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్‌గా నియమితులయ్యారు.

> ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యారంగాన్ని ఇప్పటి వరకు పట్టిపీడిస్తున్న సమస్యల్ని పరిష్కరించి, వర్సిటీల ప్రక్షాళనకు ప్రభుత్వం వెళ్లవలసి ఉంది. గత ప్రభుత్వ తప్పిదాల్ని వెలికితీసి, వాటిని సరిచేయాలి. రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ పాయింట్ వంటి సమస్యల్ని ముందుగానే నివారించాలంటే ఇవన్నీ జరగాలి. లేకుంటే విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగ ప్రకటనలన్నీ న్యాయస్థానాల్లో అపరిష్కృతంగా మిగిలిపోతాయి.




ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యారంగాన్ని ఇప్పటి వరకు పట్టిపీడిస్తున్న సమస్యల్ని పరిష్కరించి, వర్సిటీల ప్రక్షాళనకు ప్రభుత్వం వెళ్లవలసి ఉంది. గత ప్రభుత్వ తప్పిదాల్ని వెలికితీసి, వాటిని సరిచేయాలి. రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ పాయింట్ వంటి సమస్యల్ని ముందుగానే నివారించాలంటే ఇవన్నీ జరగాలి. లేకుంటే విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగ ప్రకటనలన్నీ న్యాయస్థానాల్లో అపరిష్కృతంగా మిగిలిపోతాయి. 2017, 18 సంవత్సరాల్లో తెలుగుదేశం ప్రభుత్వం స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి కూడా ఉద్యోగాల భర్తీ నిలిచిపోవడానికి ఈ తప్పిదాలే కారణం. ఇప్పటికీ ఈ కేసులు సుప్రీంకోర్టులో కొనసాగుతున్నాయి.

వైసీపీ ప్రభుత్వం 2023లో ఎన్నికల షెడ్యూల్‌కు నాలుగు నెలల ముందు విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుల భర్తీకి బూటకపు ప్రకటన విడుదల చేసింది. మూలిగే నక్కమీద తాటిపండు పడినట్టు నిరుద్యోగుల నుంచి ఫీజుల రూపేణా కోట్లాది రూపాయిల డబ్బు కొల్లగొట్టేసింది. దీని మీద కూడా ప్రస్తుత ప్రభుత్వం విచారణ కమిటీ వేసి, నిజానిజాలు వెల్లడించాలి. రాష్ట్ర విభజన తరువాత ఇక్కడి విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుల ఉద్యోగాల భర్తీ జరగనేలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2014కి ముందు అప్పటి ప్రభుత్వం భర్తీ చేసిన ఒక జనరల్, మరో ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీలో వచ్చిన ఆచార్యులు మాత్రమే ఇప్పుడు ఉన్నారు. రాష్ట్ర విశ్వవిద్యాలయాల్ని సమర్థవంతంగా నడపాలంటే ఈ అరకొర ఆచార్యుల సంఖ్య సరిపోదు.

ప్రతిభావంతులైన మానవవనరులు మరుగునపడి పోకుండా, నిరుద్యోగానికి బలికాకుండా రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. అందుకు యూజీసీ నియమావళిని, కేంద్ర విశ్వవిద్యాలయాల పద్ధతుల్ని అనుసరించి దశాబ్దాలుగా నిర్దేశిత కాలవ్యవధి లేని వేతనాలతో ఒప్పంద ఆచార్యులుగా, అతిథి ఆచార్యులుగా పనిచేస్తున్న బాధితుల సమస్యలను సైతం న్యాయబద్ధంగా పరిష్కరించాలి. అప్పుడే ప్రభుత్వం అమరావతిలో చేపడుతున్న అంతర్జాతీయ ఉన్నత విద్యాసంస్థల వ్యవస్థాపనకు అందరి మద్దతు లభిస్తుంది. ప్రభుత్వ కార్యాచరణ ఫలప్రదమవుతుంది. స్వర్ణాంధ్ర ఆకాంక్షలు నెరవేరి వికసిత భారతం వర్ధిల్లుతుంది.

• డాక్టర్ జీకేడీ ప్రసాదరావు
ఫ్యాకల్టీ, ఆంధ్రవిశ్వవిద్యాలయం



కృష్ణమ్మ కళకళ..



రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడంలో భాగంగా కృష్ణానదిలో బోట్ మారథాన్ సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పడవలు, బోట్లతో కృష్ణానది కళకళలాడింది. పర్యాటకులను విశేషంగా ఆకర్షించింది. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవం



హైటెక్ హంగులతో నిర్మించిన సత్యనారాయణపురం మోడల్ పోలీస్‌స్టేషన్ గృహ ప్రవేశం సోమవారం జరిగింది. హోంమంత్రి అనిత స్టేషన్ భవనాన్ని ప్రారంభించారు. అతిథులుగా డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, ఎంపీ కేశినేని శివనాథ్ హాజరయ్యారు. ఎమ్మెల్యే బొండా బొండా ఉమామహేశ్వరరావు, సీపీ రాజశేఖరబాబు పాల్గొన్నారు.

8లో


మల్లవల్లికి మళ్లీ కళ

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రద్దు చేసిన పారిశ్రామిక సంస్థల భూ కేటాయింపులను ఏపీఐఐసీ అధికారులు పునరుద్ధరించారు. మల్లవల్లిలో పరిశ్రమలు ఏర్పాటు చేయలేదన్న పేరుతో వారికి సమయం కూడా ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం భూ కేటాయింపులను రద్దు చేసింది. ఒకటి కాదు.. రెండు కాదు.. మొత్తంగా 371 పారిశ్రామిక సంస్థల భూ కేటాయింపులను రద్దు చేసేసింది. పారిశ్రామికవేత్తల విజ్ఞప్తి మేరకు కూటమి ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. మరో అవకాశం ఇస్తూ భూముల పునరుద్ధరణ చేపట్టింది. దీంతో మల్లవల్లికి మళ్లీ పరిశ్రమలు రానున్నాయి.



మల్లవల్లి పారిశ్రామికవాడ ముఖద్వారం

మల్లవల్లి ఫుడ్ పార్క్



వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన పారిశ్రామిక సంస్థలకు భూ కేటాయింపుల పునరుద్ధరణ

- మొత్తం 371 పారిశ్రామిక సంస్థలకు మళ్లీ భూ కేటాయింపులు
- ఈ -మెయిల్ ద్వారా ఆయా పారిశ్రామిక సంస్థలకు ఏపీఐఐసీ సందేశాలు
- 6 నెలల్లో ప్లాంట్ల ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోవాలి
- రెండేళ్లలో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించకపోతే కేటాయింపులు రద్దు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సీఆర్‌డీఏ పరిధిలో కృష్ణాజిల్లా మల్లవల్లిలో 1200 ఎకరాల రెవెన్యూ ఫారెస్ట్ భూములను సేకరించి మోడల్ ఇండస్ట్రియల్ కారిడార్, మెగా ఫుడ్‌పార్క్‌లను ఏర్పాటు చేసింది. కొండను చదును చేసి ప్లాట్లుగా వర్గీకరించి, మౌలిక సదుపాయాల కల్పన చేపట్టింది. అప్పట్లో అసోసియేషన్లుగా ముందుకు వచ్చిన వారికి అప్పటి టీడీపీ ప్రభుత్వం భూ కేటాయింపులు జరిపింది. ఇలా భూ కేటాయింపులు పొందిన వారిలో కొన్ని పారిశ్రామిక సంస్థలకు ఏపీఐఐసీతో సమస్యలు ఉన్నాయి. అప్పట్లో అసోసియేషన్ల తరఫున డిమాండ్ చేసినంతగా భూ కేటాయింపులను జరపలేదన్న అంశం నడిచింది.

మల్లవల్లి విస్తరణ దిశగా అడుగులు

మల్లవల్లి ఇండస్ట్రియల్ కారిడార్‌ను విస్తరించే దిశగా అడుగులు పడుతున్నాయి. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రతిపాదన మేరకు మరో 400 ఎకరాల రెవెన్యూ, ఫారెస్టు భూములను సేకరించాలని నిర్ణయించారు. ప్రభుత్వం నుంచి తగిన ఫండ్స్ కోసం ఏపీఐఐసీ అధికారులు ఎదురుచూస్తున్నారు. మరికొద్ది రోజుల్లోనే మల్లవల్లి విస్తరణకు శ్రీకారం చుట్టనున్నారు.

వైసీపీ ప్రభుత్వం రాగానే విజిలెన్స్ విచారణ

తమ యూనిట్ల ఏర్పాటుకు తగినట్టుగా భూ కేటాయింపులు లేవన్న కారణంతో అప్పటి ఉమ్మడి కృష్ణాజిల్లా యంత్రాంగంతో సంప్రదింపులు చేస్తూ వస్తున్నాయి. ఈ దశలో ఎన్నికలు జరిగి.. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అధికారంలోకి వచ్చీ రాగానే వైసీపీ ప్రభుత్వం వారి సమస్యలేవిటో పరిష్కరించాల్సింది పోయి.. టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన భూ కేటాయింపులు కాబట్టి ఏదో జరిగిపోయిందన్న ఉద్దేశ్యంతో విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. విజిలెన్స్ విచారణలో మొత్తం 371 సంస్థలు పారిశ్రామిక యూనిట్ల పనులను ప్రారంభించలేదని నివేదిక ఇవ్వటంతో ఆ తర్వాత దశలో వరుసగా పారిశ్రామిక సంస్థలకు నోటీసులు ఇస్తూ భూ కేటాయింపులను రద్దు చేస్తూ మిగతా 6లో..

కోర్టును ఆశ్రయించిన పారిశ్రామికవేత్తలు

తమ భూ కేటాయింపులు ఉన్న పళంగా రద్దు చేయటం, అకస్మాత్తుగా అందనంత ధరలను పెంచేయటం పట్ల కొంతమంది పారిశ్రామిక వేత్తలు అప్పట్లో కోర్టును ఆశ్రయించారు. దాదాపు ఐదేళ్లుగా భూ కేటాయింపులు రద్దు అయిన వారు.. భూ ధరలను అమాంతం పెంచటంతో బాధితులుగా మారినవారు పోరాటం చేస్తూనే ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ప్రభుత్వానికి మొరపెట్టుకున్నారు. దీంతో పాత విధానంలోనే భూముల ధరలను నిర్ణయిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇదే సందర్భంలో భూ కేటాయింపులు రద్దు అయిన వారు కూడా తమ ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం వారికి మరో అవకాశం ఇవ్వాలని భావించింది.

అంపాపురం డ్రైవింగ్ కళాశాలలో టెస్ట్ ట్రాక్లు



ఇక ప్రైవేటుగా.. డ్రైవింగ్ లైసెన్సుల జారీ!

కేడీఎల్‌వోఏ అంపాపురం డ్రైవింగ్ కళాశాలకు అరుదైన గుర్తింపు

- కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో దక్కిన స్థానం
- ప్రస్తుతం ఇక్కడ హెవీ వెహికల్ డ్రైవర్లకు శిక్షణ ఇస్తున్న సంస్థ
- శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఇక నేరుగా డ్రైవింగ్ లైసెన్సు జారీ అధికారం
- కార్లు, ద్విచక్రవాహనాలకు కూడా ఇక్కడే లైసెన్సులు జారీ.. శిక్షణ తప్పనిసరి



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాష్ట్రంలోనే మొదటి సారిగా కృష్ణాజిల్లా అంపాపురంలోని లారీ ఓనర్స్ అసోసియేషన్ నేతృత్వంలో నిర్వహించే 'మోడల్ డ్రైవింగ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ అండ్ రీసెర్చ్ సెంటర్' ప్రైవేటు కేటగిరీలో లైసెన్సుల జారీ చేసే కేంద్రంగా ఎంపికైంది. దేశ వ్యాప్తంగా ప్రైవేటుగా కూడా లైసెన్సుల జారీకి అనుమతులు ఇవ్వటంతో మన దగ్గర నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్ (ఎన్‌జీవో)గా గత పాతికేళ్లుగా ఎందరినో నాణ్యమైన డ్రైవర్లుగా తీర్చిదిద్దుతున్న కృష్ణాజిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్‌కు (కేడీఎల్‌వోఏ)కు ఈ అరుదైన అవకాశం దక్కింది. అంపాపురంలోని మోడల్ డ్రైవింగ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో హెవీ వెహికల్ డ్రైవర్లకు మాత్రమే శిక్షణ ఇవ్వటం జరుగుతోంది. తాజా నిబంధనల ప్రకారం రెండున్నర నెలలు ఈ కేంద్రంలో శిక్షణ తీసుకున్న వారికి నేరుగా హెవీ వెహికల్ లైసెన్సులు జారీ చేస్తారు. ఆ సంస్థ ఇచ్చే సర్టిఫికెట్ ఆధారంగా రవాణా శాఖ హెవీ వెహికల్ లైసెన్స్‌ను జారీ చేస్తుంది. ఇక్కడ ద్విచక్ర వాహనాలు, కార్ల డ్రైవింగ్ నేర్చుకున్న వారికి కూడా రవాణా శాఖలో మిగతా 6లో..

అమల్లోకి వచ్చిన విధానం

ప్రైవేటు సంస్థ ద్వారా లైసెన్సుల జారీ విధానం ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఇప్పటికే అమల్లోకి వచ్చింది. అంపాపురంలోని మోడల్ డ్రైవింగ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో హెవీ హెహికల్ డ్రైవర్లకు సంబంధించిన మొదటి బ్యాచ్ శిక్షణ ప్రారంభమైంది. వీరంతా విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకుని సర్టిఫికెట్లను సాధిస్తే.. రవాణా శాఖ నుంచి పర్మినెంట్ హెవీ వెహికల్ లైసెన్సులు జారీ అవుతాయి.

బాధ్యతల స్వీకరణ

జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఎస్.ఇలక్కియా కలెక్టర్ కార్యాలయంలోని జేసీ చాంబర్‌లో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



కృష్ణానదిపై బ్రిడ్జి!

ఎన్టీఆర్ జిల్లా ముక్త్యాల- పల్నాడు జిల్లా మాదిపాడు మధ్య నిర్మాణం

- రూ.60.54 కోట్ల వ్యయంతో నెల రోజుల కిందట పనులు ప్రారంభం
- 13 పిల్లర్లతో 14.8 మీటర్ల వెడల్పుతో నిర్మాణం కానున్న బ్రిడ్జి

(ఆంధ్రజ్యోతి, జగ్గయ్యపేట రూరల్): పవిత్ర కృష్ణానది ఉత్తర వాహిని క్షేత్రం ముక్త్యాల నుంచి కృష్ణానదిపై పల్నాడు జిల్లా మాదిపాడు వరకు కృష్ణాబ్రిడ్జి నిర్మాణ పనులు నెల రోజుల కిందట ప్రారంభమయ్యాయి. రూ.60.54 కోట్ల వ్యయంతో నిర్మించే ఈ వంతెనతో ముక్త్యాల ముఖచిత్రం మారనుంది. ఈ బ్రిడ్జి భవిష్యత్తులో పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా ముక్త్యాలకు మణిహారం కానుంది. పల్నాడు జిల్లా వైపు ఇప్పటికే రెండు పిల్లర్ల నిర్మాణం జరుగుతుండగా మూడవ పిల్లర్‌కు బేస్‌మెంట్ సిద్ధం చేస్తున్నారు. మొత్తం 13 పిల్లర్లతో 14.8 మీటర్ల వెడల్పుతో బ్రిడ్జి నిర్మిస్తున్నారు. పల్నాడు జిల్లాలో 6.5 మీటర్లు, ఎన్టీఆర్ జిల్లాలో రెండు కిలోమీటర్ల మేర అప్రోచ్ రోడ్లు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో ఏర్పాటు చేసే అప్రోచ్ రోడ్డును జగ్గయ్యపేట-ముక్త్యాల రోడ్డుకు అనుసంధానం చేస్తున్నారు. 18 నెలల్లో పూర్తి చేసేందుకు కాంట్రాక్టు సంస్థ అన్ని హంగులతో రంగంలోకి దిగింది. వర్షాకాలం ముందుగా రావటం వల్ల పనులకు ప్రతిబంధకం కావచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం నదిలో 15 మీటర్ల లోతులో నీరు ఉందని అంచనా వేస్తున్నారు. పల్నాడు జిల్లా వైపు పూర్తైతే ఎగువ నుంచి వచ్చే నీరు ఆ వైపునకు మళ్లించి పిల్లర్‌లు నిర్మించాల్సి ఉంది.

పల్నాడు జిల్లా వైపు నిర్మిస్తున్న పిల్లర్



దశాబ్దాల క్రితమే ప్రతిపాదన

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల మధ్య దశాబ్దాల క్రితం వంతెన నిర్మించాలని ముక్త్యాల రాజా ప్రసాద్ ప్రతిపాదనలు పంపినా కార్యరూపం దాల్చలేదు. నది వెడల్పు ఎక్కువగా, లోతుగా ఉండటంతో అప్పటి పరిస్థితుల దృష్ట్యా అంత ధనం వెచ్చించి నిర్మించాల్సిన అవసరం లేదని భావించిన ప్రభుత్వం ప్రతిపాదనలను పక్కన పెట్టింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు చేసి, నిర్మాణానికి శంకుస్థాపన చేసింది. నిర్మాణ పనులు ప్రారంభించకముందే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఏడాది తర్వాత మరలా నిర్మాణానికి ప్రభుత్వం అనుమతు లివ్వటంతో పనులు మిగతా 6లో..

బాబూ.. 'చిట్టీ'..!

- నిర్వాహకులకు, ఖాతాదారులకూ పోలీసుల ఆహ్వానాలు
- స్టేషన్లలోనే కౌన్సెలింగ్
- నిర్వాహకుల 'లెక్కలు' చూసే అవకాశం

8

మసులా.. మస్త్ జోష్!

- 5, 6, 7, 8 తేదీల్లో మంగినపూడిలో బీచ్ ఫెస్టివల్

6



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి రవీంద్ర, కలెక్టర్ బాలాజీ

చెలరేగిన గొలుసు దొంగలు

- సోమవారం రాత్రి పది నిమిషాల వ్యవధిలో రెండు చోరీలు
- మాచవరం, పటమట పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు



షాపులోని మహిళ మెడలో గొలుసు లాగుతున్న యువకుడు

విజయవాడ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): విజయవాడ సెంట్రల్ జోన్‌లో గొలుసు దొంగలు రెచ్చిపోయారు. పది నిమిషాల వ్యవధిలో పక్కపక్కన పోలీసుస్టేషన్ల పరిధిలో రెండు వరుస చోరీలకు పాల్పడ్డారు. ఈ ఘటనలు సోమవారం రాత్రి జరిగాయి. ఆటోనగర్‌లో సన్‌లైట్ సెంటర్‌లో ఒక మహిళ నడుచుకుంటూ వెళుతుండగా మోటార్ సైకిల్‌పై వెళ్లిన ఇద్దరు యువకులు ఆమె మెడలో బంగారు గొలుసును లాక్కుపోయారు. అనంతరం అక్కడి నుంచి పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులో లలిత మిగతా 6లో..

తిరువూరు మున్సిపాల్టీ టీడీపీ కైవసం

మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కొలికపోగు నిర్మల ఎన్నిక

- వైసీపీ అభ్యర్థి ప్రసాద్‌పై 2 ఓట్ల తేడాతో గెలుపు
- ఎక్స్ అఫిషియో మెంబర్‌గా ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే కొలికపూడి

తిరువూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): తిరువూరు మున్సిపాల్టీని టీడీపీ కైవశం చేసుకుంది. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఉప ఎన్నిక ప్రశాంత వాతావరణంలో జరిగింది. చైర్‌పర్సన్‌గా టీడీపీ బలపర్చిన 1వ వార్డు కౌన్సిలర్ కొలికపోగు నిర్మల వైసీపీ అభ్యర్థిపై రెండు ఓట్ల తేడాతో గెలుపొందారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన చైర్‌పర్సన్ ఉప ఎన్నికల మిగతా 6లో..



కొలికపోగు నిర్మలకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఆర్డీవో మాధురి

అభివృద్ధే లక్ష్యంగా కౌన్సిలర్ల మద్దతు

- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

6

వెన్నుపోటు రాజకీయాలకు తెరతీసిన కూటమి నేతలు

- మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషిచేస్తా..

» జేసీగా ఇలక్కియా బాధ్యతల స్వీకారం



కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న జేసీ

కలెక్టరేట్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లా సమగ్రాభివృద్ధికి అధికారులతో కలిసి కృషిచేస్తానని నూతనంగా బాధ్యతలు చేపట్టిన జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా అన్నారు. సోమవారం జేసీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, శూన్య పేదరికంతో పాటు స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల కోసం ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా ప్రజలకు సేవలందించనున్నట్టు తెలిపారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో జిల్లాను ముందువరుసలో నిలిపేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ లక్ష్మీశను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జేసీకి విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, డీఎస్వో ఎ.పాపారావు, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, కలెక్టరేట్ ఏవో ఎస్.శ్రీనివాసరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఆవరణలో మొక్క నాటుతున్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్‌లో ధన్వంతరీ వనం

» ఔషధ మొక్కలపై అవగాహన కల్పిద్దాం : కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ఔషధ మొక్కల ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, మిద్దె తోటల్లో ఔషధ మొక్కలు పెంచేలా ప్రోత్సహించాలని, ఈ బృహత్తర కార్యక్రమంలో అధికారులతో పాటు స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం ముఖ్యమని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో వన్ ఎర్త్-వన్ లైఫ్ (టెర్రస్ గార్డెన్ గ్రూప్) సహకారంతో ఏర్పాటు చేసిన ధన్వంతరి వనాన్ని కలెక్టర్ ప్రారంభించారు. అక్కల కర్ర, నల్ల ఉమ్మెత్త, నేపాలం, చిత్రమూలం, తాని తదితర ఔషధ గుణాలు కలిగిన 40 రకాల మొక్కలు నాటే కార్యక్రమాన్ని స్వయంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలందరూ ఆరోగ్యంగా జీవించడానికి పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు సేంద్రీయ పద్ధతులు ప్రోత్సహించాల్సిన అవసరముందన్నారు. జిల్లాలో ఇప్పటికే ప్రకృతి వ్యవసాయంపై పెద్దఎత్తున రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇదేవిధంగా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఉపయోగపడే ఔషధ మొక్కలపైనా అవగాహన కల్పించి, ఇంటిలోనే పెంచుకొనేలా ప్రోత్సహించడంలో సమిష్టి కృషి అవసరమన్నారు. మిద్దె తోటల పెంపకాన్ని ఓ ఉద్యమంలా తీసుకెళ్లేందుకు వన్ ఎర్త్-వన్ లైఫ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వన్ ఎర్త్-వన్ లైఫ్ ప్రతినిధులు ఏలూరి లీలాకుమారి, మద్దిరాల కమలాకర్, విజయకుమార్ వెలగ, పాలడుగు సురేష్ తదితరులతో పాటు పీసీబీ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పి.శ్రీనివాస్, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఎస్.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లా నుంచి 117 అర్జీలు

కలెక్టరేట్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 117 అర్జీలు వచ్చాయని, వాటిని సత్వరం పరిష్కరించడం అధికారుల బాధ్యత అని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ, జేసీ ఎస్.ఇలక్కియ, డీఆర్‌డీఏ పీడీ ఎఎన్‌వీ నాంచరరావు, గ్రామ, వార్డు, సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతితో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో మొత్తం 117 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకొని గడువులోగా సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారంపై అధికారులు దృష్టిసారించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ నేతలపై అట్రాసిటీ కేసులు

జగ్గయ్యపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గ వైసీపీ కార్యాలయంలో ఆదివారం రెండు వర్గాల మధ్య జరిగిన బాహాబాహీలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్, దుర్గగుడి మాజీ డైరెక్టర్ నంబూరి రవితో పాటు మరో ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారు. స్థానిక కోదాడ రోడ్డులోని వైసీపీ కార్యాలయంలో ఆదివారం రాత్రి జరిగిన సమావేశంలో తన పేరును పార్టీ గ్రూపుల నుంచి తొలగించడాన్ని వట్టెం మనోహర్.. నంబూరి రవిని నిలదీయటంతో గొడవ మొదలైంది. మనోహర్ వర్గీయులు, వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు మద్దతుదారులు కొట్టుకున్నారు. వైసీపీ ట్రేడ్ యూనియన్ నేత వినోద్‌ను నంబూరి రవి, పృథ్వీ తదితరులు కులం పేరుతో దూషించడంతో పాటు దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు అందింది. తమను కూడా కులం పేరుతో దూషించి దౌర్జన్యం చేశారని వట్టెం మనోహర్, అతని అనుచరులు వినోద్, శామ్యూల్, ప్రసన్నకుమార్, బుల్లయ్య ప్రతిగా ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేశారు.

సీసీ ఫుటేజీలోనే వాస్తవాలు : వట్టెం

వైసీపీ కార్యాలయంలో ఆదివారం రాత్రి జరిగిన గొడవ నిజానిజాలు తెలియాలంటే సీసీ ఫుటేజీని పోలీసులు పరిశీలించాలని వైసీపీ జగ్గయ్యపేట పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్ తెలిపారు. పథకం ప్రకారం తనపై సోషల్ మీడియాలో దాడి చేశారని, తన అనుచరులు తన కార్యక్రమాలను పోస్టు చేస్తున్నారని, గ్రూప్‌లో నుంచి తొలగించారన్నారు. హార్డ్ డిస్క్‌ను స్వాధీనం చేసుకోవాలని పోలీసులను కోరారు.

రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ పనులను త్వరితగతిన పూర్తిచేయండి

» అధికారులకు కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాలు

కలెక్టరేట్ : స్టార్టప్‌లు, ఆవిష్కరణలకు రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్)తో సరికొత్త ఊపు రానుందని, ఈ హబ్‌తో పారిశ్రామికరంగ రూపురేఖలు సమూలంగా మారనున్నాయని, ఇందుకు సంబంధించి విజయవాడ స్పోక్ కార్యాలయ పనులను త్వరితగతిన పూర్తిచేసి, ప్రారంభానికి సిద్ధం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. సోమవారం టాటా ఇన్నోవేషన్ హబ్-స్పోక్ కార్యకలాపాల నిర్వహణకు అవసరమైన కార్యాలయం, మౌలిక వసతుల కల్పనకు సంబంధించి ఎనికేపాడులోని ఓ భవనాన్ని కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆర్‌టీఐహెచ్ కార్యకలాపాలను వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, నాలుగైదు రోజుల్లో ఒక బ్లాకు పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్ లక్ష్య సాధనకు, స్వర్ణాంధ్ర 2047 దార్శనికతను సాకారం చేయడంలో ఇన్నోవేషన్ హబ్ కీలకంగా నిలవనుందని కలెక్టర్ అన్నారు. కలెక్టర్ వెంట విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, తహసీల్దారు బి.సుగుణ, ఆర్‌అండ్‌బీ ఇంజినీర్లు పాల్గొన్నారు.

మసులా.. మస్త్ జోష్!

» వినోద కార్యక్రమాలకు సిద్ధమవుతున్న మంగినపూడి బీచ్

» యువత, పిల్లల కోసం క్రీడలు.. ప్రత్యేక ఆకర్షణగా కనోయింగ్

» ఆహార ప్రియుల కోసం సీ ఫుడ్ స్టాల్స్

5, 6, 7, 8 తేదీల్లో బీచ్ ఫెస్టివల్





(విజయవాడ, ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం మంగినపూడి బీచ్ 'మసులా' ఫెస్టివల్‌కు సిద్ధమవుతోంది. భారత్‌లో బ్రిటీషు వారు మొదటగా కాలుమోపిన ప్రాంతం ఇది. అప్పట్లో ఈ ప్రాంతాన్ని మాసులీపట్నంగా పిలిచేవారు. ప్రస్తుతం మచిలీపట్నంగా పిలవబడుతున్న ఈ ప్రాంతానికి కృష్ణాజిల్లాలో ప్రధాన వాణిజ్య ఓడరేవుగా పేరుంది. మంగినపూడి బీచ్‌లో పండగ వాతావరణాన్ని సంతరించుకునేలా జిల్లా అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. నాలుగు రోజుల పాటు బీచ్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. రక రకాల స్టాల్స్, ఎగ్జిబిషన్, సాంస్కృతిక కార్యక్రమాలతో పర్యాటకులను ఆకట్టుకునేలా మంగినపూడిని ముస్తాబు చేస్తున్నారు. 'మసులా' బీచ్‌ను పర్యాటంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో కొన్ని సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టింది. దీనిలో భాగంగానే 2018లో బీచ్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించింది. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక బీచ్ ఫెస్టివల్‌ను గాలికొదిలేయడంతో మంగినపూడి బీచ్ అభివృద్ధి మరుగున పడిపోయింది. తిరిగి టీడీపీ అధికారంలోకి రావడంతో బీచ్‌ను అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటోంది.

పిల్లలు, యువత కోసం ప్రత్యేక క్రీడలు

బీచ్ ఫెస్టివల్‌లో యువత, ముఖ్యంగా చిన్న పిల్లలను ఆకట్టుకోవడానికి ప్రత్యేక క్రీడల నిర్వహణకు సన్నాహకాలు చేస్తున్నారు. దీనిలో భాగంగానే యువత కోసం బీచ్ కబడ్డీ పోటీలకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. పిల్లల వినోదానికి సంబంధించిన ఆటల పోటీలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ముఖ్యంగా కనోయింగ్ (సముద్ర అలలపై పడవ నడపడం) ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.

నోరూరించే రుచులతో ఫుడ్ స్టాల్స్

బీచ్ ఫెస్టివల్‌లో భాగంగా వివిధ రకాల ఫుడ్‌స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. పర్యాటకుల కోసం కొత్తరకాల వంటలతో పాటు సీ ఫుడ్స్ స్టాల్స్ ఏర్పాట్లు ఇప్పటికే జోరందుకున్నాయి. దీనికోసం ప్రత్యేకంగా ఫుడ్‌జోన్‌ను ఏర్పాటుచేస్తున్నారు.

వినూత్న ఆవిష్కరణలకు కేంద్రం

» జాతీయస్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలు

» నేడు సినీ కళాకారులతో ప్రదర్శన

» పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : వినూత్న ఆవిష్కరణలకు కేంద్రంగా 'మసులా' బీచ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్టు మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సోమవారం జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో జరిగిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ గంగాధర్‌రావులతో కలిసి మీడియా సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీచ్ ఫెస్టివల్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ఈ నెల 5, 6, 7, 8 తేదీల్లో నిర్వహించనున్న బీచ్ ఫెస్టివల్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు. తొలిసారిగా సీకయాకింగ్ నిర్వహిస్తున్నామన్నారు. 5వ తేదీ ఉదయం 9 గంటలకు క్రీడాకారుల ఆధ్వర్యంలో గేట్ వే ఆఫ్ అమరావతిని, 100 అడుగుల స్తంభంపై జాతీయ జెండాను ఆవిష్కరిస్తారన్నారు. తర్వాత మూడు రోజుల పాటు సాయంత్రం తెలుగు సినీ కళాకారులతో పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఫెస్టివల్ నిర్వహణకు అధికారులు, నగర ప్రముఖులతో ఒక కమిటీని ఏర్పాటు చేశామన్నారు. మంగళవారం ఉదయం కోనేరుసెంటర్ నుంచి జరగనున్న 2 కె రన్ లో 'భైరవ' చిత్ర యూనిట్ నారా రోహిత్, బెల్లంకొండ సాయిశ్రీనివాస్, మంచు మనోజ్ తదితరులు పాల్గొంటారన్నారు. కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ, 'మసుల' బీచ్‌ఫెస్టివల్‌కు వచ్చే సందర్శకులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చూస్తున్నామన్నారు. ఎస్పీ ఆర్.గంగాధరరావు మాట్లాడుతూ, బీచ్ ఫెస్టివల్‌కు వచ్చే పర్యాటకుల వాహనాలకు పార్కింగ్ ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు.

అభివృద్ధే లక్ష్యంగా కౌన్సిలర్ల మద్దతు

» ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)

తిరువూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : తిరువూరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఉప ఎన్నిక ప్రశాంతంగా ముగిసిందని, పట్టణ అభివృద్ధే లక్ష్యంగా కౌన్సిలర్లు టీడీపీకి మద్దతుగా నిలిచారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)అన్నారు. సోమవారం ఉపఎన్నిక అనంతరం చైర్‌పర్సన్ నిర్మల, కౌన్సిలర్లను ఆయన అభినందించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ, పట్టణంలో డ్రెయిన్, తాగునీరు, పారిశుధ్యం, రహదారులు ప్రధాన సమస్యలుగా ఉన్నాయని, మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసి నిధులు సమకూర్చి వచ్చే ఆరునెలల్లో పరిష్కరించేలా కృషిచేస్తామన్నారు. కేంద్ర, ఉపఎన్నిక సందర్భంగా పట్టణంలో అలజడి సృష్టించేందుకు ప్రయత్నించిన మూకల్ని కూటమి నాయకులు, కార్యకర్తలు సమర్థంగా అడ్డుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అండతో ఎంపీ సహకారంతో పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు.



నిర్మలను అభినందిస్తున్న కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే కొలికపూడి

వెన్నుపోటు రాజకీయాలకు తెరతీసిన కూటమి నేతలు : నల్లగట్ల

సమరయోధులు పుట్టిన తిరువూరు గడ్డపై కుటిల వెన్నుపోటు రాజకీయాలకు, కూటమి నాయకులు తెరతీశారని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. సోమవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వ్యవస్థను భ్రష్టుపట్టించేలా.. మున్సిపాలిటీలో వైసీపీ సభ్యులు 17మంది ఉండి.. టీడీపీ సభ్యులు ముగ్గురు మాత్రమే ఉంటే బోర్డును ఎలా కైవశం చేసుకుందని ప్రశ్నించారు. టీడీపీకి మద్దతు పలికిన వైసీపీకి చెందిన ఎడుగురు కౌన్సిలర్లను పార్టీ నుంచి బహిష్కరించినట్టు ఆయన ప్రకటించారు.

హెచ్‌ఎంల పోస్టింగ్‌పై కొనసాగుతున్న కసరత్తు

మచిలీపట్నం టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న స్కూల్ అసిస్టెంట్లు సోమవారం కూడా వెబ్ ఆప్షన్‌లో కోరుకున్న పాఠశాలలను నమోదు చేసుకోలేకపోయారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో 2986 మంది స్కూల్ అసిస్టెంట్లు బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. షెడ్యూల్ ప్రకారం బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న స్కూల్ అసిస్టెంట్లు 1, 2 తేదీల్లో వెబ్ ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంది. బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న సెకండరీ గ్రేడ్ టీచర్లు జూన్ 7 నుంచి 10వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వాలి. ఉపాధ్యాయులు తమకు దగ్గరలో కోరుకున్న పాఠశాలలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది.

● స్కూల్ అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియకు మోడల్ ప్రైమరీ పాఠశాలల హెచ్‌ఎం పోస్టుల భర్తీ ముడిపడి ఉంది. జిల్లాలో కొత్తగా 586 మోడల్ ప్రైమరీ పాఠశాలలను విద్యాశాఖాధికారులు ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలల్లో ఇప్పటికే 230 మంది స్కూల్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. వీరు కాకుండా మిగిలిన 356 మంది స్కూల్ అసిస్టెంట్లను మోడల్ స్కూల్స్‌లో నియమించవలసి ఉంది. ఈ నేపథ్యంలో బదిలీలకు దరఖాస్తు చేసుకున్న 2986 మంది స్కూల్ అసిస్టెంట్లలో 356 మంది తమకు దగ్గరలోని మోడల్ ప్రైమరీ పాఠశాలలకు వెళ్ళే అవకాశాలు ఏర్పడ్డాయి. ఇలా మోడల్ ప్రైమరీ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పోస్టులను స్కూల్ అసిస్టెంట్లతో భర్తీ చేసిన అనంతరం స్కూల్ అసిస్టెంట్ల వెబ్ ఆప్షన్లు ఇచ్చే మార్గం సుగమం అవుతుంది. ఈ నేపథ్యంలో బుధవారం స్కూల్ అసిస్టెంట్లు వెబ్ ఆప్షన్లు ఇచ్చే అవకాశాలు ఉన్నాయి.

● అర్హత, సీనియారిటీ ఉన్న సెకండరీ గ్రేడ్ టీచర్లను స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు చేయనున్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ పోస్టులను సెకండరీ గ్రేడ్ టీచర్లకు పదోన్నతులు కల్పించి భర్తీ చేయనున్నారు. జిల్లాలో 126 మంది స్కూల్ అసిస్టెంట్లకు ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలుగా పదోన్నతులు కల్పించారు. ఇలా ఖాళీ అయిన స్కూల్ అసిస్టెంట్ పోస్టులను సెకండరీ గ్రేడ్ టీచర్లకు పదోన్నతులు కల్పించి భర్తీ చేయనున్నారు. ఇందుకు విద్యాశాఖాధికారులు సీనియారిటీ జాబితాలు తయారు చేయడంపై కసరత్తు చేస్తున్నారు.

● టీచర్ల పదోన్నతులు, బదిలీలు వారికి వచ్చిన పాయింట్ల ఆధారంగా సీనియారిటీ జాబితాలు రూపొందిస్తారు. అయితే టీచర్లకు కేటాయించిన పాయింట్లపై యుటిఎఫ్, ఏపిటిఎఫ్ నాయకులు కొన్ని అభ్యంతరాలు తెలియచేశారు. వాటిపై విద్యాశాఖాధికారులు కసరత్తు చేస్తున్నారు. దీని వల్ల సీనియారిటీ జాబితాలు ప్రకటించడంలో జాప్యం ఏర్పడింది. దీనిపై డీఈవో రామారావును వివరణ కోరగా ఉపాధ్యాయ సంఘాలు వినతిపత్రాలను స్వీకరించి పాయింట్లలో ఏమైనా తేడాలుంటే సరిచేస్తున్నామని, స్కూల్ అసిస్టెంట్లు ఒకటి రెండు రోజుల్లో వెబ్ ఆప్షన్లు ఇచ్చేందుకు అవకాశం ఉందన్నారు. తక్షణ కర్తవ్యంగా మోడల్ ప్రైమరీ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పోస్టులను భర్తీ చేసే ప్రక్రియ ప్రారంభించామన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా ఆధారంగా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ జరుగుతుందని డీఈవో రామారావు తెలిపారు.



పారిశుధ్యకార్మికులతో కలిసి యోగాసనాలు వేస్తున్న అధికారులు

యోగాతో రుగ్మతలు దూరం

సత్యనారాయణపురం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): యోగా చెయ్యండి.. రుగ్మతులకు దూరంగా ఉండండి.. అని కలెక్టర్ జి.లక్ష్మీశ, నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రలు నగర ప్రజలకు పిలుపునిచ్చారు. ఆయుష్ శాఖ, ఎన్టీఆర్ జిల్లా అధికారయంత్రాంగం, నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో సోమవారం బీఆర్టీఎస్ రోడ్డులో పారిశుధ్యకార్మికులతో 'థీమ్ యోగా' కార్యక్రమం జరిగింది. పారిశుధ్యకార్మికులతో కలిసి అధికారులు యోగాసనాలు వేశారు. యోగాతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసికంగా ఉత్సహంగా పని చేసేందుకు వీలుంటుందన్నారు.

ఇక ప్రైవేటుగా..

(5వ పేజీ తరువాయి)

ఎలాంటి టెస్టులు నిర్వహించకుండా రవాణా శాఖ నేరుగా హెవీ వెహికల్ లైసెన్స్‌ను మంజూరు చేస్తుంది.

శిక్షణ తప్పనిసరి

ప్రైవేటు సంస్థల ద్వారా హెవీ వెహికల్ లైసెన్స్‌లు పొందాలంటే రెండున్నర నెలలు అంటే 10 వారాల పాటు నిరంతరాయ శిక్షణ తీసుకోవాల్సి ఉంటుంది. అంపాపురంలోని మోడల్ డ్రైవింగ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో హెవీ వెహికల్ డ్రైవర్లకు ప్రస్తుతం నెల రోజుల శిక్షణ తర్వాత సర్టిఫికెట్లను ఇస్తున్నారు. ఇక మీదట ఇక్కడ కూడా 10 నెలల పాటు ట్రైనింగ్ ఇస్తారు. ఏదో రెండు, మూడు రోజుల పాటు వచ్చి సర్టిఫికెట్లు తీసుకుంటామంటే కుదరదు. పదహారు గంటల థియరీ క్లాసులు వినటంతో పాటు 22 గంటల ప్రాక్టికల్స్ ఉండాలి. ప్రతి రోజూ ఏ వాహనం మీద డ్రైవర్ ట్రైనింగ్ తీసుకుంటున్నాడు? ఇన్‌స్ట్రక్టర్ ఎవరు ? ఎన్ని గంటల పాటు డ్రైవింగ్ చేశాడు? వంటివి ఆన్‌లైన్‌లో రికార్డు అవుతుంటాయి. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత స్థానికంగా నిర్వాహకులు టెస్ట్ పెడతారు. ఈ టెస్ట్‌లో పాస్ అయిన వారికి సర్టిఫికెట్లు ఇస్తారు. హెవీ వెహికల్ లైసెన్స్‌లు కలిగిన వారితో పాటు లైట్ మోటారు వెహికల్, ద్విచక్రవాహనాల డ్రైవింగ్ లైసెన్సుల జారీకి కూడా శిక్షణ ఇస్తారు.

డ్రైవింగ్ శిక్షణ కేంద్రం ఎలా ఏర్పడిందంటే..

1988లో డ్రైవర్లకు తగిన శిక్షణ అవసరమని భావించి కేంద్ర ప్రభుత్వం చట్టాన్ని చేయటం జరిగింది. అందులో భాగంగా విజయవాడలో రోడ్ల మీద వాహనాలను నడిపిస్తూ శిక్షణ ఇచ్చేవారు. ఈ విధానం వల్ల నైపుణ్యవంతమైన డ్రైవర్లు కావటం లేదని అప్పట్లో కృష్ణాజిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ భావించింది. నాణ్యమైన డ్రైవర్లను తీర్చిదిద్దటానికి తామే డ్రైవర్లకు శిక్షణ ఇవ్వాలన్న ఉద్దేశ్యంతో అప్పట్లో అసోసియేషన్‌లో క్రియాశీలకంగా ఉన్న వైవీ ఈశ్వరరావు నేతృత్వంలో రవాణా శాఖను సంప్రదించి 1991లో గూడవల్లిలో 4,800 చదరపు అడుగుల విస్తీర్ణంలో డ్రైవింగ్ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత కాలంలో కేంద్ర ప్రభుత్వం డ్రైవింగ్ శిక్షణా కేంద్రాలకు ప్రోత్సాహకాలు కల్పించటంతో 1993లో అంపాపురం దగ్గర 19 ఎకరాల విస్తీర్ణంలో మోడల్ డ్రైవింగ్ ట్రైనింగ్ అండ్ రీసెర్చి సెంటర్‌ను నెలకొల్పారు. ఏటా వందలాది మంది శిక్షణ పొందుతూ రవాణా శాఖ అధికారుల చేతుల మీదుగా సర్టిఫికెట్ల ప్రధానం జరుగుతుంది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రైవేటుగా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్, ట్రైనింగ్ అండ్ రీసెర్చి సెంటర్స్ (ఐడీటీఆర్‌సీ)లకు అనుమతి ఇవ్వటంతో తనను తాను అప్‌గ్రేడ్ చేసుకోవటానికి వీలుగా, అత్యాధునిక సిమ్యులేటర్లు, ఇతర సాంకతిక వ్యవస్థలను బలోపేతం చేసుకుని కేంద్ర ప్రభుత్వానికి కృష్ణాజిల్లా లారీ యజమానుల సంఘం దరఖాస్తు చేసింది. ఆమేరకు అంపాపురం శిక్షణా కేంద్రానికి ప్రైవేటుగా లైసెన్సుల జారీ చేసే అధికారం దక్కింది.

ప్రైవేటు సంస్థలకూ అవకాశం

డ్రైవింగ్ శిక్షణ కల్పించాలనుకున్న ఇతర ప్రైవేటు సంస్థలకు కూడా కేంద్రం అనుమతులు ఇస్తుంది. ప్రస్తుతం అంపాపురంలో కేడీఎల్‌వోఏ నిర్వహిస్తున్న ఐటీడీఆర్‌సీ అయితే కనీసం 20 ఎకరాల విస్తీర్ణంతో పాటు ట్రాక్, అత్యాధునిక సిమ్యులేటర్లు, ఇన్‌స్ట్రక్టర్స్ కలిగి ఉండాలి. వీటికి కేంద్రం రూ.4 కోట్లు ఇస్తుంది. మరో రూ.2 కోట్లను కేడీఎల్‌వోఏ భరించింది. ఇవి కాకుండా రీజనల్ డ్రైవింగ్, ట్రైనింగ్ సెంటర్స్ (ఆర్‌డీటీసీ)లను ఇస్తారు. వీటికి కేంద్ర ప్రభుత్వం రూ.3.50 కోట్లు అందిస్తుంది. ఇవి కాకుండా డ్రైవింగ్, ట్రైనింగ్ సెంటర్స్ (డీటీసీ)లకు కూడా అనుమతినిస్తోంది. వీటికి రూ.2.50 కోట్ల నిధులను కేంద్రం అందిస్తుంది. కేవలం రెండెకరాలు ఉంటే సరిపోతుంది.

మల్లవల్లికి మళ్లీ కళ

(5వ పేజీ తరువాయి)

వచ్చింది. భూ కేటాయింపుల రద్దు సందర్భంలోనే.. అమాంతంగా భూముల ధరలను పెంచేయటం జరిగింది. పెంచిన భూముల ధరల ప్రకారం చెల్లింపులు జరిపితేనే తిరిగి భూముల రిజిస్ట్రేషన్ జరుగుతుందని తేల్చిచెప్పింది.

భూముల పునరుద్ధరణకు కూటమి ప్రభుత్వం నిర్ణయం

కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎంత మంది పారిశ్రామికవేత్తలకు భూకేటాయింపు లను రద్దు చేయటం జరిగిందో అంతమందికి పునరుద్ధరణ జరపాలని నిర్ణయించింది. ఏపీఐఐసీ అధికారులకు వచ్చిన ఆదేశాల మేరకు మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో ఎవరికైతే భూ కేటాయింపులు రద్దు ఉత్తర్వులు ఇచ్చారో వారందరికీ భూ కేటాయింపులను పునరుద్ధరించినట్టుగా ఈ మెయిల్స్ పంపుతున్నారు. ఇలా జిల్లాలో మొత్తం 371 మందికి భూ కేటాయింపు పునరుద్ధరణ లేఖలను పంపటం జరిగింది. భూ కేటాయింపులు పునరుద్ధరించే క్రమంలో ఏపీఐఐసీ అధికారులు తగిన జాగ్రత్తలు కూడా తీసుకుంటున్నారు. ఆరు నెలల్లో యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాల్సిందిగా నిర్దేశించారు. చర్యలు తీసుకోకపోతే మాత్రం దఫాలుగా నోటీసులు ఇవ్వటం జరుగుతుంది. అప్పటికీ కూడా ఏర్పాటు చేయకపోతే వాటి భూ కేటాయింపులను రద్దు చేయటం జరుగుతుంది.

మైలవరంలో ఫుడ్ ప్రాసెసింగ్‌పై ఫోకస్

ఎన్టీఆర్ జిల్లాలో మైలవరం నియోజకవర్గం పరిధిలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. మైలవరంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల కోసం యుద్ధ ప్రాతిపదికన 11 ఎకరాలను ఏపీఐఐసీ అధికారులు గుర్తించినట్టు తెలుస్తోంది. ఈ భూములతో పాటుగా మరికొన్ని భూముల అన్వేషణ సాగిస్తున్నారు.

తిరువూరు మున్సిపాల్టీ టీడీపీ కైవసం

(5వ పేజీ తరువాయి)

ప్రక్రియలో టీడీపీ బలపర్చిన అభ్యర్థినిగా కొలికపోగు నిర్మల అభ్యర్థిత్వాన్ని 11వ వార్డు కౌన్సిలర్ కాకర్లమూడి సుందరకుమార్ ప్రతిపాదించగా, 14వ వార్డు కౌన్సిలర్ పసుపులేటి శేఖర్‌బాబు బలపర్చారు. వైసీపీ అభ్యర్థిగా మోదుగు ప్రసాద్ అభ్యర్థిత్వాన్ని 10వ వార్డు కౌన్సిలర్ తంగిరాల వెంకటరెడ్డి ప్రతిపాదించగా, 7వ వార్డు కౌన్సిలర్ పరసా శ్రీనివాసరావు (బీరువాల బాబు) బలపర్చారు. ఉప ఎన్నికలకు ఎక్స్ అఫిషియో మెంబర్, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుతో పాటు టీడీపీ మద్దతుదారులు 11 మంది, వైసీపీ మద్దతుదారులు తొమ్మిది మంది హాజరయ్యారు. ఈ ఎన్నికలో నిర్మలకు 11 మంది కౌన్సిలర్లు చెయ్యెత్తి మద్దతు తెలపడంతో ఆమె గెలిచినట్లు ఎన్నికల అధికారిణి, ఆర్డీవో కె.మాధురి ప్రకటించారు. ఆమెతో చైర్‌పర్సన్‌గా ప్రమాణం చేయించారు. ఎన్నికల పరిశీలకుడు, డీఆర్వో నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ జి.లోవరాజు పాల్గొన్నారు.

చెలరేగిన గొలుసు దొంగలు

(5వ పేజీ తరువాయి)

జ్యూవెలరీస్ ఎదురుగా ఉన్న మున్సిపల్ కాలనీలో కిరాణా కొట్టు నిర్వహిస్తున్న మహిళ మెడలో గొలుసును లాగేసారు. కిరాణా కొట్టు వద్దకు వెళ్లిన తర్వాత ఒక యువకుడు బైక్‌పై బయట నిలబడి ఉండగా, మరో యువకుడు షార్ట్, ముఖానికి చేతి రుమాలు కట్టుకుని షాపు వద్దకు వెళ్లాడు. అందులో ఉన్న మహిళను చాక్లెట్లు ఉన్నాయా అని అడిగాడు. తరువాత బయటకు వచ్చి రోడ్డును అటూఇటూ పరిశీలించాడు. పారిపోవడానికి మార్గాలను చూసుకున్న అనంతరం ఆమె వద్దకు వెళ్లి మెడలో గొలుసును బలంగా లాగాడు. ఈ గొలుసు తెగిపోయి షాపులోనే పడిపోయింది. అందులో చిన్న ముక్క మాత్రం నిందితుడు చేతిలోకి వెళ్లింది.

కారును ఢీకొని కిందపడ్డ యువకులు

గొలుసు లాగగానే బైక్‌పై ఇద్దరు యువకులు పారిపోయారు. ఈ క్రమంలో వైవీ రావు ఆసుపత్రి వీధిలో ఒక కారును ఢీకొట్టడంతో పడిపోయారు. ఇందులో ఒక యువకుడికి గడ్డం వద్ద గాయమైంది. కారు యజమాని దిగి ప్రమాదం చేసినందుకు వారిపై దాడిచేశాడు. దీంతో బైక్‌ను అక్కడే వదిలేసి ఇద్దరు యువకులు పారిపోయారు. చోరీకి నెంబర్ ప్లేటు లేని యమహా ఎంటీ-15 బైక్‌ను ఉపయోగించారు. ఇద్దరు యువకుల్లో ఒకరు పొడవుగా, ఒకరు పొట్టిగా ఉన్నట్లు సీసీ కెమెరా ద్వారా పోలీసులు గుర్తించారు. ఒకరు ధరించిన టీషర్టుపై టామ్ అని పెద్ద అక్షరాలతో రాసి ఉన్నట్లు వైవీ ఆసుపత్రి వీధిలోని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఆటోనగర్‌లో జరిగిన ఘటనపై పటమట పోలీసులు, మున్సిపల్ కాలనీలో జరిగిన ఘటనపై మాచవరం పోలీసులు కేసులు నమోదు చేశారు.

కృష్ణానదిపై బ్రిడ్జి!

(5వ పేజీ తరువాయి)

ప్రారంభమయ్యాయి. రాష్ట్రానికి గేట్ వేగా ఉన్న ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం పలు ప్రతిపాదనలు చేస్తున్న నేపథ్యంలో ముక్త్యాల వద్ద బ్రిడ్జి నిర్మాణానికి నోచుకుంది. తెలంగాణ, ఆంధ్ర నుంచి తమిళనాడుతో పాటు తిరుపతి వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లేందుకు దగ్గర మార్గంగా మారనుంది. ఇప్పటికే ముక్త్యాల కృష్ణానది ఉత్తరవాహిని క్షేత్రంగా పలు ఆలయాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో సిమెంట్ కర్మాగారాలున్నాయి. దీంతో ముక్త్యాలకు భవిష్యత్‌లో ఈ వంతెన మణిహారంగా మారుతుందని భావిస్తున్నారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122,131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 510

ఠాగూర్ గ్రంథాలయాధికారిణిగా రమాదేవి బాధ్యతల స్వీకారం

గవర్నర్‌పేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయ అధికారిణిగా కొల్లూరి రమాదేవి నియమితులయ్యారు. ఏపీ ప్రభుత్వం సాధారణ బదిలీలకు అనుమతి ఇచ్చిన సందర్భంగా పౌర గ్రంథాలయ శాఖ కౌన్సెలింగ్ ద్వారా ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థలో గ్రేడ్-1 గ్రంథపాలకుల బదిలీలు నిర్వహించారు. దీనిలో భాగంగా రమాదేవిని ఠాగూర్ గ్రంథాలయానికి బదిలీ చేసిన కారణంగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రమాదేవి బాధ్యతలు స్వీకరించడం పట్ల గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు హర్షం వ్యక్తం చేశారు.



శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ సమీపంలోని సర్వీస్ రోడ్డులోని తూములో మట్టి



ఎన్టీఆర్ కాలనీ మహానాడు రోడ్డు సమీపంలో...



ఏలూరు జాతీయ రహదారిపై ఉన్న తూములో మట్టి...

చెత్తతో నిండిన తూములు

- చిన్నపాటి వర్షానికే రోడ్డు మీద నిలుస్తున్న నీరు
- వాహనదారులు, పాదచారుల అవస్థలు

భారతీనగర్, ఆంధ్రజ్యోతి: చూడడానికి చిన్న సమస్యగా కనిపించినా దీని వల్లన పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బెంజిసర్కిల్ నుంచి రామవరప్పాడు రింగ్ వరకు ఉన్న జాతీయ రహదారి, సర్వీస్ రోడ్లో వర్షపు నీటిని మళ్లించడానికి ఏర్పాటు చేసిన తూములలో మట్టి, చెత్త పేరుకుపోయాయి. ఈ ప్రాంతంలో చిన్నపాటి వర్షం కురిసినా ఏలూరు జాతీయ రహదారి వెంబడి ఉన్న సర్వీస్ రోడ్డుపై, జాతీయ రహదారిపై పలు చోట్ల వాన నీరు నిలిచిపోయింది. ఈ నీళ్ల గంటల తరబడి ఉండడంతో పాదచారులు, ద్వి చక్రవాహనదారులు రోడ్డుమీదకు రాలేని పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో ఆ సమయంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇప్పుడే ఇలా ఉంటే రాబోయే వాన కాలంలో రోడ్లన్నీ మునిగిపోతాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

మహిళా ట్రాఫిక్ కానిస్టేబుళ్లకు స్పోర్ట్స్ షూ పంపిణీ



మహిళా ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు స్పోర్ట్స్ షూ, మాస్కులు, హ్యాండ్ గ్లౌజ్‌లు పంపిణీ చేస్తున్న ట్రాఫిక్ ఏడీసీపీ ప్రసన్న కుమార్

గుణదల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మహిళా శక్తిని ప్రోత్సహించాలనే ఆలోచనతో ట్రాఫిక్ విభాగంలో పనిచేస్తున్న 33మంది మహిళా కానిస్టేబుళ్లకు స్పోర్ట్స్ షూ, మాస్కులు, హ్యాండ్ గ్లౌజ్‌లు పంపిణీ చేసినట్లు ట్రాఫిక్ ఏడీసీపీ ప్రసన్న కుమార్ తెలిపారు. మహిళా కానిస్టేబుళ్ల సేవలను మరింతగా ప్రోత్సహించాలన్న ఆలోచనతో సీపీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐలు బాల మురళీకృష్ణ, రామారావు, సురేష్ పాల్గొన్నారు.

నలుగురికి నగదు బహుమతి

ట్రాఫిక్ నియంత్రణ సమయంలో కొందరి ప్రాణాలు కాపాడిన వారిని గుర్తించి వారికి సోమవారం నగదు బహుమతిని అందించినట్లు ఏడీసీపీ ప్రసన్న కుమార్ తెలిపారు. నాల్గో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న ఒక హెడ్ కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్లకు ఒకటవ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న మరో కానిస్టేబుల్‌కు ట్రాఫిక్ ఏడీసీపీ నగదు బహుమతులు అందజేసి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ పి.రామచంద్రరావు, ట్రాఫిక్ సీఐలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యకు సరైన పరిష్కారం అందించాలి

- మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర



కార్పొరేషన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : నగర ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే ప్రతి సమస్యకు సరైన పరిష్కారం అందించాలని మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగరపాలకసంస్థ ప్రధాన కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను అధికారులతో కలిసి నిర్వహించారు. అదే విధంగా సర్కిల్-1,2,3 కార్యాలయాలలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంలో నగర ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను కమిషనర్ స్వీకరించి మాట్లాడుతూ ప్రతి సమస్యకు ప్రజలకు సంతృప్తికరమైన, శాశ్వతమైన పరిష్కారం అందించేటట్లుగా ఉండాలని అధికారులను ఆదేశించారు. పురమిత్ర యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను కూడా పరిష్కరించాలని, ఇప్పటివరకు పురమిత్రలో నమోదైన సమస్యలను పరిశీలించి తగిన పరిష్కారం అందించాలని అధికారులను ఆదేశించారు. 11 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. నగరపాలకసంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భ్రమరాంబపురం రిజిస్ట్రేషన్ సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్‌కు సీపీఎం వినతి



సమస్యను కలెక్టర్‌కు వివరిస్తున్న దోనేపూడి కాశీనాథ్

కలెక్టరేట్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : కృష్ణలంక భ్రమరాంబపురం ప్రాంతంలో ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని, జీవో నెం.119ను సవరించి కృష్ణానది పరివాహక ప్రాంతంలో ఇళ్లకు బిల్డింగ్ ప్లాన్‌లు ఇవ్వాలని కలెక్టర్ లక్ష్మీశకు సీపీఎం నాయకుడు దోనేపూడి కాశీనాథ్ విన్నవించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తూర్పు నగర కార్యదర్శి పుప్పాల కృష్ణ, కాశీనాథ్‌లు కలెక్టర్‌తో మాట్లాడుతూ, కృష్ణలంక 22వ డివిజన్‌లోని భ్రమరాంబపురంలో సుమారు 1200 కుటుంబాలు గత 40ఏళ్లుగా సొంత ఖర్చులతో ఇళ్లు నిర్మించుకొని ఉంటున్న ఆ ఆస్తిపై కుటుంబానికి హక్కు కల్పించలేదన్నారు. ఆ ఇళ్లకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని వారు కలెక్టర్‌ను కోరారు. అలాగే కృష్ణలంక నుంచి రామలింగేశ్వరనగర్ వరకు వేల సంఖ్యలో నదికి దగ్గరలో ఉంటున్న ఇళ్లకు ప్లాన్‌లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బత్తుల చిన్నారావు, కోరాడ రమణ, కాయల లక్ష్మణ, వాజా శ్రీనివాస్, ఆనంద్, కసర లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

పటమట సెంటర్లో జీబ్రా లైన్లు లేక పాట్లు



జీబ్రాలైన్లు లేని పటమట సాయి హోటల్ ప్రాంతం

పటమట, ఆంధ్రజ్యోతి: పటమట సెంటర్లో రోడ్డు దాటేందుకు వీలుగా జీబ్రా లైన్లు లేక అనేక ఇబ్బందులు పడుతున్నట్లు ఆయా ప్రాంత వాసులు అంటున్నారు. బెంజిసర్కిల్ నుంచి పటమట ప్రాంతం వైపు వచ్చే మార్గంలో ఎన్టీఆర్ సర్కిల్ వద్ద మాత్రమే యూ టర్న్ ఉంది. అక్కడి నుంచి మరో అర కిలోమీటర్ దూరంలో సోనోవిజన్ వద్ద యూ టర్న్ ఉంది. దీని వల్ల పటమట సెంటర్లో రోడ్డు దాటేందుకు వృద్ధులు, పిల్లలు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. పటమట సాయి హోటల్ పక్క రోడ్డులో నారాయణ బాలికల కళాశాల ఉంది. కుడి పక్కన సర్కిల్ త్రీ కార్యాలయం, హాస్పటల్స్, ప్రైవేటు పాఠశాలలు, ఎన్ఎస్ఎం పాఠశాలలు ఉన్నాయి. రోజు వేల మంది పటమట సెంటర్ నుంచి అటు రాకపోకలు సాగిస్తుంటారు. స్థానికుల ఇబ్బందులు తొలగాలంటే అవసరమైన చోట జీబ్రా లైన్లు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

ప్రభుత్వాసుపత్రి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు ఫిలిం కాలనీ, క్రీస్తురాజుపురం, అరుణ్‌నగర్, మైత్రీనగర్, హరిజనవాడ, సంజీవిని హాస్టల్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కార్యనిర్వహక ఇంజనీరు పి.హరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వైద్య కళాశాలలను పీపీపీ పద్ధతిలో

లీజుకు ఇచ్చే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

- పీడీఎస్‌వో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్

ప్రభుత్వాసుపత్రి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ పద్ధతిలో లీజుకు ఇచ్చే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్ అన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ 66 ఏళ్లపాటు లీజుకు ఇచ్చే విషయాన్ని పునరాలోచించాలన్నారు. జీవో 107,108లను రద్దుచేసి అన్ని ఎంబీబీఎస్ సీట్లను వందశాతం ప్రభుత్వ కోటాలో భర్తీ చేయాలని, 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను పూర్తి ప్రభుత్వ ఆధ్వర్యంలో నడపాలన్నారు. ప్రభుత్వ భూములను ఎకరాకు రూ.100 చొప్పున లీజుకు ఇచ్చే దుర్మార్గ నిర్ణయాన్ని విరమించాలని, పేద, ఎస్సీ, ఎస్టీ బీసీ విద్యార్థులకు ఉచిత వైద్య విద్య, ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలను అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. వైద్య కళాశాలల నిర్మాణం, పారదర్శకతను నిర్ధారించేందుకు విద్యార్థులు, ప్రజలతో సంప్రదింపులు జరపాలని డిమాండ్ చేశారు.



సర్కిల్ త్రీ వద్ద అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

పటమట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలను నిరోధించేందుకు సోమవారం పటమట సర్కిల్ త్రీ కార్యాలయం వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. అగ్నిప్రమాదాలు జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అనుకోకుండా సంభవిస్తే ఎలాంటి పరికరాలతో నిరోధించాలి, అగ్నిమాపక పరికరాలు ఎక్కడెక్కడ ఉంచుకోవాలి, అలారం అలెర్ట్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఫైర్ ఎక్స్టింగ్యూషర్‌తో మంటలు ఎలా ఆర్పాలనే విషయాన్ని నేర్పించారు. ఈకార్యక్రమంలో జోనల్ - 3 కమిషనర్ కె.షమ్మి, అసిస్టెంట్ కమిషనర్ ఏయూబీ శర్మ, డిస్ట్రిక్ ఫైర్ ఆఫీసర్ మల్యాద్రి, రీజనల్ ఫర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎం.రాజ, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నపూర్ణ థియేటర్ ప్రహరీ, బుకింగ్‌లు ధ్వంసం



విజయవాడ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గవర్నరుపేటలోని ఎన్టీఆర్ కాంప్లెక్స్‌కు పక్కన ఉన్న అన్నపూర్ణ-శకుంతల థియేటర్‌పై దాడి జరిగింది. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి జరిగింది. ఈ థియేటర్‌ను అడుసుమిల్లి శ్రీరామ్‌తోపాటు మరో ఇద్దరు భాగస్వాములు నిర్వహిస్తున్నారు. థియేటర్ నిర్వహణ బాధ్యతలను మొత్తం శ్రీరామ్ చూస్తున్నారు. శనివారం రాత్రి రెండో ప్రదర్శన ముగిసే వరకు శ్రీరామ్ థియేటర్‌లో ఉన్నారు. థియేటర్‌కు తాళాలు వేసి ఇంటికి చేరుకున్నారు. అదే రోజు అర్ధరాత్రి ఒక ట్రాలీలో ఎక్స్‌కవేటర్‌ను తీసుకొచ్చి కొంతమంది దుండగులు థియేటర్ ప్రహరీ, ముందున్న బుకింగ్‌లు, హాలులోకి వెళ్లే మెట్లను, మరుగుదొడ్లను ధ్వంసం చేశారు. అక్కడున్న వాచ్‌మన్‌ల వద్ద ఉన్న సెల్‌ఫోన్లను లాక్కుని కత్తులతో బెదిరించినట్టు శ్రీరామ్ ఆరోపించారు. దీనిపై పోలీసు కమిషనర్, గవర్నరుపేట పోలీసులకు రిజిస్టర్ పోస్టులో ఫిర్యాదు చేసినట్టు శ్రీరామ్ తెలిపారు.

15 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు పంపిణీ

పాయకాపురం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధన ప్రకారం నిరభ్యంతరకర స్థలాల్లో ఉంటున్నవారికి రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ తర్వలో జరుగుతుందని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో సోమవారం63వ డివిజన్‌కు చెందిన 15 కుటుంబాలకు ఇళ్లపట్టాలు రిజిస్ట్రేషన్ చేసుకున్న లబ్ధిదారులకు బొండా ఉమా చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాంబేకాలనీ, న్యూరాజరాజేశ్వరిపేట, రాజీవ్‌నగర్, అజిత్‌సింగ్‌నగర్, శాంతినగర్, తదితర ప్రాంతాల్లో ఇళ్లపట్టాల కోసం ఎదురు చూస్తున్న వేలాది కుటుంబాలకు పూర్తి హక్కుతో కూడిన రిజిస్ట్రేషన్ ఇళ్లపట్టాలను పంపిణీ చేస్తామని తెలిపారు. ఏఎంసీ మాజీ డైరెక్టర్ ఘంటా కృష్ణమోహన్, డివిజన్ అధ్యక్షులు లబ్బా వైకుంఠం, కోలా శ్రీను, దుర్గా, ఖాసీం, పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

సత్యనారాయణపురం: 27వ డివిజన్ సాంబమూర్తిరోడ్డులోని రజకకల్యాణ మండపంలో 72 మంది మహిళలకు సోమవారం సాయంత్రం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలకు పసుపు కుంకుమ చీరలు అందచేసి, సామూహిక సీమంతాలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ప్రధానకార్యదర్శి నవనీతం సాంబశివరావు, డివిజన్ అధ్యక్షులు జయరాజ్, మల్లంపల్లి సురేష్, ,రూప్‌కుమార్, రుక్మిణి, రవణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం నిర్వహించే హక్కు జగన్‌కు లేదు

- టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు షేక్ కరీముల్లా

గొల్లపూడి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర ప్రజలు 11 సీట్లతో గట్టిగా బుద్ధి చెప్పినా వైసీపీ అధినేత జగన్‌కు బుద్ధి రావడం లేదు. వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహించే హక్కు ఆయనకు, ఆ పార్టీ నాయకులకు లేదు.' అని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు షేక్ కరీముల్లా అన్నారు. సోమవారం గొల్లపూడిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు చూసి వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని, అందుకే ఇలాంటి పనికిరాని కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. త్వరలో లిక్క ర్ స్కామ్‌లో ఆ పార్టీ ముఖ్య నాయకులందరూ అరెస్టు కావడం ఖాయమన్నారు. జగన్మోహన్ రెడ్డి ఇంకా భ్రమలోనే ఉన్నాడని, కాబోయే సీఎం తానేనని అంటున్నాడని అన్నారు. జగన్ కాబోయే సీఎం కాదు, జైలుకు వెళ్లబోయే నేత అని ఆయన ఎద్దేవా చేశారు. ఆ పార్టీలో ఉన్న నాయకులు ఇప్పటికైనా ఆలోచించుకోవాలని సూచించారు.

వీఎంసీలో పదవీ విరమణ పొందిన సిబ్బందికి సన్మానం

కార్పొరేషన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : వీఎంసీలో పదవీ విరమణ పొందిన సిబ్బందిని సోమవారం మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర సన్మానించారు. నగరపాలకసంస్థలో ఎస్టేట్ విభాగం సూపరింటెండెంట్ ప్రశాంతి, ప్రజారోగ్య విభాగం శానిటరీ సూపర్‌వైజర్ రెబగొండ్ల ఓబేశ్వరరావు, ఇంజనీరింగ్ విభాగం జేటీవో పీవీఎస్‌పీఆర్. శర్మ, అకౌంట్స్ విభాగం ఆఫీస్ సబార్డినేట్ జి. ధనలక్ష్మి, ఎస్టేట్ విభాగం జి.వి. శ్రీనివాస్ లు గతనెల 31న పదవీ విరమణ పొందారు. సోమవారం కమిషనర్ ఆయన చాంబర్‌లో పదవీ విరమణ పొందిన సిబ్బందిని ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఈ ఆర్. శ్రీనాథ్ రెడ్డి, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, అకౌంట్స్ ఆఫీసర్ బి. సత్యనారాయణమూర్తి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ పాల్గొన్నారు.

రోడ్డుపై వర్షపు నీటి నిల్వలు లేకుండా చూడండి

వన్‌టౌన్: వర్షపునీటి నిల్వలు రోడ్డుపై ఉండకుండా చర్యలు తీసుకునేలా అధికారులు పర్యవేక్షిస్తుండాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. సోమవారం వన్‌టౌన్ కృష్ణవేణి క్లాత్ మార్కెట్, అవుట్‌ఫాల్ డ్రెయిన్, ఆర్టీసీ రోడ్డు వర్క్‌షాప్ అన్నక్యాంటీన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లో వ్యర్థాలను త్వరితగతిన తొలగించాలని తెలిపారు. ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డులో అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. అధికారులు ఎప్పటికప్పుడు అన్న క్యాంటీన్‌ను పర్యవేక్షిస్తూ తాగునీటి సరఫరా, వాడునీటి సరఫరాలో ఎటువంటి అంతరాయం ఉండకుండా చూసుకోవాలన్నారు. ఈ పర్యటనలో సీఈ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, పర్యవేక్షణ ఇంజనీర్ పి.సత్యనారాయణ, ఈఈ సురేఖ, డిప్యూటీ సిటీ ప్లానర్ సుభాష్ చంద్రబోస్, తదితరులు పాల్గొన్నారు.



సంగమంపై చిన్నచూపు..!

● పవిత్ర సంగమాన్ని పట్టించుకోరు.. అభివృద్ధి చేయరు ● అయినా సందర్శకుల తాకిడి
● సాయంత్రమైతే సందడే సందడి ● పునర్వైభవం కోసం ఎదురుచూపులు

ఇబ్రహీంపట్నం, ఆంధ్రజ్యోతి: ప్రస్తుత బిజీలైఫ్‌లో క్షణం తీరిక లేకుండా నిత్యం ఉద్యోగ, వ్యాపారాల్లో గడిపే పట్టణ జీవులు ఆహ్లాదకర వాతావరణం కోసం ఆశ పడుతుంటారు. చల్లని గాలి, పచ్చని చెట్లు, నదీ తీరాలంటే ఇంకా ఇష్టపడుతుంటారు. మంచి పార్క్ ఉంటే బాగుండు కాసేపు అలా కూర్చొని వద్దాం అనుకుంటూ ఉంటారు. అలాంటి ఆహ్లాదకర వాతావరణాన్ని అందించే వాటిలో కృష్ణానదీ తీరం వెంబడి ఉన్న ఇబ్రహీంపట్నం పవిత్రసంగమం ఒకటి. ఎన్టీటీపీఎస్‌లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు ఏ,బీ,సీ కాలనీల్లో క్వార్టర్స్‌లో నివాసాలుండేవారు, ఇబ్రహీంపట్నం మండలంతో పాటు కొండపల్లి మున్సిపాలిటీ, మైలవరం నియోజకవర్గంలోని అనేక గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పవిత్ర సంగమ సందర్శనకు వస్తూ ఉంటారు. కొద్దిసేపు సరదాగా గడిపి వద్దాం అనుకునేవారూ ఉన్నారు. పని మీద విజయవాడ వెళ్లి వచ్చేవారు ఒక్కసారి పవిత్రసంగమం వరకు వెళ్దామనుకుంటారు. అనేక ప్రాంతాల నుంచి అనేక మంది కృష్ణానది అందాలను చూసేందుకు సాయంత్రంలో అలా వస్తుంటారు.

ఏదీ నాటి వైభవం

2014-19 వరకు అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో పవిత్ర సంగమం ఒక వెలుగు వెలిగింది. పర్యాటకులతో కళకళ్లాడింది. 2019-24 వైసీపీ ప్రభుత్వ హయాంలో పవిత్ర సంగమాన్ని పట్టించుకోకపోవడంతో కళ తప్పింది. 2024లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో మళ్లీ పవిత్ర సంగమానికి పూర్వవైభవం వస్తుందని ఎదురు చూశారు. నిత్యహారతులు ప్రారంభమవుతాయని, నాటి వైభవం తిరిగి వస్తుందని ఆశపడ్డారు. ఆ ఆశలు అడియాశలుగానే మిగిలిపోయాయి. పలుమార్లు జిల్లా అధికారులు, పర్యాటకశాఖ అధికారులు రావడం పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని చెప్పటమే కానీ కార్యరూపం దాల్చడం లేదు. అయినా పర్యాటకుల సంఖ్య తగ్గడం లేదు. రోజూ పెద్ద ఎత్తున జనం పవిత్ర సంగమ ప్రాంతానికి వస్తున్నారు. ముఖ్యంగా సెలవు దినాలు, ఆదివారాల్లో అయితే ఈ తాకిడి అధికం. అక్కడున్న కొద్దిపాటి ఆట పరికరాలతో పిల్లలను ఆడిస్తున్నారు. సూర్యాస్తమయం వేళ స్నానాల ఘాట్‌పై కూర్చొని కృష్ణానది అందాలను వీక్షిస్తున్నారు. కొందరు స్నానాలు చేస్తున్నారు. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందేందుకు అనేక అవకాశాలున్నా పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ ప్రాంతాన్ని మంచి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని వేడుకుంటున్నారు.



రైతులకు అండగా నిలుస్తాం

● పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ● ఘంటసాల మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారం ● చైర్‌పర్సన్‌గా తోట కనకదుర్గ, కమిటీ సభ్యులకు అభినందనలు

ఘంటసాల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలో పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. కొడాలిలోని మార్కెట్ యార్డు నందు సోమవారం ఘంటసాల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. తొలుత ఘంటసాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా జనసేన పార్టీ వీరమహిళ తోట కనకదుర్గ సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. మార్కెట్ యార్డు కార్యదర్శి ప్రేమ్‌చంద్ నూతన కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఉపాధ్యక్షుడిగా అత్తులూరి గోపీచంద్ (తెలుగుదేశం పార్టీ)తోపాటు 20మంది పాలకవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, పలువురు ప్రముఖులు అభినందించి దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రైతులకు చెల్లించాల్సిన రూ.1674 కోట్లను పూర్తిగా, మిల్లర్లకు చెల్లించాల్సిన రూ.470 కోట్లలో రూ.360 కోట్లు కూటమి ప్రభుత్వం చెల్లించిందన్నారు. ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో 48 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 24 గంటల్లోనే రైతుల అకౌంట్లకు నగదు జమ చేసిందన్నారు. జూన్ 12న రాష్ట్రంలోని 41వేల ప్రభుత్వ పాఠశాలల్లో మూడున్నర లక్షల మెట్రిక్ టన్నుల ఫైన్ క్వాలిటీ బియ్యాన్ని రైతుల చేతుల మీదుగా అందించామన్నారు. రేషన్ పంపిణీలో సమూల మార్పులు తెచ్చామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినందున పీడ విరగడైంది అనే కార్యక్రమాన్ని ఈ నెల 4న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం సుపరిపాలన మొదలైంది అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలమైందన్నారు. టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, ఏపీ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, బీజేపీ నేతలు చిరువోలు బుచ్చిరాజు, రాష్ట్ర జనసేన పార్టీ నేతలు మండలి రాజేష్, అవనిగడ్డ, మొవ్వ ఏఎంసీ ఛైర్మన్లు కొల్లూరి వెంకటేశ్వరరావు, దోనేపూడి శివరామయ్య, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ తుమ్మల చౌదరి బాబు, టీడీపీ నేతలు పరుచూరి సుభాష్ చంద్రబోస్, తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), వేమూరి సాయి వెంకటరమణ, పరిశె చలపతి, సర్పంచ్‌లు పైడిపాముల కృష్ణకుమారి, చలపాటి రాణి, చల్లపల్లి ఎంపీపీ కోట విజయ రాధిక పాల్గొన్నారు.


ప్రమాణస్వీకారం చేసిన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ పాలకవర్గ సభ్యులను అభినందిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

కొడాలిలో భారీ ర్యాలీ

చల్లపల్లి మండలానికి చెందిన తోట కనకదుర్గ ఘంటసాల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా ప్రమాణ స్వీకారం చేసేందుకు కూటమి నేతలతో కలిసి భారీ ర్యాలీగా కొడాలికి చేరుకోగా, ఘంటసాల మండలానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన నేతలు ఆమెకు స్వాగతం పలికారు. డప్పువాయిద్యాలు, బాణాసంచాతో కార్యకర్తలు సందడి చేశారు. ఆసాంతం ఉల్లాస, ఉత్సాహభరితంగా ర్యాలీ సాగింది. కొడాలిలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఏఎంసీ చైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.


కూలర్ ఎదురుగా కూర్చుని సేద తీరుతున్న ప్రయాణికులు

హాట్ సమ్మర్‌లో కూల్

● విజయవాడ బస్టాండ్‌లో కూలర్ల ఏర్పాటు
● హర్షం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు

ఆసియాలోనే రెండో అతిపెద్ద బస్టాండ్ నగరంలోని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ బస్‌స్టేషన్. అందులోనూ విజయవాడలో వేసవి కాలం మండిపోతుంది. సాధారణ రోజుల కంటే రోహిణి కార్తె రోజుల్లోనైతే అడుగు బయటపెట్టలేని పరిస్థితి. ఈ సమయంలో బస్టాండ్‌లో ప్రయాణికులకు ఎండ తాపం నుంచి ఉపశమనం కలిగించడం కోసం అధికారులు కూలర్లను ఏర్పాటు చేశారు. అధికారులు చూపుతున్న శ్రద్ధపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

టెక్నాలజీతో నేరాలను కట్టడి చేస్తున్నాం

● సత్యనారాయణపురం మోడల్ పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవంలో హోంమంత్రి అనిత ● సదుపాయాలపై ప్రశంసలు

విజయవాడ/సత్యనారాయణపురం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసింగ్‌కు జోడించి నేరాలను కట్టడి చేస్తున్నామని హోంమంత్రి అనిత అన్నారు. విజయవాడలోని సత్యనారాయణపురం జీఎస్ రాజు రోడ్డులో రూ.2.5 కోట్లతో నిర్మించిన మోడల్ పోలీస్‌స్టేషన్‌ను డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాతో కలిసి సోమవారం ఆమె ప్రారంభించారు. అధికారుల గదులు, విభాగాలను, ఎంపీ కేశినేని శివనాథ్, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ప్రారంభించారు. ఇతర విభాగాలను సీపీ రాజశేఖరబాబు, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, అడ్మిన్ డీసీపీ కేజీవీ సరిత ప్రారంభించారు. ఏసీపీ నుంచి కానిస్టేబుల్ వరకు అందుబాటులో ఉండేలా పోలీస్‌స్టేషన్ భవనాన్ని నిర్మించడం బాగుందని హోంమంత్రి ప్రశంసించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా లక్ష సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. టెక్నాలజీని అందిపుచ్చుకుని నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏ నేరం జరిగినా 24 గంటల్లో పట్టుకోగలుగుతున్నామంటే ఇన్విజబుల్ పోలీసింగ్ ద్వారానే సాధ్యమన్నారు. రాష్ట్రంలో వ్యాయామ శాల ఉన్న ఏకైక పోలీసు స్టేషన్ ఇదేనన్నారు. పోలీసుస్టేషన్ పరిధిలో సుమారు 200 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఇప్పటికే జగ్గయ్యపేట, నందిగామ, పశ్చిమ నియోజకవర్గాల్లో 80శాతం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సత్యనారాయణపురం పోలీసుస్టేషన్ మిగిలిన పోలీసు స్టేషనలకు రోల్‌మోడల్‌గా ఉండాలన్నారు. ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణను ఎమ్మెల్యే సీట్లో కూర్చోబెట్టి శుభాకాంక్షలు తెలిపారు. స్టేషన్‌లో టెక్నాలజీ అంశాలను సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ జి.గుణరాము అధికారులకు వివరించారు. తొలుత హోంమంత్రి అనిత మొక్కలు నాటి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఏఆర్ డీసీపీ ప్రసాద్, ట్రాఫిక్ డీసీపీ కృష్ణమూర్తి నాయుడు, శాంతిభద్రతల విభాగం ఏడీసీ జి.రామకృష్ణ, ఏసీపీ స్రవంతి రాయ్ పాల్గొన్నారు.





డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, సీపీ ఎస్వీ రాజశేఖరబాబులతో కలిసి మోడల్ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న హోంమంత్రి అనిత, సత్యనారాయణపురం మోడల్ పోలీస్ స్టేషన్

నేడు నగరానికి 'భైరవం' హీరో త్రయం

గాంధీనగర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలై విజయవంతంగా ప్రదర్శించబడుతున్న 'భైరవం' చిత్రంలో నటించిన హీరోలు సందడి చేసేందుకు మంగళవారం నగరానికి రానున్నారు. ప్రేక్షకులను కలిసి ధన్యవాదాలు తెలిపేదుకు చిత్రబృందం శ్రీకారం చుట్టింది. మంచు మనోజ్, నారా రోహిత్, బెల్లంకొండ శ్రీనివాస్ అలంకార్ థియేటర్‌ను సందర్శించి ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలుపుతారని అన్నపూర్ణ స్టూడియోస్ మేనేజర్ పీవీ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రేక్షకులతో కలిసి మ్యాట్నీషో తిలకిస్తారన్నారు.

● నిర్వాహకులకు, ఖాతాదారులకూ పోలీసుల ఆహ్వానాలు

బాబూ.. 'చిట్టీ'..!

● స్టేషన్లలోనే కౌన్సెలింగ్ ● నిర్వాహకుల 'లెక్కలు' చూసే అవకాశం



ఆంధ్రజ్యోతి - విజయవాడ: చిట్టీల నిర్వాహకులకు పోలీసు పిలుపులు అందుతున్నాయి. వారితోపాటు సభ్యులుగా ఉన్నవారికీ ఆహ్వానాలు వెళ్తున్నాయి. చిట్టీలకు సంబంధించిన చిట్టాలను బయటకు తీయబోతున్నారు. ఏడాదిగా ఇలాంటి మోసాలను బయటకు తీసిన పోలీసులు నిర్వాహణలోని వాస్తవాలను బాహ్య ప్రపంచానికి తెలియజేయాలని భావిస్తున్నారు. ఇటీవల జరిగిన యూపిక్స్ సినీ యానిమేషన్ స్కీం, తాజాగా బయటపడిన బంగారం చిట్టీల బాగోతంతో పోలీసు శాఖ అప్రమత్తమైంది. యూపిక్స్ సినీ యానిమేషన్ నిర్వాహకుడు నిడుమోలు కిరణ్ పెట్టుబడికి రెట్టింపు ఇస్తానని చెప్పి రూ.600 నుంచి రూ.800 కోట్ల వరకు ఖాతాదారులకు ముసుగు వేశాడు. ఈ కేసును చేధించే పనిలో పోలీసులుండగా బంగారంతో చిట్టీలు నిర్వహించి ముచ్చెర్ల శ్రీనివాసరావు ఖాతాదారులను నిలువునా ముంచేశాడు. ముచ్చెర్ల రూ.100 కోట్ల వరకు ఖాతాదారులకు షాక్ ఇచ్చాడని తెలుస్తోంది. బాధితుల ఫిర్యాదు ప్రకారం ఈ లెక్క రూ.80కోట్ల వరకు తేలింది. యూపిక్స్ సినీ యానిమేషన్, బంగారం చిట్టీల మోసాలు పోలీసు కమిషనరేట్‌లో పెను సంచలనం కలిగించాయి. ఎలాంటి అనుమతి లేకుండా ఇష్టానుసారంగా చిట్టీలు నిర్వహించి తర్వాత బోర్డు తిప్పేస్తున్న సంస్థల వ్యవహారాను బయటకు తీయడానికి పోలీసులు నిర్ణయించారు. విజయవాడ నగరం నుంచి గ్రామీణ ప్రాంతాల వరకు ఏ ఏ పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి ప్రైవేటు స్కీంలు అమలు జరుగుతున్నాయన్న సమాచారాన్ని సేకరించారు.

ఆధారాలు - హామీలు చూపించాల్సిందే

ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 352 మంది అనధికారికంగా చిట్టీలు, స్కీంలు నిర్వహిస్తున్నట్టు పోలీసులు లెక్కలు తేల్చారు. వీధుల్లో, బంధువర్గాల్లో, స్నేహితులు ఇలా చిట్టీలు నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. 300 మంది చిట్టీలు నిర్వహిస్తుండగా, మిగిలిన 52 మంది వేర్వేరు రకాలుగా స్కీంలు ప్రారంభించి ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఏఏ పోలీసు స్టేషన్ల పరిధిలో ఎంతమంది ఉన్నారన్న లెక్కలను తీశారు. క్రైమ్స్ డీసీపీ తిరుమలేశ్వరరెడ్డి కమిషనరేట్‌లోని మొత్తం ఇన్‌స్పెక్టర్లతో సోమవారం సెల్‌కాన్ఫరెన్స్ నిర్వహించారు. పోలీసుల లెక్కల ప్రకారం 352 మంది అని తేలినప్పటికీ ఇటువంటి వాళ్లంతా వేలల్లో ఉంటారని తెలుస్తోంది. ఈ నిర్వాహకులకు అందరికీ పోలీస్‌స్టేషన్ల వారీగా పిలుపులు వెళ్తున్నాయి. చిట్టీలకు సంబంధించిన మొత్తం రికార్డులను, లెక్కలను పోలీసులకు చూపించాలి. నిర్వాహకులను సేకరించిన వివరాలతో వారి వద్ద చిట్టీలు వేస్తున్న ఖాతాదారులకు ఫోన్లు చేస్తున్నారు. నిర్వాహకులను, ఖాతాదారులతో ఒకేసారి సమావేశం ఏర్పాటుచేసి మొత్తం లెక్కలను చూడబోతున్నారు. ఎవరెవరు ఎన్ని చిట్టీలు, ఎంత మొత్తంలో నిర్వహిస్తున్నారో తెలుసుకున్న తర్వాత ఇప్పటి వరకు ఎన్ని నెలలు పూర్తయ్యాయి, అందులో సభ్యులు చెల్లించిన మొత్తం, సభ్యులకు చెల్లించిన మొత్తాల లెక్కలు చూడబోతున్నారు. చిట్టీల మొత్తాలను చెల్లించకపోతే హామీగా ఏమి చూపించారన్న వివరాలు సభ్యులు సమక్షంలోనే తేల్చాలని నిర్ణయించారు. దీని ద్వారా ముందుముందు ఎవరెవరు టోకరా వేయడానికి అవకాశం ఉందో స్పష్టంగా తేలుతుందన్న భావనలో పోలీసులు ఉన్నారు.


అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహాసంఘం రాష్ట్ర శాఖ పదాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ వైవీ రామిరెడ్డి

ఈ విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి

ఏబీఆర్ఎస్ఎం శాఖల విస్తరణ

గుణదల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో ఏబీఆర్ఎస్ఎం శాఖలను విస్తరించేలా చర్యలు తీసుకోవాలని మార్గనిర్దేశనం చేసినట్టు అఖిల భారత రాష్ట్రీయ సైక్షిక్ మహాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ వైవీ రామిరెడ్డి తెలిపారు. అఖిల భారత రాష్ట్రీయ సైక్షిక్ మహా సంఘం (ఏబీఆర్ఎస్ఎం) రాష్ట్ర శాఖ పదాధికారుల సమావేశం విజయవాడ క్లబ్‌నందు సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యా సంస్థల్లో అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ డీఎస్‌వీ ఎస్ బాలసుబ్రహ్మణ్యం తీర్మానాలు ప్రవేశపెట్టగా సభ్యులు చర్చించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా నేటికీ అధ్యాపకుల సమస్యలపై నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందటం దారుణమన్నారు. ఎన్నికలకు ముందు అధ్యాపకులకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంపై ఇప్పటికే ముఖ్యమంత్రి, విద్యాశాఖ, ఆర్థికశాఖ మంత్రికి వినతి పత్రాలివ్వడం జరిగిందన్నారు.

'బంగారం శ్రీను' దొంగ తెలివి

కుటుంబ సభ్యుల పరారీ ● కోర్టులో లొంగుబాటు పిటిషన్

విజయవాడ, మే 2 (ఆంధ్రజ్యోతి): బంగారం చిట్టీలతో ఖాతాదారులకు ఝలక్ ఇచ్చిన ముచ్చెర్ల శ్రీనివాసరావు దొంగ తెలివిని ప్రదర్శిస్తున్నాడు. రెండ్రోజుల్లో వచ్చి ఖాతాదారులకు చెల్లిస్తానన్న ఆయన చేస్తున్న వ్యవహారాలు వేరుగా కనిపిస్తున్నాయి. ఆదివారం సాయంత్రం వరకు పోలీసుల ముందుకు వెళ్లి హాజరు వేయించుకున్న ఆయన సతీమణి పరారయ్యారు. జర్మనీ నుంచి ఇటీవలే వచ్చిన అతడి కుమారుడు నిఖిల్, హైదరాబాద్‌లో ఉంటున్న కుమార్తె సాయి అమృత, అల్లుడు అభిలాష్ సైతం అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. వారిపై పోలీసులు లుక్ అవుట్ సర్క్యులర్ జారీ చేశారు. వాసవీ క్లబ్‌లోని కొంతమంది ఆప్తులతో శ్రీనివాసరావు ఫోన్లలో సంభాషణలు చేస్తున్నట్టు తెలిసింది. మరోపక్క న్యాయపరంగా చిక్కులు లేకుండా ఏర్పాట్లు చేసుకుంటున్నాడు. ఇప్పటికే న్యాయవాదులతో సంప్రదింపులు చేస్తున్నట్టు తేలింది. ఆయన తరఫున ఓ న్యాయవాది కోర్టులో లొంగుబాటు పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని న్యాయస్థానం తిరస్కరించినట్టు తెలిసింది. శ్రీనివాసరావు కోర్టుకు వస్తున్నాడనుకున్న పోలీసులు నిఘా పెట్టారు. న్యాయస్థానం మెట్లు ఎక్కేలోపు సంకెళ్లు వేయడానికి సిబ్బందిని నియమించారు. తీరా చూస్తే శ్రీనివాసరావు కోర్టుకు రాకుండా న్యాయవాది ద్వారా పిటిషన్ దాఖలు చేయించారు. శ్రీనివాసరావు విజయవాడ చుట్టుపక్కలే ఉన్నాడని ప్రచారం నడుస్తోంది. పోలీసులు వేస్తున్న అడుగులను స్నేహితుల ద్వారా తెలుసుకుంటున్నాడని తెలుస్తోంది. హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ కంపెనీ తనది కాదని, తన కుమార్తె ఆ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తోందని వివరించినట్టు కొంతమంది సన్నిహితులు చెబుతున్నారు. లబ్బీపేట వేంకటేశ్వరస్వామి ఆలయ ట్రస్ట్‌లో ఒక సభ్యుడిగా ఆయన కొనసాగుతున్నట్టు తెలిసింది. రోజులు గడుస్తున్న కొద్దీ ఆయన లీలలు బయటకు వస్తున్నాయి.


ధర్నాలో నినాదాలు చేస్తున్న బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్

డీఎస్సీ పరీక్షకు 90 రోజుల గడువు ఇవ్వాలి

● బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్

గాంధీనగర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం డీఎస్సీ అభ్యర్థులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు 90 రోజులు శిక్షణ ఇచ్చాకే డీఎస్సీ నిర్వహిస్తామన్న హామీని మరిచిపోయిందన్నారు. స్థానిక ధర్నాచౌక్‌లో సోమవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. అభ్యర్థులకు వయోపరిమితి పెంచాలని, నార్మలైజేషన్ పద్ధతి కాకుండా ఒకే పరీక్ష నిర్వహించాలని, టెట్ తర్వాతే డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఏడేళ్లుగా డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు కేవలం 45 రోజుల గడువే ఇచ్చి ఒత్తిడికి గురిచేస్తోందని మండిపడ్డారు. ఇప్పటికే ఒత్తిడి తట్టుకోలేక ముగ్గురు అభ్యర్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నా అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసేందుకు బయల్దేరిన రామచంద్ర యాదవ్‌ను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేసేందుకు ప్రయత్నించగా, ఆయనకు ఆరోగ్య సమస్యలు ఉన్నాయని తెలపడంతో ఆ నిర్ణయాన్ని విరమించుకున్నారు.

వైసీపీ అరాచకపాలన ముగిసి ఏడాది

● రాష్ట్రమంతటా ఘనంగా వేడుకలు
● జనసేన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని

భారతీనగర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ నెల 4వ తేదీ నాటికి అరాచక పాలన ముగిసి ఏడాది పూర్తవడంతో పాటు కూటమి ప్రభుత్వం సుపరిపాలన మొదలై ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు జనసేన పార్టీ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్రమంతట ఘనంగా వేడుకలు నిర్వహించాలని జనసేన పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను సోమవారం ఒక ప్రకటనలో కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా వేడుకలను జనసేన నేతలు డిజిటల్ క్యాంపెనింగ్‌లో భాగంగా సోషల్ మీడియాలో వచ్చేలా చూడాలని కార్యకర్తలకు తెలిపారు. వెన్నుపోటు దినం చేసే అర్హత వైసీపీ పార్టీ లేదన్నారు. రానున్న రోజుల్లో వైసీపీకి ప్రజలే బుద్ధిచెబుతారన్నారు.

పర్యావరణ సమతుల్యతకు కృషి చేయాలి

● భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాంధీ

మోపిదేవి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనుమోలు గాంధీ తెలిపారు. కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో చేపట్టిన జల జన జాగరణ యాత్రలో భాగంగా సోమవారం సాయంత్రం మోపిదేవి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణానది తీరాన అనేక నగరాలు డ్రైనేజీ, పారిశ్రామిక కెమికల్ వ్యర్థాలు నది జలాల్లోకి చేరి కలుషితమవుతున్నాయన్నారు. కిసాన్ సంఘ ప్రతినిధులు కామిశెట్టి రమేష్, అల్లూరి శ్రీనివాసరావు, జివి.నగరాయులు, గంటా నరసింహారావు, శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్, మేకల శ్రీనివాస్, మేడసాని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నవ్య డాక్టర్

కొవిడ్ కేర్

తిరగబెట్టిన కొవిడ్ కథ

కొవిడ్ కథ ముగిసిందని సంబరపడేలోపే కొత్త వేరియెంట్స్ పుట్టుకొచ్చి భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ప్రస్తుతం దేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో కొవిడ్ కేసులు ఊపందుకుంటున్న నేపథ్యంలో, తాజా కొవిడ్ వేరియెంట్లు, వాటి ప్రభావాల గురించి తెలుసుకుందాం!

వ్యాక్సీన్లు, బూస్టర్లతో కొవిడ్ రక్షణ పొందినప్పటికీ, ఆరోగ్య భద్రతా చర్యలు పటిష్ఠంగా పాటిస్తున్నప్పటికీ, కొత్త కొవిడ్ లక్షణాల మీద ఓ కన్నేసి ఉంచడం అత్యవసరం. ఇప్పటివరకూ మన దేశంలో రెండు రకాల కొత్త వేరియెంట్లు వెలుగులోకొచ్చాయి. అవేంటంటే...

- **ఎన్‌బి.1.8.1:** ఢిల్లీ, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాల్లో విస్తృతంగా కనిపిస్తున్న వేరియెంట్ ఇది. ఒమైక్రాన్‌తో సన్నిహిత సంబంధం కలిగిన ఈ వేరియెంట్, స్పైక్ ప్రొటీన్‌పరంగా స్వల్ప ఉత్పరివర్తనాలను కలిగి ఉంది. తేలికపాటి లక్షణాలతో బయల్పడుతున్న ఈ వైరస్, వ్యాక్సీన్ తీసుకోని పెద్దల్లో వేగంగా విస్తరిస్తోంది



- **ఎల్‌ఎఫ్.7:** ఈ వైరస్ దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో బయల్పడింది. 2022కు ముందు కొవిడ్-19 బారిన పడిన పెద్దల వ్యాధినిరోధకశక్తికి, ఈ వైరస్ ఎక్కువ నిరోధకతను కలిగి ఉండవచ్చని అధ్యయనాలు చెప్తున్నాయి.

అయితే ప్రస్తుతానికి ఈ రెండు వేరియెంట్లలో ఏ ఒక్కదాన్నీ ఆందోళనకరమైన వేరియెంటుగా వర్గీకరించడం జరగలేదని, ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. కాబట్టి వ్యాక్సీన్లు తీసుకున్న వారిని ఈ వేరియెంట్లు తీవ్ర అస్వస్థతకు గురి చేయలేవు. అయితే గొంతు నొప్పి, పొడి దగ్గు, నీరసం ఈ కొత్త వేరియెంట్ల ప్రధాన లక్షణాలు అనే విషయం గుర్తు పెట్టుకోవాలి. రుచి, వాసన కోల్పోవడం, లాంటి కొవిడ్ సంప్రదాయ లక్షణాలేవీ లేకుండానే ప్రస్తుతం పాజిటివ్ ఫలితాలు వెలువడుతున్నాయి. వీటికి బదులుగా అలర్జీ, సాధారణ జలుబును తలపించే లక్షణాల రూపంలోనే తాజా కొవిడ్ వేరియెంట్లు బయల్పడుతున్నాయి.

వీటి మీద కన్నేసి...

- జ్వరం, లేదా చలి
- ముక్కు దిబ్బెడ, ముక్కు నుంచి నీరు కారడం
- గొంతు నొప్పి
- పొడి దగ్గు
- తలనొప్పి, నీరసం
- జీర్ణసంబంధ సమస్యలు (డయేరియా)
- ఒంటి నొప్పులు

ఈ లక్షణాలు కనిపిస్తే?

- ఇంటి పట్టునే శరీర ఉష్ణోగ్రత, ఆక్సిజన్ మోతాదులను పరీక్షించుకోవాలి
- బహిరంగ ప్రదేశాలకు దూరంగా ఇంటికే పరిమితమైపోవాలి
- ఆర్‌టి-పిసిఆర్ లేదా యాంటిజెన్ పరీక్షలు చేయించుకోవాలి
- 3 నుంచి 4 రోజుల్లో లక్షణాలు అదుపులోకి రాకపోతే వైద్యులను కలవాలి

ఆయుర్వేదం



వానాకాలం జలుబు, దగ్గు, జ్వరాలు సహజమే! అయితే వీటన్నిటి మూల కారణం జీర్ణ వ్యవస్థలో ఉంటుందని ఆయుర్వేదం చెప్తోంది. ఈ కాలంలో కుంటుపడే జీర్ణవ్యవస్థ, రోగనిరోధక వ్యవస్థలను ఎలా దార్లోకి తెచ్చుకోవాలో తెలుసుకుందాం!

వానాకాలం వెతలకు చెక్

వానాకాలంలో శరీరంలో వాతం, పిత్తం పెరుగుతాయి. ఆదాన కాలమైన వేసవిలో కుంటుపడే జీర్ణశక్తి, వానాకాలంలో మరికాస్త దిగజారుతుంది. దాంతో అరుగుదల మందగిస్తుంది. ఫలితంగా పేగుల్లోని మంచి బ్యాక్టీరియా క్షీణించి, రోగనిరోధకశక్తి కూడా సన్నగిల్లుతుంది. దీనికి తోడు వానాకాలంలో వ్యాధికారక సూక్ష్మక్రిములు విజృంభించడం, కలుషిత ఆహారం, నీటి వల్ల సులభంగా వ్యాధుల బారిన పడుతూ ఉంటాం.



అయితే దగ్గు, జలుబులు, జ్వరాలు చలికాలంలో కూడా వేధిస్తాయి. కానీ వాటికి ప్రధానంగా గాల్లో విస్తరించి ఉండే వ్యాధికారక సూక్ష్మక్రిములు పొడిబారిన శ్వాసకోస వ్యవస్థలోకి సులువుగా చొరబడి ఇబ్బంది పెట్టడమే కారణం. కానీ వానాకాలపు జలుబు, దగ్గు, జ్వరాలకు మాత్రం సన్నగిల్లిన వ్యాధినిరోధకశక్తే ప్రధాన కారణమవుతూ ఉంటుంది. కాబట్టి ఈ కాలంలో తలెత్తే అసౌకర్యాలకు కారణాన్ని బట్టి చికిత్సను అందించాల్సి ఉంటుంది.

త్రికటుతో తరిమికొట్టి...

త్రికటువులైన శొంఠి, మిరియాలు, పిప్పళ్ల ఈ కాలంలో తీసుకుంటూ ఉండాలి. ఈ పొడిని పండ్ల మీద చల్లుకుని తినొచ్చు. లేదా నేరుగా తినొచ్చు. గోరువెచ్చని నీళ్లలో కలుపుకుని తాగొచ్చు. దీంతో జీర్ణశక్తి పెరగడంతో పాటు శ్వాసకోస వ్యవస్థ ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా రక్షణ కూడా దొరుకుతుంది. కాబట్టి రోజుకు పావు టీస్పూను చొప్పున త్రికటు తీసుకోవచ్చు. ఇదే కాకుండా తాలిసాది చూర్ణం, సీతోఫలాది చూర్ణాలు కూడా వానాకాలపు అనారోగ్యాల నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. జలుబు వచ్చినా, రాబోతున్నట్టు అనిపించినా త్రికటు, లేదా సీతాఫలాది లేదా తాలిసాది చూర్ణాల్లో ఏదో ఒక దాన్ని తీసుకోవచ్చు. పెద్దలు ఉదయం, సాయంత్రం ఒక చెంచా చూర్ణాన్ని తేనెతో లేదా గోరువెచ్చని నీటితో కలిపి తీసుకోవాలి. తేనె స్వచ్ఛంగా ఉండాలి.

జలుబు, దగ్గు, జ్వరం

జ్వరాన్ని తగ్గించడం కోసం 'షడంగ పానీయం' తీసుకోవచ్చు. అర చెంచా పొడిని రెండు గ్లాసుల నీళ్లలో కలిపి, ముప్పావు వంతుకు మరిగించి, వడగట్టి రెండు పూటలా తీసుకోవాలి. జలుబుకు 'వ్యోషాది వటి' ఉపయోగపడుతుంది. ఉదయం, రాత్రి రెండు మాత్రల చొప్పున తీసుకోవాలి. రెండేళ్ల లోపు పిల్లలకు జలుబు, దగ్గు, జ్వరాలను తగ్గించడం కోసం 'కస్తూరి' మాత్రలు అందించాలి. ఒకటి లేదా రెండు మాత్రలను దంచి తల్లిపాలలో లేదా మరిగించి చల్లార్చిన నీళ్లలో రంగరించి పిల్లలకు పట్టించవచ్చు. 'వాయు గుళిక' జలుబుకు సమర్థమైన ఔషధం. ఈ గుళికను మూడు పూటలా తీసుకోవాలి. నవజ్వరానికి (ప్రారంభంలో ఉన్న జ్వరం) శొంఠి, అల్లపు రసం, మిరియాలు, తేనె కలిపి చెంచా చొప్పున మూడు పూటలూ ఇవ్వాలి. పొట్టలో సమస్యలకు, నీళ్ల విరోచనాలకు 'కుటజ ఘనవటి' మూడు పూటలా రెండు మాత్రల చొప్పున తీసుకోవాలి. పిల్లలకు అర మాత్ర సరిపోతుంది. ద్రవరూపంలోని కుటజారిష్ఠ అయితే, పెద్దలు, 15 మిల్లీ లీటర్ల చొప్పున మూడు పూటలా తీసుకోవాలి. నులిపురుగుల సమస్యలు కూడా ఈ కాలంలో ఎక్కువే! దీని కోసం ద్రవరూపంలోని 'విడంగారిష్ఠ'ను 15 మిల్లీలీటర్ల చొప్పున మూడు పూటలా తీసుకోవాలి. పిల్లలకు 10 మిల్లీలీటర్లు సరిపోతుంది.

తినవలసినవి - తినకూడనివి

ఈ కాలంలోని ఆరోగ్య సమస్యలకు సన్నగిల్లిన వ్యాధినిరోధకశక్తి ప్రధాన కారణం కాబట్టి అందుకు కారణమైన జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుకోవడం మీదే ధ్యాస పెట్టాలి. అందుకోసం జీర్ణ సంబంధ సమస్యలను నియంత్రించుకోవాలి. కొన్ని పదార్థాలను తినడం మానుకోవాలి. కొన్నిటిని తప్పనిసరిగా తింటూ ఉండాలి.

- **తినకూడనివి:** పచ్చి కూరగాయలు, పండ్లను శుభ్రంగా కడిగి తినాలి. మొక్కజొన్నను ఉడికించకుండా, కాల్చి తినాలి. సజ్జలు, మార్కెట్లో దొరికే పాలకూర తినకూడదు. ఇంట్లో పండించిన పాలకూర తినొచ్చు. అలాగే కాకరకాయ, క్యాబేజీ, బంగాళాదుంపలు, క్యారెట్ తినకూడదు. కఫాన్ని పెంచే చేపలు తగ్గించాలి. ఆవు పాలు తీసుకోవచ్చు. గేదె పాలు మానేయాలి. కఫాన్ని పెంచే తీపి పదార్థాలు, వెన్న, జున్ను తీసుకోకూడదు. అలాగే చల్లదనాన్ని అందించే కీర, పుచ్చ ఈ కాలంలో పనికి రాదు. మజ్జిగను నేరుగా తీసుకోకుండా మజ్జిగపులుసు రూపంలో తీసుకోవచ్చు.
- **తినదగినవి :** బెండ, పెసరపప్పు, మినపప్పు, ఉల్లి, వెల్లుల్లి తీసుకోవచ్చు. ఉల్లి, వెల్లుల్లిలో నీటిలో కరిగే పీచు ఉంటుంది. ఇది పేగులకు మంచిది కాబట్టి వీటిని ఈ కాలంలో తప్పనిసరిగా తీసుకోవాలి. దుంపల్లో కంద తినొచ్చు. ద్రాక్ష పండ్ల మీద తెల్లని పొర ఉంటుంది. ఇది అందరూ అనుకుంటున్నట్టు పురుగుమందులతో ఏర్పడిన పొర కాదు. అది ఆరోగ్యానికి మేలుకరమైన బ్యాక్టీరియా పొర. కాబట్టి ద్రాక్షను కడిగినా, ఈ తెల్లని పొర తొలగిపోకుండా చూసుకోవాలి. మామిడి, నిమ్మ పండ్లు తీసుకోవచ్చు. ఈ కాలంలో కొత్తిమీర, పుదీనా కూడా తీసుకోవాలి.

డాక్టర్ డి.వి. ప్రశాంత్ కుమార్
పంచకర్మ స్పెషలిస్ట్, శక్తి ఆయుర్వేదిక్ క్లినిక్,
ఈస్ట్ మారేడ్‌పల్లి, సికింద్రాబాద్.



కంటి ఆరోగ్యం

డిజిటల్ స్క్రీన్స్ మన జీవితంలో భాగాలైపోయాయి. గంటల తరబడి కళ్లను తెరలకు అప్పగించకపోతే రోజు గడవని పరిస్థితి. అయితే ఈ జీవనశైలితో కళ్లకు కీడు కలుగుతోందా? వైద్యులేమంటున్నారు?





తెరలతో తంటా

కళ్లు పొడిబారడం, కళ్ల మంటలు, ఎరుపెక్కడం, నీరు కారడం, కనుబొమల నొప్పులు... ఇవన్నీ డిజిటల్ స్క్రీన్స్ వాడకంలో మనం చేసే పొరపాట్లకు సంకేతాలు. కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు, టివిలు మన జీవితంలో భాగాలైపోయినప్పుడు, వాటిని వినియోగించుకుంటూనే కళ్లు దెబ్బతినకుండా తగిన జాగ్రత్తలు కూడా పాటిస్తూ ఉండాలి. ఏ స్క్రీన్ ఎంత దూరంలో ఉండాలి? వాటిని ఎంత సమయం పాటు చూడాలి? ఎంత వ్యవధికి బ్రేక్ తీసుకోవాలి? కళ్లు అలసటకు లోను కాకుండా ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి? అన్నది కూడా తెలుసుకోవాలి.

నీలి కిరణాలను వడగట్టి...

పుస్తకం చదివేటప్పుడు కళ్లకు ఎంత దూరంగా ఉంచుకుని చదువుతామో, మొబైల్ ఫోన్లను కూడా అంతే దూరంలో ఉంచి వాడుకోవాలి. అయితే ఇటీవలి కాలంలో పిల్లలు సెల్‌ఫోన్లకు ఎక్కువగా అలవాటు పడిపోతున్న సందర్భాలు పెరుగుతున్నాయి. నిజానికి ఆరేళ్ల వరకూ పిల్లల కనుగుడ్లు అభివృద్ధి దశలోనే ఉంటాయి. కాబట్టి ఈలోగా అతిగా మొబైల్ ఫోన్లకు అలవాటు పడడం వల్ల పిల్లల్లో మెల్లకన్ను తలెత్తుతుంది. పెద్దలైనా అదే పనిగా రెండు గంటలకు మించి సెల్‌ఫోన్ వాడడం కళ్లకు హానికరం. ఆ రెండు గంటల్లో ప్రతి అరగంటకూ విరామం తీసుకోవాలి. పిల్లల విషయానికొస్తే, రోజు మొత్తంలో, బడిలో, ఇంట్లో కలిపి, రెండు గంటలకు మించి స్క్రీన్స్ చూడకూడదు. ఈ రెండు గంటల్లో ప్రతి 20 నిమిషాలకూ బ్రేక్ ఇవ్వాలి. పిల్లలకు సెల్‌ఫోన్స్ ఇచ్చేటప్పుడు, అలారం, స్క్రీన్ కంట్రోల్ టైమ్ సెట్ చేసి ఇవ్వడం మంచిది. వీటితో పిల్లల సెల్‌ఫోన్ వాడకాన్ని పరిమితం చేయవచ్చు. గేమ్స్ ఆడేటప్పుడు పిల్లలు మొబైల్‌ఫోన్‌ను కళ్లకు మరీ దగ్గరకు తీసుకొచ్చేస్తూ ఉంటారు. దీంతో కళ్లలో మైనస్ పవర్ పెరుగుతుంది. కాబట్టి ఈ విషయంలో పెద్దలు పిల్లలను కట్టడి చేయాలి. మరీ ముఖ్యంగా డిజిటల్ స్క్రీన్స్ నుంచి వెలువడే నీలి కిరణాల వల్ల కంటికి హాని కలుగుతుంది. కాబట్టి ఆ కిరణాలను అడ్డుకునే ఫిల్టర్లను ఫోన్లు, డెస్క్‌టాప్, ల్యాప్‌టాప్స్‌లో ఉపయోగించాలి. కళ్లజోడు అలవాటున్న వాళ్లు ఆ కిరణాలను అడ్డుకునే పూత కలిగిన జోళ్లను వాడుకోవాలి. అలాగే టివిలకు కనీసం 20 అడుగుల దూరం పాటించాలి. సాధారణ వెలుగులోనే టివి చూడాలి తప్ప, కిటికీలు, తలుపులు మూసేసి, లైట్లు ఆర్పేసి చీకట్లో టివి చూడడం సరి కాదు.

ఇలాంటప్పుడు అప్రమత్తం కావాలి

- స్క్రీన్ చూస్తున్న అరగంటకే కళ్లు మసకబారుతున్నా...
- ఒకటికి రెండు చిత్రాలు కనిపిస్తున్నా...
- కళ్లు ఎర్రబడి, నీళ్లు కారుతున్నా...
- పిల్లల్లో మెల్లకన్ను మొదలైనా...
- పిల్లలు తెరను చూడడం మొదలుపెట్టిన అరగంటకే తలనొప్పి మొదలైనా...
- పిల్లలు రాయడానికి ఇబ్బంది పడుతున్నా...
- పెద్దలు ఫాంట్ సైజు పెంచవలసిన అవసరం పడుతున్నా...

20-20-20 నియమం

ప్రతి 20 నిమిషాలకూ 20 సెకన్ల పాటు 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువును చూడవలసిన నియమమిది. దగ్గర్లో ఉన్న తెరలను చూస్తున్నప్పుడు కళ్లలోని కండరాలు అలసటకు లోనవుతాయి కాబట్టి ప్రతి 20 నిమిషాలకూ 20 సెకన్ల పాటు 20 అడుగుల దూరంలోని వస్తువును చూడగలిగితే, కంటి కండరాలు రిలాక్స్ అవుతాయి.

ఏం చేయాలి?

కళ్లు అలసటకు లోనై పొడిబారినా, మండుతున్నా, నీరు కారుతున్నా మానిటర్ల వాడకం ఆపేసి, 20-20-20 నియమం అనుసరించాలి. దీంతో ఫలితం లేనప్పుడు కంటి వైద్యులను కలిసి, వాళ్లు సూచించే కంటి చుక్కల మందులు వాడుకోవాలి. వీటితో పొడిబారిన కళ్లు తేమగా మారతాయి. ఈ చుక్కల మందును ఫ్రిజ్ డోర్‌లో దాచుకుని వాడుకోవాలి. అలాగే ఈ చుక్కల మందును ఒకసారి మూత తెరిచి, వాడడం మొదలుపెట్టిన తర్వాత నెల రోజుల వరకూ వాడుకుని, మిగతా మందును పారేయాలి. దాచుకుని వాడుకోకూడదు.

అయితే ఈ చుక్కల మందును ఎవరికి వారు కొనుక్కుని వాడుకోవడం సరి కాదు. కంటి సమస్యలకు కారణం స్క్రీన్స్ మాత్రమే అని నిర్ధారించలేం! ఇతరత్రా కంటి సమస్యల్లో కూడా ఈ లక్షణాలు కనిపిస్తూ ఉంటాయి. కాబట్టి వైద్యులు సూచించినప్పుడు మాత్రమే వీటిని వాడుకోవాలి.

డాక్టర్ ఎమ్. నిఖిల,
కన్సల్టెంట్ ఆప్తల్మాలజిస్ట్,
అపోలో హాస్పిటల్స్,
జూబ్లీహిల్స్, హైదరాబాద్



పరిశోధన

బరువు తగ్గించే అమైనో ఆమ్లం

బరువు తగ్గడంలో అమైనో ఆమ్లం కీలక పాత్ర పోషిస్తుందని అమెరికా, కెనడా పరిశోధకులు కనుగొన్నారు. ఆ వివరాలు తెలుసుకుందాం...

మాంసం, తృణధాన్యాల్లోని సిస్టీన్ అనే అమైనో ఆమ్లం, బరువు తగ్గించడంలో ప్రధాన పాత్ర పోషిస్తుందని ఎలుకలపై చేసిన ఓ తాజా అధ్యయనంలో తేలింది. దీని వలన అమైనో ఆమ్లాలతో ఔషధాల అభివృద్ధికి అవకాశం కలుగుతుందని పరిశోధకులు ఆశాభావం వ్యక్తం చేశారు. 9 రకాల అమైనో ఆమ్లాలు లేని ఆహారం అందించి ఎలుకలను పరిశీలించినప్పుడు, పలు అణువులను అమైనో ఆమ్లంగా మార్చే ఎంజైమ్ లోపించిన ఎలుకలు, సిస్టీన్ రహిత ఆహారం తిని వారంలోనే 31 శాతం బరువు తగ్గినట్లు నేచర్‌లో ప్రచురితమైన ఆ అధ్యయనంలో వెల్లడించారు. అయితే ఎంజైమ్ ఉన్న ఎలుకలు సిస్టీన్ రహిత ఆహారం తీసుకున్నా బరువు తగ్గలేదు. అయితే ఆ ఎంజైమ్ ఉన్న ఎలుకలు పరిమిత క్యాలరీల సిస్టీన్, మిథియోనిన్ లేని ఆహారం తీసుకున్నప్పుడు, 25 శాతం బరువు తగ్గే అవకాశం ఉందని పరిశోధకులు కనుగొన్నారు.



మనుషులకు మంచిదేనా?

ఫిలడెల్ఫియాలోని పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీలో చేసిన ఓ మానవ ప్రయోగంలో... సిస్టీన్, మెథియోనిన్ తక్కువగా ఉన్న ఆహారం తిన్న వారిలో ఎలాంటి ప్రతికూల ప్రభావాలు కనుగొనలేదని, అలాగే వారు బరువు తగ్గినట్లు గుర్తించామని పరిశోధకులు వెల్లడించారు. అయితే ఈ విధమైన ఆహారం ప్రజలపై ఎంత ప్రభావంతంగా పనిచేస్తుంది, ఏ మేరకు సురక్షితమన్నది తెలుకోవడం కోసం మరిన్ని పరిశోధనలకు అవసరమని వారు పేర్కొన్నారు. సిస్టీన్ చాలా ఆహార పదార్థాల్లో ఉంటుంది కాబట్టి ఆహారం ద్వారా సిస్టీన్ అందకుండా చేయడం సవాలుతో కూడుకున్న విషయమని అభిప్రాయపడ్డారు. కాబట్టి సిస్టీన్ స్థాయులను అవసరమైన మేర తగ్గించడానికి ఔషధాలను అభివృద్ధి చేయడం సరైన మార్గమనీ, ఆ ఔషధాలు కొవ్వు తగ్గించడానికి కూడా ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

మీకు తెలుసా?

కృత్రిమ రక్తం

రక్తదానం ప్రాణదానంతో సమానం. కానీ అనేక సందర్భాల్లో సమయానికి సరిపడా రక్తం దొరకక, సరిపోలే రక్తగ్రూపు అందుబాటులో లేక సర్జరీలు వాయిదా పడుతూ ఉండడం, ప్రాణనష్టం సంభవించడం మనం చూస్తూ ఉంటాం. అయితే ఇలాంటి ఇబ్బందులకు చెల్లుచీటీ రాస్తూ, నేషనల్ డిఫెన్స్ మెడికల్ కాలేజీకి చెందిన జపాన్ పరిశోధకులు కృత్రిమ రక్తాన్ని రూపొందించారు.



ఈ కృత్రిమ రక్తాన్ని రక్తపు గ్రూపు మ్యాచింగ్‌తో సంబంధం లేకుండా, ఎవరైనా మార్పిడి చేసుకోవచ్చు. ఈ సింథటిక్ రక్తంలో ఎర్ర రక్త కణాలతో పాటు, ప్లేట్‌లెట్లు కూడా ఉంటాయి. ఇప్పటివరకూ చేపట్టిన జంతు ప్రయోగాల్లో ఈ రక్తంతో విజయవంతంగా రక్త నష్టాన్ని భర్తీ చేయగలిగారు. దానం చేసిన రక్తానికి భిన్నంగా ఈ కృత్రిమ రక్తాన్ని ఎక్కువ కాలం కూడా నిల్వ చేసుకోవచ్చు. దీన్ని గది ఉష్ణోగ్రత వద్ద ఏకంగా ఏడాది పాటు నిల్వ చేసుకుని, అత్యవసర సమయాల్లో, మారుమూల ప్రాంతాలకు తరలించడానికి ఉపయోగించుకోవచ్చు.

ఆవిష్కరణ

గర్భం వెలుపల పిండం

శరీరం వెలుపల పిండాన్ని పెంచే వీలుండే కృత్రిమ గర్భాశయాన్ని జపాన్ అభివృద్ధి చేసింది. జపాన్, ఆస్ట్రేలియాకు చెందిన పరిశోధకులు నెలలు నిండకుండా పుట్టిన, జబ్బుపడిన పిండాలకు చికిత్సలందించి, ప్రాణాలను కాపాడడం కోసం, ఎక్స్ వివో యుటెరిన్ ఎన్విరాన్‌మెంట్ థెరపీ ప్రధానంగా ఈ ఆవిష్కరణకు పూనుకుంది. ఈ కృత్రిమ గర్భాశయం,



నెలలు నిండకుండా పుట్టిన పిల్లల్లో తలెత్తే సమస్యలను అడ్డుకునే నియంత్రిత పర్యావరణాన్ని కలిగి ఉండడం విశేషం. అయితే మానవ శరీరం వెలుపల తొమ్మిది నెలల పిండాన్ని పెంచడం ఈ సాంకేతిక ఆవిష్కరణ ఉద్దేశం కాదనీ, కేవలం నెలలు నిండకుండా పుట్టిన పిల్లల ప్రాణాలను కాపాడడమే తమ ప్రధాన ఉద్దేశమని ఈ శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు.

వైమానిక రంగంలో అద్భుత అవకాశాలు



విదేశీ సంస్థలు పెట్టుబడులతో రావాలి
విమానాల తయారీ కేంద్రంగా భారత్
ఐఏటీఏ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న భారత వైమానిక రంగం పెట్టుబడులకు అద్భుత అవకాశాల గని అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు విదేశీ కంపెనీలు ముందుకు రావాలని కోరారు. ఢిల్లీలో జరుగుతున్న ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) వార్షిక సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఆయన ఈ విజ్ఞప్తి చేశారు. 2030 నాటికి భారత విమానాల నిర్వహణ, మరమ్మతులు, కార్యకలాపాల (ఎంఆర్ఓ) రంగం 400 కోట్ల డాలర్ల స్థాయికి చేరనుందన్నారు. భారత్‌ను విమానాల తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని భారత్‌ను ఒక మార్కెట్‌గా కాకుండా.. వాల్యూ చెయిన్ లీడర్‌గా చూడాలని కోరారు. దేశీయ విమానయానపరంగా చూస్తే ప్రస్తుతం భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద మార్కెట్‌గా ఎదిగిన విషయాన్ని ప్రధాని గుర్తు చేశారు. దేశంలోని మారుమూల ప్రాంతాలకు విమానయానాన్ని దగ్గర చేసేందుకు తమ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉడాన్ పథకం భారత విమానయాన చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయమన్నారు.

మరో 50 ఎయిర్‌పోర్టులు

వచ్చే ఐదేళ్లలో దేశంలో కొత్తగా మరో 50 విమానాశ్రయాలు ఏర్పాటు చేయనున్నట్టు ఇదే సదస్సులో పాల్గొన్న కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. 2014లో దేశంలో 74 విమానాశ్రయాలు ఉంటే, ప్రస్తుతం ఆ సంఖ్య 164కు చేరిందన్నారు. ఉడాన్ పథకంతో దేశంలో విమానయానం ప్రజాస్వామీకరించబడి 619 మార్గాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. విమానాల నిర్వహణ మరమ్మత్తులకూ భారత్‌ను కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు కేంద్ర మంత్రి ప్రకటించారు.

విమాన సంస్థల లాభాలు రూ.3 లక్షల కోట్లు

కొన్ని సమస్యలు, సవాళ్లు ఉన్నా ఈ సంవత్సరం అంతర్జాతీయ విమానయాన సంస్థలు 97,900 కోట్ల డాలర్ల (సుమారు రూ.83.59 లక్షల కోట్లు) ఆదాయంపై 3,600 కోట్ల డాలర్ల (సుమారు రూ.3.07 లక్షల కోట్లు) లాభాలు ఆర్జించే అవకాశం ఉందని ఐఏటీఏ అంచనా. గత ఏడాదితో పోలిస్తే ఇది 360 కోట్ల డాలర్లు ఎక్కువని ఐఏటీఏ డైరెక్టర్ జనరల్ విల్లీ వాల్ష్ ప్రకటించారు. ప్రస్తుతం విమానయాన రంగం ప్రపంచ జీడీపీలో 3.9 శాతం వాటా కలిగి ఉందన్నారు. భారత విమానయాన రంగం జీడీపీకి 560 కోట్ల డాలర్లు (సుమారు రూ.47,818 కోట్లు) సమకూరుస్తూ నేరుగా 3,69,700 మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పిస్తోందన్నారు. ఖర్చులు, పన్నుల భారం పెరుగుతున్నా పదేళ్ల క్రితంతో పోలిస్తే విమానయాన సంస్థల వాస్తవ ఖర్చులు 40 శాతం వరకు తగ్గాయని ఐఏటీఏ డైరెక్టర్ జనరల్ అన్నారు. పరోక్షంగా విమానయాన రంగంతో ముడిపడి ఉన్న పర్యాటక రంగాన్ని కూడా కలుపుకుంటే భారత విమానయాన రంగం 77 లక్షల మందికి ఉపాధి, జీడీపీకి 1.5 శాతం సమకూరుస్తోందన్నారు.

ప్లాంట్ పెట్టేందుకు రెడీ: ఎంబ్రాయర్

భారత్‌లో పూర్తి స్థాయి అసెంబ్లింగ్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు బ్రెజిల్‌కు చెందిన ఎంబ్రాయర్ విమానాల తయారీ సంస్థ సంసిద్ధత వ్యక్తం చేసింది. కాకపోతే ఇందుకు భారత విమానయాన సంస్థల నుంచి కనీసం 200 విమానాల ఆర్డర్ అవసరమని కంపెనీ ప్రెసిడెంట్, సీఈఓ ఫ్రాన్సిస్కో గొమెస్ నెటో స్పష్టం చేశారు. ఐఏటీఏ సదస్సుకు హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయం చెప్పారు. తమ విమానాలు అమ్మేందుకు ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలతో చర్చలు జరుపుతున్నట్టు నెటో వెల్లడించారు.

ప్రపంచంలో అత్యంత విలువైన టెక్ దిగ్గజాల్లో రిలయన్స్

రూ.18.45 లక్షల కోట్ల మార్కెట్ విలువతో 23వ స్థానంలో అంబానీ కంపెనీ

న్యూఢిల్లీ: భారత కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు మరో గౌరవం దక్కింది. ప్రపంచంలోని 30 అత్యంత విలువైన లిస్టెడ్ టెక్ దిగ్గజ కంపెనీల జాబితాలో రిలయన్స్‌కూ చోటు లభించింది. ఈ లిస్ట్‌లో స్థానం దక్కించుకున్న ఏకైక భారత కంపెనీ ఇదే. 'ట్రెండ్స్-ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్' పేరుతో సోమవారం విడుదలైన రిపోర్టు ప్రకారం.. 21,600 కోట్ల డాలర్ల (రూ.18.45 లక్షల కోట్లు) మార్కెట్ విలువతో రిలయన్స్ 23వ స్థానంలో నిలిచింది. కాగా, అమెరికాకు చెందిన మైక్రోసాఫ్ట్, ఎన్‌విడియా, యాపిల్, అమెజాన్, ఆల్ఫాబెట్, మెటా ప్లాట్‌ఫామ్స్, టెస్లా, బ్రాడ్‌కామ్ వరుసగా తొలి 8 స్థానాలను కైవసం చేసుకున్నాయి. తైవాన్‌కు చెందిన టీఎస్ఎంసీ 9వ స్థానంలో ఉంది. చైనా కంపెనీ టెన్సెంట్ 10వ స్థానంలో ఉంది.

ఇనుప ఖనిజం ఉత్పత్తిలో 22 శాతం వృద్ధి లక్ష్యం: ఎన్ఎండీసీ

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని ఎన్ఎండీసీ ఈ ఏడాది ఇనుప ఖనిజం ఉత్పత్తిని 22% మేరకు పెంచి 5.5 కోట్ల టన్నులకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2030 నాటికి 10 కోట్ల టన్నులకు ఉత్పత్తిని విస్తరించాలన్న బృహత్ ప్రణాళికలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఎన్ఎండీసీ సీఎండీ అమితవ ముఖర్జీ తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 4.5 కోట్ల టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించింది. ఏప్రిల్, మే నెలల్లో 45% వృద్ధితో 84.3 లక్షల టన్నుల ఇనుప ఖనిజం ఉత్పత్తి చేసినట్టు తెలిపింది.

అదానీ గ్రూప్‌పై అమెరికా దర్యాప్తు!

గుట్టుగా ఇరాన్ ఎల్‌పీజీ దిగుమతి

తోసిపుచ్చిన అదానీ గ్రూప్

న్యూఢిల్లీ: గౌతమ్ అదానీ గ్రూప్ మరోసారి వివాదాల్లో చిక్కుకుంది. గుజరాత్‌లోని తన ముంద్రా రేవు ద్వారా కొన్ని కంపెనీలు ఇరాన్ ఎల్‌పీజీ దిగుమతి చేసుకునేందుకు సహకరించిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఆరోపణలపై అమెరికా దర్యాప్తు సంస్థలు దర్యాప్తు ప్రారంభించినట్టు వాల్‌స్ట్రీట్ జర్నల్ ఒక కథనం ప్రచురించింది. అయితే అదానీ గ్రూప్ ఈ ఆరోపణలను తోసిపుచ్చింది. ఇరాన్ నౌకలు ఏవీ కూడా ఎల్‌పీజీతో తమ రేవులకు రాలేదని స్పష్టం చేసింది. ఈ విషయంలో తమపై అమెరికా సంస్థలు దర్యాప్తు జరుపుతున్న విషయం కూడా తమకు తెలియదని తెలిపింది. కొన్నిసంస్థలు దురుద్దేశాలతో తమపై కావాలనే ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు ప్రచారం చేస్తున్నాయని అదానీ గ్రూప్ తెలిపింది. 'మా రేవుల ద్వారా ఇరాన్ నుంచి వచ్చే ఎలాంటి సరుకుల ఎగుమతి, దిగుమతులను అనుమతించడం లేదు. అది మా విధానపరమైన నిర్ణయం. ఇరాన్ జెండాతో వచ్చే నౌకలు లేదా నేరుగా ఇరాన్ రేవుల నుంచి వచ్చే నౌకలు అన్నిటికీ ఇది వర్తిస్తుంది' అని తెలిపింది.

ఈ విడత 0.50% వడ్డీకోత: ఎస్‌బీఐ

దేశంలో రుణ విభాగాన్ని ఉత్తేజితం చేయడంతో పాటు పలు రకాల అస్థిరతలను దీటుగా ఎదుర్కొనగల శక్తి కల్పించడం కోసం రిజర్వ్ బ్యాంక్ ఈసారి అర శాతం మేరకు రెపోరేటును తగ్గించవచ్చని ఎస్‌బీఐ అంచనా వేస్తోంది. బుధవారం ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశాలు ప్రారంభమవుతాయి. శుక్రవారం ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఎంపీసీ నిర్ణయాలను ప్రకటించనున్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,640 ▲	89,500 ▲	1,11,000 ▲
విజయవాడ	1,00,000 ▲	94,000 ▲	1,00,000 ▲
విశాఖపట్నం	99,820 ▲	89,500 ▲	1,11,000 ▲
రాజమండ్రి	98,840 ▲	90,600 ▲	1,00,300 ▲
ప్రొద్దుటూరు	96,250 ▲	88,550 ▲	98,600 ▲
ముంబై	96,680 ▲	88,559 ▲	97,761 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

3వ తేదీ

హైదరాబాద్	525	విజయవాడ	525
వరంగల్	527	గోదావరి	510
చిత్తూరు	613	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	107	విజయవాడ	109
వరంగల్	107	గుంటూరు	112
కరీంనగర్	107	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	97
కర్నూలు	107	నెల్లూరు	102
విశాఖపట్నం	101	అనంతపురం	102
గోదావరి	109		

విదేశీ కంపెనీలు ఉత్పత్తికి సై అంటే దిగుమతి సుంకం 15 శాతమే..

8,000 ఈవీలకు మాత్రమే అనుమతి

దేశీయ తయారీపై కనీస పెట్టుబడి రూ.4,150 కోట్లు ఉండాలి

కొత్త ఈవీ పాలసీ మార్గదర్శకాలు విడుదల

న్యూఢిల్లీ: దేశీయంగా విద్యుత్ వాహనాల (ఈవీ) తయారీకి ముందుకు వచ్చే విదేశీ కంపెనీలకు దిగుమతి సుంకాలు గణనీయంగా తగ్గించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈవీల స్థానిక తయారీని పటిష్ఠం చేయడం, ప్రపంచ పారిశ్రామికవేత్తలను ఆకర్షించడం లక్ష్యంగా రూపొందించిన కొత్త ఈవీ విధానం మార్గదర్శకాలను ప్రభుత్వం సోమవారం నోటిఫై చేసింది. దీంతో ఈ పాలసీ ఇప్పుడు అమలులోకి వచ్చినట్టవుతుంది. దాని ప్రకారం ఈవీల తయారీలో కనీసం రూ.4,150 కోట్ల పెట్టుబడులు పెట్టే ఆటో తయారీదారులను 15% తగ్గింపు సుంకంపై 8,000 ఈవీలు దిగుమతి చేసుకునేందుకు అనుమతిస్తారు. అయితే అనుమతులు పొందిన తేదీ నుంచి మూడు సంవత్సరాల్లోగా ఉత్పత్తి కార్యకలాపాలు ప్రారంభించడంతో పాటు తయారీలో ఎంత శాతంలో స్థానిక ఉత్పత్తులు వినియోగించేది ప్రకటించాల్సి ఉంటుంది.

ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా రెండు వారాల్లో ప్రత్యేక విభాగం ఏర్పాటవుతుందని, 120 రోజులు అది అందుబాటులో ఉంటుందని అధికారి ఒకరు తెలిపారు. ఆ తర్వాత కూడా వచ్చే ఏడాది మార్చి 15 వరకు ఎప్పుడు అవసరం అనుకుంటే అప్పుడు దరఖాస్తుల విభాగాన్ని తెరిచే అవకాశం ఉంది. ఈ స్కీమ్ కింద ఒక్కో దరఖాస్తుదారునిపై కోల్పోయే సుంకాల గరిష్ఠ పరిమితి రూ.6,484 కోట్లుగా ఉండనుందన్నారు.

భారత్‌లో తయారీపై టెస్లా అనాసక్తి

ప్రపంచ ఆటోమొబైల్ కంపెనీలు మెర్సిడెస్ బెంజ్, స్కోడా-ఫోక్స్‌వేగన్, హ్యుండయ్, కియా దేశంలో విద్యుత్ కార్ల తయారీపై ఆసక్తిని ప్రకటించాయని ఈ పాలసీ మార్గదర్శకాల విడుదల సందర్భంగా కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి హెచ్‌డీ కుమారస్వామి తెలిపారు. అయితే ప్రపంచ ఈవీ దిగ్గజం టెస్లా మాత్రం దేశీయ తయారీ పట్ల ఆసక్తిగా లేదని, దేశంలో తమ షోరూమ్‌లు ప్రారంభించేందుకు మాత్రం సిద్ధంగా ఉన్నదని ఆయన చెప్పారు.

మార్కెట్లో మళ్లీ వాణిజ్య, యుద్ధ భయాలు

» సెన్సెక్స్ 77 పాయింట్లు డౌన్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లను మళ్లీ వాణిజ్య, యుద్ధ భయాలు అలుముకున్నాయి. స్టీల్, అల్యూమినియంపై సుంకాలను రెట్టింపు చేయనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం, ఈ మధ్యనే కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాన్ని ఉల్లంఘించారంటూ అమెరికా-చైనా పరస్పర ఆరోపణలు, రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం మళ్లీ తీవ్రతరం కావడం, ముడి చమురు ధరల పెరుగుదల, విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ వంటి అంశాలు ట్రేడింగ్ సెంటిమెంట్‌కు గండికొట్టాయి. దాంతో సోమవారం సెన్సెక్స్ ప్రారంభ ట్రేడింగ్‌లో 796.75 పాయింట్లు క్షీణించి 80,654 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. ఆ తర్వాత క్రమంగా కోలుకున్న సూచీ చివరికి 77.26 పాయింట్ల నష్టంతో 81,373.75 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ప్రారంభంలో 224.55 పాయింట్ల వరకు కోల్పోయినప్పటికీ, చివరికి 34.10 పాయింట్ల నష్టంతో 24,716.60 వద్ద స్థిరపడింది. గత ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి ప్రభుత్వ అంచనాలకు అనుగుణంగా 6.5 శాతంగా నమోదవడంతో పాటు జీఎస్‌టీ వసూళ్లు వరుసగా రెండో నెలా రూ.2 లక్షల కోట్లు దాటడం, ఈసారి ఆర్‌బీఐ రెపో రేటును అర శాతం వరకు తగ్గించవచ్చన్న అంచనాలు సూచీల రికవరీకి తోడ్పడ్డాయి.

మీనాక్షి ఆల్టర్నేట్స్ రియల్టీ ఫోకస్డ్ ఫండ్

700 కోట్ల కార్పస్‌తో ఏర్పాటు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన రియల్టీ, శుద్ధ ఇంధన వ్యాపారాల నిర్వహణలోని మీనాక్షి గ్రూప్ తాజాగా ఆర్థిక సేవల రంగంలోకి ప్రవేశించింది. మీనాక్షి ఆల్టర్నేట్స్ (ఎం-ఆల్ట్స్) పేరుతో ఆర్థిక సేవల అనుబంధ విభాగంతో పాటు దాని పరిధిలో తొలి ఫండ్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు మీనాక్షి గ్రూప్ వెల్లడించింది.

'మీనాక్షి రియల్ అసెట్స్ ఫండ్' పేరుతో రూ.700 కోట్ల కార్పస్‌తో ఈ ఫండ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. సెబీ అనుమతితో కూడిన కేటగిరీ-2 ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (ఏఐఎఫ్) ఇది.

చిత్రజ్యోతి
SINCE 1965

విడుదలకు సిద్ధమైన ఘాటీ



అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో క్రిష్ జాగర్లమూడి తెరకెక్కిస్తున్న చిత్రం 'ఘాటీ'. తమిళ నటుడు విక్రమ్ ప్రభు కీలక పాత్ర పోషిస్తున్నారు. రాజీవ్‌రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదలైన గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచేసింది. తాజాగా, ఈ సినిమాను జూలై 11న ప్రేక్షకుల ముందుకు తెస్తున్నట్లు ప్రకటించి ఓ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. సినిమాలోని ప్రధాన పాత్రధారులు సంచులు మోసుకుంటూ నదిని దాటుతున్న విజువల్స్ ఆకర్షణీయంగా ఉన్నాయి. ఈ చిత్రానికి ఎడిటర్: చాణక్యరెడ్డి తూరుపు, వెంకట్ ఎన్.స్వామి, సినిమాటోగ్రఫీ:మనోజ్‌రెడ్డి కాటసాని, సంగీతం:నాగవెల్లి విద్యాసాగర్. కాగా, 'వేదం' తర్వాత క్రిష్, అనుష్క కాంబోలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి.

ధనుష్ నటనకు జాతీయ అవార్డు వస్తుంది




శేఖర్ కమ్ముల

నాగార్జున, ధనుష్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో శేఖర్ కమ్ముల తెరకెక్కించిన చిత్రం 'కుబేర'. సునీల్ నారంగ్, పుష్కర్ రామ్మోహన్ నిర్మించారు. ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. తాజాగా, చెన్నైలో ఆడియో వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు శేఖర్ కమ్ముల మాట్లాడుతూ "ఇదో అద్భుతమైన చిత్రం. ప్రేక్షకులకు కొత్త అనుభూతినిస్తుంది. నాగార్జున, ధనుష్‌ల నటన నెక్స్ట్ లెవెల్‌లో ఉంటుంది. ధనుష్ ఆల్‌రౌండర్. ఈ చిత్రంలో ఆయన నటనకు జాతీయ అవార్డు వస్తుంది" అని అన్నారు. "సినిమా ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుంది. శేఖర్ కమ్ముల అద్భుతంగా సినిమాను తెరకెక్కించారు. రజనీకాంత్‌తో నేను నటించిన 'కూలీ' సినిమా మీ అందరి ఊహలకు మించి ఉండబోతోంది" అని నాగార్జున చెప్పారు. "శేఖర్ కమ్ముల స్వచ్ఛమైన మనసు ఉన్న వ్యక్తి. ఇందులో చేసిన పాత్ర నాకెంతో ప్రత్యేకం" అని ధనుష్ తెలిపారు.

ఎంత దుష్ప్రచారం చేస్తారో చేసుకోండి

తనపై వస్తున్న దుష్ప్రచారాలపై ధనుష్ ఈ సందర్భంగా స్పందించారు. "నేనెప్పుడూ నా బెస్ట్ ఇవ్వడానికే ప్రయత్నిస్తుంటాను. నాపై, నా సినిమాలపై ఎంతగా దుష్ప్రచారం చేస్తారో చేసుకోండి. నా సినిమాల విడుదలకు ముందు ప్రతిసారి ఏదో ఒక విషయంలో కుట్రలు పన్నుతూనే ఉంటారు. అయినా ఆ ప్రయత్నాలు నన్నేమీ చేయలేవు. నా అభిమానులు 23 ఏళ్లుగా నా వెన్నంటే ఉన్నారు. ఇలాంటి సర్కస్‌లు చేయడం మానుకోండి. ఎవరెంత దుష్ప్రచారం చేసినా అభిమానులు నాతోనే ఉంటారు" అని పేర్కొన్నారు.

ఫిల్మ్ చాంబర్‌లో 'వీరమల్లు' నిర్మాత



సినిమా టికెట్ ధరల పెంపు లేదా ఏ ఇతర విషయాలకు సంబంధించి అయినా సినీ పరిశ్రమకు చెందిన వారితో వ్యక్తిగత చర్చలకు తావులేదని ఇటీవలె ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే పవన్ సూచన మేరకు 'హరి హర వీరమల్లు' చిత్ర నిర్మాత ఏ.ఎం.రత్నం తాజాగా ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు భరత్ భూషణ్‌ను కలిశారు. తమ చిత్రానికి సంబంధించి అదనపు షోలకు అనుమతి, టికెట్ ధరల సవరణ కోరుతూ లేఖను అందజేశారు. 'హరి హర వీరమల్లు' సినిమా ఈనెల 12న విడుదల కానుంది.

మనసును తాకేలా



సిద్ధు జొన్నలగడ్డ, రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న సినిమా 'తెలుసు కదా'. నీరజ కోన దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, టీజీ కృతిప్రసాద్ నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించారు మేకర్స్ దీపావళి సందర్భంగా అక్టోబర్ 17 సినిమాను ప్రేక్షకుల ముందుకు తెస్తున్నట్లు ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. ఊహించని మలుపులతో నిండిన ఈ సినిమా ప్రేక్షకుల మనసును తాకేలా ఉంటుందని తెలిపారు.

థగ్‌లైఫ్‌ను అడ్డుకుంటాం



కన్నడ భాష గురించి నటుడు కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలతో థగ్‌లైఫ్ సినిమాను కష్టాలు వెంటాడుతున్నాయి. ఈ నెల 5న సినిమాను కర్నాటకలో విడుదల చేస్తే థియేటర్లకు నిప్పు పెడతామని కర్ణాటక రక్షణ వేదిక(కరవే) రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ గౌడ హెచ్చరించారు. కన్నడ సంఘాల ఐక్యకూటమి అధ్యక్షుడు వాటాళ్ నాగరాజ్ మైసూరులో సోమవారం మీడియాతో మాట్లాడుతూ, కమల్‌హాసన్ సినిమాను బహిష్కరించాల్సిందేనని అన్నారు.

హైకోర్టును ఆశ్రయించిన కమల్ హాసన్

థగ్‌లైఫ్ సినిమాకు వస్తున్న బెదిరింపులపై కమల్ హాసన్, కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. సినిమా ప్రదర్శనకు ఎలాంటి అడ్డంకులు లేకుండా తగిన భద్రత కల్పించేలా చూడాలని కోర్టుకు విన్నవించారు. ఇదిలా ఉంటే తమిళం నుంచి కన్నడ పుట్టిందని కమల్ హాసన్ వ్యాఖ్యానించినప్పుడు తాను చప్పట్లు కొట్టలేదని నటుడు శివరాజ్‌కుమార్ వివరణ ఇచ్చారు. అన్ని భాషలూ ముఖ్యమైనవేనని, తన మాతృభాష కన్నడకే ప్రాధాన్యం ఇస్తానని అన్నారు. ఇందులో ఎలాంటి సందేహం లేదని ఇంతకు ముందే చెప్పానని అన్నారు. కన్నడ కోసం తన ప్రాణమైనా ఇస్తానని అన్నారు.

- బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

పాక్ మ్యాచ్‌లు కొలంబోలో..

వేదికగా వైజాగ్ కూడా

మహిళల వన్డే వరల్డ్‌కప్

దుబాయ్: హైబ్రిడ్ ఫార్మాట్‌లో జరిగే మహిళల వన్డే వరల్డ్‌కప్ వేదికలను ఐసీసీ సోమవారం ప్రకటించింది. టోర్నీకి భారత్ ఆతిథ్యం ఇస్తుండగా.. తటస్థ వేదికగా శ్రీలంకలోని కొలంబోను ఎంపిక చేశారు. పాకిస్థాన్ ఆడే మ్యాచ్‌లన్నీ ఇక్కడ జరుగుతాయి.. సెప్టెంబరు 30 నుంచి నవంబరు 2 వరకు జరిగే వరల్డ్‌కప్ కోసం బెంగళూరు, గువాహటి, ఇండోర్, విశాఖపట్నంతోపాటు కొలంబోను వేదికలుగా ఖరారు చేశారు. సెప్టెంబరు 30న తొలి మ్యాచ్‌లో భారత్ ఆడనుంది. అక్టోబరు 29న తొలి సెమీస్ గువాహటి లేదా కొలంబోలో, 30న రెండో సెమీస్ బెంగళూరులో జరుగుతాయి. నవంబరు 2న బెంగళూరు లేదా కొలంబోలో ఫైనల్ నిర్వహిస్తారు. భారత్‌తోపాటు డిఫెండింగ్ చాంప్ ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, శ్రీలంక, ఇంగ్లండ్, న్యూజిలాండ్, సౌతాఫ్రికా, పాకిస్థాన్ టోర్నీలో ఆడనున్నాయి.

ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ వాయిదా..

మహిళల ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్‌ను వాయిదా వేసినట్టు ఆసియా క్రికెట్ మండలి తెలిపింది. ఈ నెల 6 నుంచి శ్రీలంకలో టోర్నీ జరగాల్సి ఉంది. అయితే, అక్కడ వాతావరణంలో తీవ్ర మార్పులతోపాటు లంక ప్రజల ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తమవుతోంది. దీంతో టోర్నీని రద్దుచేశారు.

బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడిగా శుక్లా



న్యూఢిల్లీ: బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా వచ్చే నెలలో తాత్కాలిక అధ్యక్షుడు కాబోతున్నాడు. బోర్డు రాజ్యాంగం ప్రకారం అధ్యక్షుడి గరిష్ఠ వయస్సు 70 ఏళ్లలోపే ఉండాలి. కానీ ప్రస్తుత చీఫ్ రోజర్ బిన్నీ జూలై 19కి 70 ఏళ్లకు చేరుకుంటాడు. దీంతో మూడు నెలల పాటు శుక్లా తాత్కాలికంగా బాధ్యతలు నిర్వర్తించనున్నాడు. ఆపై ఎన్నికల్లో నూతన అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. మాజీ క్రికెటర్ బిన్నీ 2022 నుంచి బీసీసీఐ అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు.

శ్రేయాస్, హార్దిక్‌కు భారీ జరిమానా

అహ్మదాబాద్: క్వాలిఫయర్-2లో భాగంగా జరిగిన మ్యాచ్‌లో పంజాబ్-ముంబై కెప్టెన్లపై భారీ జరిమానా విధించారు. ఈ సీజన్‌లో రెండోసారి స్లో ఓవర్‌రేట్‌కు పాల్పడినందుకు కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్‌పై రూ.24 లక్షల జరిమానా విధించగా.. మిగిలిన పంజాబ్ ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులో రూ.6 లక్షల కోత విధించారు. ముంబై జట్టు మూడోసారి స్లోఓవర్ రేట్‌కు పాల్పడడంతో కెప్టెన్ హార్దిక్‌పై ఏకంగా రూ.30 లక్షలు, ఆటగాళ్లపై రూ.12 లక్షల జరిమానా పడింది.



ఒకటా.. రెండా గత 17 ఏళ్లుగా ఒక్కసారైనా ఐపీఎల్ టైటిల్‌ను అందుకోవాలని ఆ రెండు జట్లు ఎదురుచూస్తూనే ఉన్నాయి. ఆధునిక క్రికెట్‌లో అత్యుత్తమ ఆటగాడిగా పేరు తెచ్చుకున్న విరాట్ కోహ్లి కెరీర్‌లోనైతే అదో పెద్ద వెలితి. రాయల్ చాలెంజర్స్ బెంగళూరును తన నాయకత్వంలో చాన్నాళ్లు నడిపించినా చాంపియన్‌ను చేయలేకపోయాడు. కానీ 18వ సీజన్‌లో ఆ అద్భుతాన్ని సాధించేందుకు ఆర్‌సీబీ మరో విజయం దూరంలోనే ఉంది. ఇక గతంలో పంజాబ్ కింగ్స్‌పై ఎవరికీ ఎలాంటి అంచనాలు లేకపోయినా.. ప్రస్తుతం సీన్ మారింది. శ్రేయాస్ అయ్యర్ ఆ జట్టును కదం తొక్కిస్తున్నాడు. టేబుల్ టాపర్‌గా నిలపడమే కాకుండా తుది పోరుకు కూడా చేర్చాడు. ఇక ఈ రెండు టాప్-2 జట్ల మధ్య ఆసక్తికరపోరులో ఎవరు గెలిచినా తొలి టైటిల్‌తో పండుగ చేసుకుంటారు.

ఎవరో కొత్త కింగ్?

తొలి టైటిల్ వేటలో పంజాబ్ X బెంగళూరు

నేడు ఐపీఎల్ -18 ఫైనల్

అహ్మదాబాద్: ప్రపంచ క్రికెట్‌లో అతి భారీ టీ20 లీగ్ అయిన ఐపీఎల్ ఆఖరి అంకానికి చేరింది. లక్షకు పైగా సీటింగ్ సామర్థ్యం కలిగిన నరేంద్ర మోదీ స్టేడియంలో నేడు (మంగళవారం) జరిగే ఫైనల్లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ టైటిల్ కోసం తలపడనున్నాయి. షెడ్యూల్ ప్రకారం ఇప్పటికే లీగ్ ముగియాల్సి ఉన్నా.. భారత్-పాక్ యుద్ధం కారణంగా వారం పాటు వాయిదా పడిన విషయం తెలిసిందే. ఇక ఆర్‌సీబీ తుది పోరులో తలపడడం ఇది నాలుగోసారి. 2009, 2011, 2016ల్లో టైటిల్‌పై ఆశలు పెట్టుకున్నా రన్నరప్‌గానే నిలిచింది. 'ఈ సాల కప్ నమ్దే' అంటూ బెంగళూరు జట్టు అభిమానులు ప్రతీసారి హోరెత్తిస్తుంటారు. వీరి నమ్మకాన్ని నిలబెడుతూ ఈసారి అదిరే ప్రదర్శనతో జట్టు తుదిపోరుకు చేరి అంచనాలను మరింత పెంచింది. ముఖ్యంగా విరాట్ అభిమానులు నెంబర్ 18 జెర్సీలతో స్టేడియంలో సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. అటు బెంగళూరులో హడావిడి మామూలుగా లేదు. రెస్టో బార్స్, పబ్స్‌లతో పాటు భారీ జెయింట్స్ స్ర్కీన్లపై ఫైనల్‌ను తిలకించేందుకు ఫ్యాన్స్ సిద్ధమవుతున్నారు. మరోవైపు క్వాలిఫయర్-1లో ఆర్‌సీబీ చేతిలోనే చిత్తుగా ఓడిన పంజాబ్ కింగ్స్ తిరిగి తుది పోరులోనూ అదే జట్టును ఢీకొనాల్సి వచ్చింది. ఆదివారం ఇదే మైదానంలో ముంబైని చిత్తు చేసిన అనుభవంతో ఈసారి బెంగళూరుకు గట్టి పంచ్ ఇవ్వాలనుకుంటోంది. 2014లో ఒక్కసారి మాత్రమే పంజాబ్ ఫైనల్లో అడుగుపెట్టింది.

ప్రతీకారంతో పంజాబ్

టేబుల్ టాపర్‌గా నిలిచిన పంజాబ్ కింగ్స్ క్వాలిఫయర్-1లో ఎదురైన పరాభవంతో ఒక్కసారిగా డీలా పడింది. ఆర్‌సీబీ ధాటికి కేవలం 101 పరుగులకే పరిమితం కావడంతో షాక్‌కు గురైంది. కానీ అలాంటి స్థితి నుంచి వెంటనే తేరుకుని, ఐదు సార్లు చాంపియన్ ముంబై ఇండియన్స్‌ను క్వాలిఫయర్-2లో మట్టి కరిపించిన విధానం అదుర్స్. కెప్టెన్ శ్రేయాస్ ఆడిన ఇన్నింగ్స్ క్రికెట్ ప్రేమికులను ఉర్రూతలూగించగా, 11 ఏళ్ల తర్వాత జట్టు ఫైనల్‌కు చేరింది. గతేడాది కేకేఆర్ కెప్టెన్‌గా ఆ జట్టుకు టైటిల్ అందించిన శ్రేయాస్‌పై.. ఇప్పుడు పంజాబ్‌ను గెలిపించే బాధ్యత ఉంది. తన రూ.26.75 కోట్ల ధరకు 603 పరుగులతో న్యాయం చేస్తున్నాడు. అతడితో పాటు బ్యాటింగ్ ఆర్డర్‌లో ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్, ప్రియాన్స్, ఇన్‌గ్లిస్, శశాంక్ సింగ్, స్టొయినిస్ ఎదురుదాడికి సిద్ధంగా ఉన్నారు. అయితే పేసర్ జాన్సెన్ లేకపోవడంతో వీరి బౌలింగ్ కాస్త బలహీనంగా కనిపిస్తోంది. అయినప్పటికీ బ్యాటింగ్ పిచ్‌పై ముంబైని మరీ భారీ స్కోరు చేయనీయకుండా కట్టడి చేయగలిగారు. అయితే పేసర్ అర్ష్‌దీప్ మాత్రం ఎలాంటి ప్రభావమూ చూపలేదు. అలాగే గాయం తర్వాత ఆడిన స్పిన్నర్ చాహల్ సైతం ధారాళంగా పరుగులిచ్చుకున్నాడు. ఏదేమైనా ఈ ఆఖరి పోరులో తమ లోపాలను సరిచేసుకుంటూ ఆర్‌సీబీపై ప్రతీకారం తీర్చుకోవాలన్న కసితో పంజాబ్ ఉంది.



జోరు సాగాలని..

ఆర్‌సీబీ ప్రధాన ఆకర్షణ విరాట్ కోహ్లి అనడంలో సందేహం లేదు. ఎప్పటి మాదిరే ఈ సీజన్‌లోనూ తన స్థాయికి తగ్గ ప్రదర్శనతో రాణిస్తున్నాడు. 614 పరుగులతో టాప్-5లో కొనసాగుతున్నాడు. ఫిల్ సాల్ట్‌తో కలిసి ఓపెనర్‌గా మెరుపు ఆరంభాలతో మిడిలార్డర్‌పై ఒత్తిడి పడకుండా చూసుకుంటున్నాడు. ఇక ఈ స్టేడియంలోనూ, పంజాబ్‌పై అతడికి మెరుగైన రికార్డు ఉండడం జట్టుకు లాభించేదే. అలాగే మయాంక్ అగర్వాల్, జితేశ్ శర్మ రాణిస్తుండడం సానుకూలాంశం. అయితే కెప్టెన్ రజత్ పటీదార్ మాత్రం ఇటీవలి మ్యాచ్‌ల్లో నిరాశపర్చాడు. గత రెండు మ్యాచ్‌లకు దూరమైన ఫినిషర్ టిమ్ డేవిడ్ ఫిట్‌నెస్‌పై స్పష్టత రావాల్సి ఉంది. బౌలింగ్‌లో పేసర్ హాజెల్‌వుడ్ ఇప్పటికే 21 వికెట్లతో జట్టు విజయాల్లో పాలుపంచుకుంటున్నాడు. ఇతర పేసర్లు యష్ దయాల్, తుషార, భువనేశ్వర్ సైతం ప్రభావం చూపుతున్నారు. అందుకే అన్ని విభాగాల్లోనూ పటిష్ఠంగా కనిపిస్తున్న ఆర్‌సీబీ స్థాయికి తగ్గ ప్రదర్శన కనబరిస్తే చాంపియన్ కావడం సాధ్యమే.

తుది జట్లు (అంచనా)

బెంగళూరు: సాల్ట్, విరాట్, మయాంక్, రజత్ పటీదార్ (కెప్టెన్), లివింగ్‌స్టోన్, జితేశ్ శర్మ, షెఫర్డ్, క్రునాల్, భువనేశ్వర్, యష్ దయాల్, హాజెల్‌వుడ్.

పంజాబ్: ప్రభ్‌సిమ్రన్, ప్రియాన్ష్, ఇన్‌గ్లిస్, శ్రేయాస్ (కెప్టెన్), నేహల్, శశాంక్, స్టొయినిస్, ఒమర్జాయ్, జేమిసన్, అర్ష్‌దీప్, చాహల్.

పిచ్

అహ్మదాబాద్ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. క్వాలిఫయర్-2లో ఇరు జట్లూ 200+ స్కోర్లు సాధించాయి. ఇక్కడ మొదట బ్యాటింగ్‌కు దిగిన జట్లకే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నా.. చివరి మ్యాచ్‌లో పంజాబ్ అద్భుతంగా ఛేదించింది. దీంతో ఫైనల్లో టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్‌కు మొగ్గు చూపవచ్చు.

వర్షం పడి రద్దయితే..?

ఫైనల్‌కు కూడా వర్షంతో ముప్పు పొంచి ఉంది. మంగళవారం రోజంతా ఆకాశం మేఘావృతంగా ఉండనుందట. అహ్మదాబాద్, సమీప ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలకు ఆస్కారముందని వాతావరణ శాఖ తెలిపింది. ఒకవేళ వర్షంతో మ్యాచ్ రద్దయినా ఎలాంటి ఇబ్బందీ లేదు. ఫైనల్‌కు రిజర్వ్ డే ఉన్నందున బుధవారం జరుగుతుంది. అప్పుడు కూడా వర్షంతో వీలు కాకపోతే లీగ్ దశలో టేబుల్ టాపర్ (పంజాబ్) జట్టును విజేతగా ప్రకటిస్తారు.

ప్రతీకారం తీర్చుకున్నాడు..

కార్ల్‌సన్‌కు గుకేష్ షాక్

'క్లాసికల్'లో నార్వే దిగ్గజంపై భారత జీఎంకు తొలి విజయం



తప్పు చేసి.. సారీ చెప్పి..



స్టావంజర్ (నార్వే): ప్రపంచ చాంపియన్ గుకేష్..వరల్డ్ నెం.1 మాగ్నస్ కార్ల్‌సన్‌పై ప్రతీకారం తీర్చుకున్నాడు. నార్వే చెస్ టోర్నీ ఆరో రౌండ్‌లో కార్ల్‌సన్‌కు షాకిచ్చాడు. తద్వారా క్లాసికల్ గేమ్‌లో..సమకాలీన చెస్ దిగ్గజం కార్ల్‌సన్‌పై గుకేష్ తొలిసారి విజయం సాధించాడు. గుకేష్ చేతిలో ఓడిపోయాననే అసహనంతో బోర్డుపై కార్ల్‌సన్ ప్రతాపం చూపాడు. ఆదివారం రాత్రి జరిగిన ఆరో గేమ్‌లో తెల్లపావులతో తలపడిన 19 ఏళ్ల గుకేష్ 62 సుదీర్ఘ ఎత్తుల అనంతరం కార్ల్‌సన్‌కు చెక్ పెట్టాడు. నల్లపావులతో ఆడినా మ్యాచ్‌లో సింహభాగం కార్ల్‌సనే ఆధిక్యం ప్రదర్శించాడు. అయితే సరైన ఎత్తులతో ప్రత్యర్థిని ఎదుర్కొన్న గుకేష్ గేమ్ సుదీర్ఘంగా కొనసాగేలా చేశాడు. ఈక్రమంలో కార్ల్‌సన్ చేసిన తప్పిదాన్ని సద్వినియోగం చేసుకున్న భారత జీఎం ప్రత్యర్థిపై సంచలన విజయం అందుకున్నాడు. టోర్నమెంట్ తొలి రౌండ్‌లో మాగ్నస్ చేతిలో చవిచూసిన ఓటమికి గుకేష్ బదులు తీర్చుకున్నాడు. ఆరో రౌండ్ గెలుపుతో మొత్తం 8.5 పాయింట్లతో గుకేష్ మూడో స్థానానికి దూసుకొచ్చాడు. తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి అర్మగడాన్ టైబ్రేకర్‌లో చైనా జీఎం వీ ఈపై నెగ్గాడు. దాంతో మొత్తం 7.5 పాయింట్లతో హికారు నకమురాతో కలిసి అర్జున్ నాలుగో స్థానంలో నిలిచాడు. మహిళల విభాగంలో గ్రాండ్‌మాస్టర్ వైశాలీ చేతిలో టైబ్రేకర్‌లో కోనేరు హంపి పరాజయం చవిచూసింది. అయితే మొత్తం 9.5 పాయింట్లతో ముజిచుక్‌తో కలిసి హంపి అగ్ర స్థానంలోనే కొనసాగుతోంది.

గుకేష్ చేతిలో ఓటమితో కార్ల్‌సన్ తీవ్ర ఆగ్రహానికి లోనయ్యాడు. ఈక్రమంలో అతడు టేబుల్‌పై బలంగా బాదాడు. దాంతో బోర్డుపై ఉన్న పావులు చెల్లాచెదురయ్యాయి. ఆపై గుకేష్‌కు షేక్‌హ్యాండ్ ఇచ్చి సారీ చెప్పిన కార్ల్‌సన్ సీటులోంచి లేచాడు. తప్పు తెలుసుకొని తిరిగి వచ్చి టేబుల్‌పై చెల్లాచెదురైన పావులను సర్దాడు. మరోవైపు కార్ల్‌సన్‌పై విజయాన్ని జీర్ణించుకొనేందుకు గుకేష్‌కు కొంత సమయం పట్టింది. ఈక్రమంలో కార్ల్‌సన్ రూమ్ నుంచి వెళుతూ గుకేష్‌కు మరోసారి సారీ చెప్పి వెన్ను తట్టడం అందర్నీ ఆకర్షించింది.

ప్రధాని అభినందన

గుకేష్‌ను ప్రధాని మోదీ ప్రశంసించారు. 'చెస్‌లో అత్యుత్తమ ఆటగాడిపై విజయం సాధించినందుకు అభినందన. నార్వే చెస్ ఆరో రౌండ్‌లో కార్ల్‌సన్‌పై గెలుపొందడం గుకేష్ అద్భుత నైపుణ్యాలకు అతడి అంకితభావానికి అద్దం పడుతుంది' అని ప్రధాని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

వన్డేలకు మాక్సీ వీడ్కోలు

టీ20లలో కొనసాగుతానని ప్రకటన



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటించాడు. వచ్చే ఏడాది శ్రీలంకలో జరిగే టీ20 వరల్డ్‌కప్‌పై దృష్టి సారించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు సోమవారం వెల్లడించాడు. వన్డేలు ఆడేందుకు శరీరం సహకరించడంలేదని, అయినా ఈ ఫార్మాట్‌లో తాను కొనసాగితే స్వార్థపరుడినే అవుతానని చెప్పుకొచ్చాడు. మెరుపు బ్యాటింగ్‌కు మారుపేరైన 36 ఏళ్ల మ్యాక్స్‌వెల్ 149 వన్డేల్లో 3990 పరుగులు చేశాడు. దీనిలో 4 సెంచరీలు, 23 హాఫ్ సెంచరీలున్నాయి. ఇక..భారత్ ఆతిథ్యమిచ్చిన 2023 వన్డే ప్రపంచ కప్‌లో అఫ్ఘానిస్థాన్‌పై వాంఖడే స్టేడియంలో మ్యాక్సీ ఆడిన ఇన్నింగ్స్ (201) వన్డే ఫార్మాట్‌లో గొప్ప వాటిలో ఒకటిగా నిలుస్తుంది.

ఇంగ్లండ్ 'ఎ'తో మ్యాచ్ డ్రా

భారత్ 'ఎ' రెండో ఇన్నింగ్స్ 241/2

కాంటర్‌బరీ: భారత్ 'ఎ', ఇంగ్లండ్ 'ఎ' జట్ల మధ్య జరిగిన నాలుగు రోజుల తొలి అనధికార టెస్టు మ్యాచ్ డ్రాగా ముగిసింది. చివరి రోజు సోమవారం ఆట ముగిసేసరికి భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 241/2 స్కోరు చేసింది. అభిమన్యు (68), జైస్వాల్ (64), జురెల్ (53 నాటౌట్), నితీశ్ (52 నాటౌట్) అర్ధసెంచరీలు సాధించారు. అంతకుముందు ఇంగ్లండ్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో 587 రన్స్‌కు ఆలౌటైంది. జమన్ (41) రాణించాడు. ముకేశ్‌కు 3, శార్దూల్‌కు 2 వికెట్లు దక్కాయి. భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో 557 రన్స్ చేసింది.

అంతర్జాతీయ క్రికెట్‌కు క్లాసెన్ గుడ్‌బై



కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా వికెట్ కీపర్-బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ (33) అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. గతేడాది జనవరిలోనే టెస్టులకు గుడ్‌బై చెప్పిన క్లాసెన్.. వైట్‌బాల్ ఫార్మాట్ నుంచి తక్షణమే వైదొలుగుతున్నట్టు తెలిపాడు. ఫ్రాంచైజీ క్రికెట్ వ్యవహారాలను సమన్వయం చేసుకొనేందుకే ఈ నిర్ణయం తీసుకొన్నట్టు చెప్పాడు. ఏడేళ్ల కెరీర్‌లో దక్షిణాఫ్రికా తరఫున 4 టెస్టులు, 60 వన్డేలు, 58 టీ20లు ఆడాడు. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఆడిన క్లాసెన్.. వచ్చే నెలలో అమెరికాలో జరిగే మేజర్ లీగ్ క్రికెట్ ఆడనున్నాడు. 'నా కెరీర్, కుటుంబ భవిష్యత్ కోసం ఎంతో ఆలోచించి నిర్ణయం తీసుకొన్నా. కఠిన నిర్ణయమే అయినా.. ప్రశాంతంగా ఉంద'ని క్లాసెన్ తెలిపాడు. ఏప్రిల్‌లో ప్రకటించిన సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాలో క్లాసెన్ పేరు లేకపోవడంతోనే అతడు రిటైర్మెంట్‌పై ఊహాగానాలు చెలరేగాయి. 2018 ఫిబ్రవరిలో స్వదేశంలో భారత్‌తో సిరీస్‌లో వన్డే, టీ20లు అరంగేట్రం చేసిన క్లాసెన్.. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో పవర్ హిట్టర్‌గా ఎదిగాడు.



పెగులాకు ఝలక్

● క్వార్టర్స్‌కు గాఫ్, జొకో, జ్వెరెవ్ ● ఫ్రెంచ్ ఓపెన్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో అన్‌సీడెడ్ లోయిస్ బోయిస్సన్ సంచలనం సృష్టించింది. మూడో సీడ్ జెస్సికా పెగులాను ఓడించిన బోయిస్సన్ క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. కోకో గాఫ్, నొవాక్ జొకోవిచ్, మూడో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్, మిర్రా ఆండ్రీవ కూడా రౌండ్-8లోకి అడుగుపెట్టారు. సోమవారం జరిగిన ప్రీక్వార్టర్స్‌లో 21 ఏళ్ల లోయిస్ బోయిస్సన్ (ఫ్రాన్స్) 3-6, 6-4, 6-4తో పెగులాకు షాకిచ్చింది. రెండో సీడ్ గాఫ్ 6-0, 7-5తో అలెగ్జాండ్రోవాపై, ఆండ్రీవ 6-3, 7-5తో కసట్‌కినా (ఆస్ట్రేలియా)పై, ఏడో సీడ్ మాడిసన్ కీస్ 6-3, 7-5తో హేలీ బాప్టిస్ట్‌పై గెలిచారు. పురుషుల సింగిల్స్‌లో ఆరో సీడ్ జొకోవిచ్ 6-2, 6-3, 6-2తో కామెరూన్ నోరిపై నెగ్గగా.. జర్మన్ ప్లేయర్ జ్వెరెవ్‌కు వాకోవర్ లభించింది. టాలన్ గ్రీక్‌స్పూర్‌తో పోరులో 6-4, 3-0తో జ్వెరెవ్ ఆధిక్యంలో ఉన్నప్పుడు.. ప్రత్యర్థి గాయంతో తప్పుకొన్నాడు. ఐదో సీడ్ జాక్ డ్రేపర్ (బ్రిటన్) 7-5, 3-6, 2-6, 4-6తో అలెగ్జాండర్ బబ్లిక్ (కజకిస్థాన్) చేతిలో ఓడాడు.

ఉద్యోగుల బదిలీల గడువు పొడిగింపుపై జీవో

అమరావతి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సాధారణ బదిలీల గడువు తేదీ పొడిగింపుపై ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ నెల 9వ తేదీ వరకు గడువు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. 10వ తేదీ నుంచి బదిలీలపై మళ్లీ నిషేధం అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. సోమవారం రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి పీయూష్ కుమార్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

మూడు పెళ్లిళ్లు చేసుకోవడం సనాతన ధర్మమా?: నారాయణ



ఎల్బీనగర్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మాన్ని విమర్శించిన వాళ్లను జైల్లో పెట్టాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పదే పదే అంటున్నారని, మూడు పెళ్లిళ్లు చేసుకోవడం సనాతన ధర్మమా.. అని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ప్రశ్నించారు. సనాతన ధర్మంలో విడాకులు ఉండవని చెప్పారు. ఎప్పుడూ సనాతనం గురించి మాట్లాడే పవన్ కల్యాణ్ ముగ్గురు భార్యలను ఎందుకు మార్చారని నిలదీశారు. పవన్ చెప్పే దాన్ని బట్టి మొట్టమొదట జైల్లో పెట్టాల్సింది ఆయననే అని ఎద్దేవా చేశారు. సనాతన ధర్మంలో సతీసహగమనం ఉందని, దాన్ని ఒప్పుకొంటారా అని నిలదీశారు. భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం(ఇస్కఫ్) రాష్ట్ర అధ్యక్షుడు గోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకల్లో నారాయణ మాట్లాడారు.

త్వరలో 46 వేల మంది

టీచర్లకు తప్పనిసరి బదిలీ

- స్కూల్ అసిస్టెంట్లు 23,113.. ఎస్జీటీలు 23 వేల మందికి తప్పనిసరి కోటా కింద స్థానచలనం
- రిక్వెస్ట్ బదిలీలకు మరో 39 వేల మంది దరఖాస్తు
- 1872 మంది ప్రైమరీ స్కూళ్ల హెచ్‌ఎంల బదిలీ

అమరావతి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెద్దఎత్తున ఉపాధ్యాయులు బదిలీ అవుతున్నారు. ఎనిమిది విద్యా సంవత్సరాలు పూర్తి చేసుకున్న టీచర్లు తప్పనిసరిగా బదిలీ కావాలి. ఈ ఒక్క కోటాలోనే 46 వేలమందికి పైగా టీచర్లు బదిలీ కాబోతున్నారు. వీరు కాకుండా రిక్వెస్ట్ విధానంలో ఎంత మంది బదిలీ అవుతారనేది త్వరలో తెలుస్తుంది. రెండేళ్లు దాటిన వారు రిక్వెస్ట్ బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చు. పాఠశాల విద్యా శాఖ ఇటీవల బదిలీల ప్రక్రియ ప్రారంభించింది. బదిలీల కోసం 43,033 మంది స్కూల్ అసిస్టెంట్లు దరఖాస్తు చేసుకోగా, వీరిలో 23,113 మంది తప్పనిసరిగా బదిలీ కావాలి. అలాగే సెకండరీ గ్రేడ్ టీచర్లు 42,248 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో సుమారు 23 వేలమంది తప్పనిసరిగా బదిలీ కావాలి. మొత్తంగా స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు కలిపి 46,113 మంది తప్పనిసరిగా బదిలీ అవుతారు. మరో 39 వేలమంది రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. కౌన్సెలింగ్ అనంతరం వారిలో ఎంతమంది బదిలీ అవుతారో తెలుస్తుంది.

9,607 మోడల్ ప్రైమరీ స్కూళ్లు

రాష్ట్రంలో కొత్తగా 9,607 మోడల్ ప్రైమరీ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రాథమిక స్కూళ్లను మోడల్ ప్రైమరీ స్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేశారు. ఈ పాఠశాలల్లో తరగతికి ఒక టీచర్‌ను ఇస్తారు. ఆ పాఠశాలలకు హెచ్‌ఎంలను నియమించడంలో కొంత గందరగోళం ఏర్పడింది. సోమవారం నియామకపు ఆర్డర్లు జనరేట్ చేశారు. మూడు విధాల్లో 9,607 మంది హెచ్‌ఎంలను నియమిస్తున్నారు. ఇప్పటికే ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా 3,532 మంది ఉన్నారు. వారిలో 1,872 మంది ఇప్పుడు బదిలీ అయ్యారు. మిగులు స్కూల్ అసిస్టెంట్ల నుంచి 4,693 మందిని మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంలుగా నియమించారు. 1,382 మంది ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించి హెచ్‌ఎంలుగా నియమిస్తున్నారు. ఎవరైనా స్కూల్ అసిస్టెంట్లు మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంగా వెళ్లేందుకు అంగీకరించకపోతే ఆ ఖాళీలను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తారు. గ్రేడ్-2 హెచ్‌ఎంల బదిలీలకు 2,058 మంది దరఖాస్తు చేసుకోగా 1,495 మంది బదిలీ అయ్యారు. 1,373 మంది స్కూల్ అసిస్టెంట్లకు గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించి పోస్టింగ్‌లు ఇచ్చారు.

గ్రామీణ మహిళలకు చట్టాలపై అవగాహన

- ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ: రాయపాటి శైలజ

అమరావతి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించడానికి ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేశామని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ తెలిపారు. మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు జరగకుండా అవగాహన పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'బాధితులతో మాట్లాడి అండగా నిలుస్తున్నాం. నిందితులకు శిక్షపడేలా చేస్తున్నాం. మహిళలపై అత్యాచారాలు, ఘోరాలు జరగకుండా అధికారులతో సమీక్షిస్తున్నాం. ఏ ఒక్క ఆడబిడ్డకు అన్యాయం జరిగినా కమిషన్ చూస్తూ ఊరుకోదనే ధైర్యం మహిళలకు కలిగేలా కృషి చేస్తున్నాం. బాధిత మహిళలకు తక్షణ సహాయం అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. చట్టపరంగా మహిళల రక్షణకు ఉన్న హక్కుల అమలుకు కమిషన్ ఎప్పుడూ ముందుంటుంది. బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించడం నుంచి దర్యాప్తు అధికారులు చర్యలు తీసుకునే వరకు పర్యవేక్షణ లోపం లేకుండా పని చేస్తుంది. ఐపీసీ సెక్షన్లు, పోక్సో చట్టం, పనిచేసే చోట మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పీవోఎస్‌హెచ్), గృహ హింస (డీవీ) చట్టం వంటివాటిపై గ్రామాల్లోని యువతకు, కార్మిక మహిళలకు అవగాహన కల్పిస్తాం. స్కూళ్లు, కళాశాలల్లో బాలికలకు చట్టాలు, న్యాయం పట్ల అవగాహన సదస్సులు నిర్వహించేందుకూ ప్రణాళికలు రూపొందిస్తున్నాం. మునుపెన్నడూ చూడని విధంగా సమర్థ మహిళా కమిషన్‌ను ప్రజలకు సరికొత్త రీతిలో పరిచయం చేస్తాం. మహిళలకు భరోసా ఇస్తాం. బాధితులకు అండగా నిలుస్తాం. మహిళల హక్కుల రక్షణ, సంక్షేమం కోసం పనిచేసే కమిషన్ రాజకీయ ఒత్తిళ్లకు లోనవకుండా నిష్పక్షపాతంగా, స్వతంత్రంగా ఉండాల్సిన అవసరం ఉంది' అని శైలజ పేర్కొన్నారు.

భానుడి సెగలు.. వడగాడ్పులు

- బలహీనంగా రుతుపవనాలు
- వరుసగా రెండో రోజూ జంగమహేశ్వరపురంలో 41 డిగ్రీల ఉష్ణోగ్రత

విశాఖపట్నం, అమరావతి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పడమర గాలులతో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఎండ తీవ్రత కొనసాగుతోంది. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కొన్నిచోట్ల వడగాడ్పులు వీచాయి. రుతుపవనాలు బలహీనంగా ఉండడంతో ఎక్కువ ప్రాంతాల్లో వాతావరణం పొడిగా ఉంది. జంగమహేశ్వరపురంలో వరుసగా రెండో రోజూ 41 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు, మూడు డిగ్రీలు ఎక్కువగా నమోదవుతాయని వాతావరణ శాఖ తెలిపింది. కొన్నిచోట్ల మాత్రం ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కాగా, మంగళవారం అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని, కొన్ని ప్రాంతాల్లో ఎండ తీవ్రతతో ఉక్కపోతగా ఉంటుందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో 39-40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతతో ఉక్కపోతగా ఉంటుందని పేర్కొంది. మన్యం, అల్లూరి, కాకినాడ జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందని వివరించింది.



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ సుష్మ

శ్రీచైతన్య విద్యార్థుల విజయభేరి

హైదరాబాద్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు విజయభేరి మోగించారు. ఆలిండియా మొదటి ర్యాంకుతో పాటు ఓపెన్ కేటగిరీలో 3, 5, 6, 11 ర్యాంకులు సాధించారని శ్రీచైతన్య విద్యాసంస్థల సీఈవో, అకడమిక్ డైరెక్టర్ సుష్మ తెలిపారు. వంగాల అజయ్ రెడ్డి 300 మార్కులకు 300 మార్కులు సాధించి మొదటి ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఓపెన్ కేటగిరీలో ఎం.ఎ. జిద్దుసైన్ 3, ఉజ్వల్‌కేసరి 5, అక్షత్‌కుమార్ చౌరాసియా 6, అర్నవ్‌నిగమ్ 11, దేవ్‌దుత్త మజ్జీ 16, రుత్వికసాయి 18, వంగాల అజయ్‌రెడ్డి 19వ ర్యాంకు సొంతం చేసుకున్నట్లు తెలిపారు. ఓపెన్ కేటగిరీలో టాప్ 10లోపు మూడు ర్యాంక్‌లు, 20లోపు ఎనిమిది, 50లోపు 19 ర్యాంకులు, 100లోపు 29 ర్యాంకులను తమ విద్యార్థులు కైవసం చేసుకున్నారని వివరించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు, అధ్యాపకులను అభినందించారు.

సత్తా చాటిన నారాయణ విద్యార్థులు



ర్యాంకులు సాధించిన నారాయణ విద్యార్థులు

హైదరాబాద్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారని ఆ విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ తెలిపారు. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో మాజిద్ హుస్సేన్ (3వ ర్యాంక్), పార్థ్ మందర్ వార్తక్ 4, అక్షత్ చౌరాసియా 6, సాహిల్ డియో 7, వడ్లమూడి లోకేష్ 10వ ర్యాంక్‌లతో టాప్ 10లో నిలిచారని పేర్కొన్నారు. వీరితోపాటు ఓపెన్ కేటగిరీలో 100లోపు 43 ర్యాంకులు తమ విద్యార్థులు కైవసం చేసుకున్నారని వెల్లడించారు. అన్ని కేటగిరీల్లో 50లోపు 42 ర్యాంకులు, 100లోపు 75 ర్యాంకులను సొంతం చేసుకుని, విశేష ప్రతిభ చాటారని వివరించారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను వారు అభినందించారు.

సంచలనం సృష్టించిన భాష్యం విద్యార్థులు



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ

గుంటూరు(విద్య), జూన్ 2(ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో భాష్యం ఐఐటీ జేఈఈ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులతో సంచలనం సృష్టించారని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. ఓపెన్ కేటగిరిలో ఎస్.వెంకటసాయి చక్రి 33వ ర్యాంకు సాధంచగా, ఎం.శ్రీకర గణేష్ 104, ఎన్.ఆకాష్ 108, టి.విక్రమ్ లేవీ 146, డి.జస్వంత్ బాలాజీ 151, జి.సాయిమనోజ్ఞ 152వ ర్యాంకులు సాధించి జాతీయ స్థాయిలో విజయకేతనం ఎగురవేశారన్నారు. 100లోపు 14ర్యాంకులు, 200లోపు 26 ర్యాంకులు, 500లోపు 57 ర్యాంకులను తమ విద్యార్థులు కైవసం చేసుకున్నారని వెల్లడించారు. ఉన్నత చదువుల నిమిత్తం ఎస్.వెంకటసాయిచక్రి, జి.సాయిమనోజ్ఞకు రూ.5లక్షల చొప్పున, శ్రీకర గణేష్, ఎన్.ఆకాశ్‌కు రూ.2 లక్షల చొప్పున, టి.విక్రమ్ లేవీ, డి.జస్వంత్ బాలాజీలకు రూ.లక్ష చొప్పున అందజేసినట్టు తెలిపారు.

కేకేఆర్ గౌతమ్ పూర్వ విద్యార్థికి 8వ ర్యాంకు

హైదరాబాద్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్డ్ ఫలితాలలో డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్ పూర్వ విద్యారులు వివిధ కేటగిరీల్లో 100 లోపు 13 ర్యాంకులు సాధించారు. కొరికన రసజ్ఞ 8వ ర్యాంకు, ఎం. మణిదీప్ వర్మ 21, ఎస్. నిర్మిత్ 29, సీహెచ్.చేతన్ 34, కే.ధీరజ్ 37, ఎల్. చెర్విత 41, జి.ప్రత్యూష 47, ఎన్.హేమంత్ అభిరామ్ 48, శ్రీ వినయ్ 50వ ర్యాంకులు సాధించారు. పాఠశాల పూర్వ విద్యార్థి ఓపెన్ కేటగిరీలో 78వ ర్యాంకు సాధించటం గమనార్హం. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సంస్థ యాజమాన్యం అభినందనలు తెలిపింది.

'ఆదిత్య' విద్యార్థుల హవా

కాకినాడ రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని కాకినాడలోని ఆదిత్య విద్యాసంస్థల కార్యదర్శి ఎన్.కృష్ణదీపక్‌రెడ్డి తెలిపారు. అఖిల భారత ఓపెన్ కేటగిరీలో ఎమ్.మీసాల జయచంద్ర (169), పి.ఆదిత్య అభిషేక్(257), జి.శ్రీరామశశాంక్(281), వై.శుభశ్రీవల్లీ ఆత్రేయి(296), టి.సాత్విక్(849), సీహెచ్ సాయివర్షిత్(893) ర్యాంకులు సాధించినట్టు పేర్కొన్నారు. విద్యార్థులను సంస్థ చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, హాస్టల్స్ డైరెక్టర్ లక్ష్మీరాజ్యం, డైరెక్టర్లు సుగుణ, శృతి అభినందించినట్టు తెలిపారు.

సత్తా చాటిన 'తిరుమల' విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని తిరుమల విద్యాసంస్థల విద్యార్థులు సత్తా చాటారని ఆ సంస్థ ప్రతినిధి తిరుమలరావు ఒక ప్రకటనలో తెలిపారు. తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు కె.ప్రణీత్ ఆలిండియా స్థాయిలో 2వ ర్యాంక్, జాతీయ స్థాయిలో కోటిపల్లి యశ్వంత్ సాత్విక్ 8, ఇ.వర్షిత్ 12, ఎం.సుమంత్ దొర 38, మజ్జి పురుషోత్తమ రావు 39, కె.అభినవ్ 42, జి.సుజోష్ రాజు 43, జి.అఖిల్ సాయి 45, తుమాటి పూజిత అఖిల్ రాజ్‌కుమార్ 85, ఆర్.చరణ్ తేజ 86, కప్పల వెంకటరామ వినీష్ 127, పాతపాటి వెంకట వివేక్ వర్మ 132, ముచ్చల లిఖిత 137వ ర్యాంక్ సాధించారని పేర్కొన్నారు. ప్రధాన ర్యాంక్‌లతోపాటు 165, 174, 193, 195, 226, 231, 238, 243, 245, 246, 270, 272, 275, 276 ర్యాంక్‌లను తమ విద్యార్థులు సాధించారని తెలిపా రు. ఉత్తమ ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.

గుడివాడ విశ్వభారతి అ'పూర్వ' విజయం

హైదరాబాద్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో గుడివాడ విశ్వభారతి పాఠశాల పూర్వ విద్యారులు వివిధ కేటగిరీల్లో వంద లోపు 7ర్యాంకులు, 1000 లోపు 29 ర్యాంకులు సాధించారు. ఓబీసీ కేటగిరిలో పల్లా భరత్ చంద్ర ఆలిండియా 2వ ర్యాంకు, ఓపెన్ కేటగిరీలో 21వ ర్యాంకు సాధించాడు. కె.ప్రణయ్ 23, కె.చెన్నకేశవ 29, ఎస్.రోహిత 29, బి. చాణుక్య 78, డి.బలరాం నాయుడు 98వ ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులకు విశ్వభారతి స్కూల్ చైర్మన్ పి.శ్రీమన్నారాయణ, డైరెక్టర్ మంజుల అభినందనలు తెలియజేశారు.

రెసోనెన్స్ విద్యార్థుల ప్రతిభ

హైదరాబాద్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాల్లో రెసోనెన్స్ జూనియర్ కాలేజీ విద్యార్థి పల్లా శివ సంకేత్ రెడ్డి 102వ ర్యాంకు సాధించారు. రెసోనెన్స్‌కు చెందిన 21 మంది విద్యార్థులు 1000లోపు ర్యాంకులు సాధించారు. ఈ సంస్థ క్యాంపస్‌ల నుంచి 170కుపైగా విద్యార్థులు దేశంలోని ప్రముఖ ఐఐటీల్లో ప్రవేశం పొందనున్నట్లు రెసోనెన్స్ విద్యాసంస్థల డైరెక్టర్ నర్రా పూర్ణచంద్రరావు పేర్కొన్నారు.

రాతల్లో 'నేలచూపులు'

జీఎస్టీ వసూళ్లపై జగన్ పత్రిక వక్రీకరణ

స్థూల జీఎస్టీతో పోల్చి వికృతానందం

నికర జీఎస్టీయే వృద్ధికి ప్రామాణికం

అది గత మే నెలకంటే ఈసారి ఎక్కువే

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఈ ఏడాది మే నెలలో వచ్చిన నికర జీఎస్టీ రూ.2714 కోట్లు!

గత ఏడాది మే నెలలో రాష్ట్రానికి వచ్చిన నికర జీఎస్టీ ఆదాయం రూ.2597 కోట్లు!

గత ఏడాదికంటే ఈసారి జీఎస్టీ పెరిగిందని స్పష్టంగా అర్థమవుతోంది! కానీ.. జగన్ పత్రిక మాత్రం 'ఏపీలో జీఎస్టీ నేలచూపులు' అంటూ సోమవారం ఓ కథనాన్ని ప్రచురించింది. వృద్ధికి ప్రామాణికంగా తీసుకునే నికర వసూళ్లను కాకుండా, స్థూల వసూళ్లతో పోల్చి... రాష్ట్ర ప్రభుత్వంపై అక్కసు వెళ్లగక్కింది. జీఎస్టీ రెండు రకాలు! ఒకటి... స్థూల జీఎస్టీ. రెండోది... నికర జీఎస్టీ. వీటిలో నికర జీఎస్టీని మాత్రమే వృద్ధికి ప్రామాణికంగా తీసుకుంటారు. ఎందుకంటే... స్థూల వసూళ్ల నుంచి ఐజీఎస్టీని కేంద్రం విసహాయిస్తుంది. ఐజీఎస్టీ అంటే... అంతర్రాష్ట్ర సరుకు రవాణాపై విధించే పన్ను! దీనిని కేంద్రం సంబంధిత రాష్ట్రాలకు నిష్పత్తి ప్రకారం పంచుతుంది. అంటే... మన రాష్ట్రంలో వసూలైన పన్నుల్లో కొంత ఇతర రాష్ట్రాలకు వెళ్తుంది. అలాగే, ఇతర రాష్ట్రాల్లో వసూలైన పన్నుల్లో మనకూ వాటా లభిస్తుంది. ఈ లెక్కలను కేంద్రమే తేల్చి..ఆయా రాష్ట్రాల మధ్య పంపిణీ చేస్తుంది. దీనినే ఐజీఎస్టీ సెటిల్‌మెంట్ అంటారు. ఈ సెటిల్‌మెంట్ తర్వాత వచ్చేదే... నికర జీఎస్టీ. అది మాత్రమే రాష్ట్రానికి సంబంధించిన సొంత ఆదాయం. కానీ... జగన్ రోత పత్రికలో కొత్తగా ఎస్జీఎస్టీ సెటిల్‌మెంట్ అని రాసుకొచ్చారు. ఐజీఎస్టీకి, ఎస్‌జీఎస్టీకి తేడా తెలీకుండా రాశారు. ఈ ఏడాది మే నెలలో జీఎస్టీ 2.23 శాతం తగ్గి రూ.3803 కోట్లకు క్షీణించినట్లు జగన్ పత్రిక పేర్కొంది. నిజానికి... ఇవి ఆ నెలకు సంబంధించిన స్థూల వసూళ్లు. ఐజీఎస్టీ సెటిల్‌మెంట్ తర్వాత నికర జీఎస్టీ రూ.2714 కోట్లు వచ్చింది. అదే గత ఏడాది ఐజీఎస్టీ సెటిల్‌మెంట్ తర్వాత రూ.2597 కోట్ల నికర జీఎస్టీ వచ్చింది. అంటే... గత ఏడాదికంటే ఈ సారి నికర జీఎస్టీ 4.49% పెరిగింది. ఇది నిజం! జగన్ పత్రిక చెప్పినట్లుగా జీఎస్టీ నేలచూపులు చూడటం అబద్ధం!

ప్రజా సమస్యల పరిష్కారమే ఆంధ్రజ్యోతి అజెండా



- ఇందుకోసమే 'అక్షరం అండగా' కార్యక్రమానికి రూపకల్పన చేశాం
- గాజువాక సభలో 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్య
- 'ఆంధ్రజ్యోతి' చొరవతో తిరుమలనగర్‌లో కాలుష్య, పలు సమస్యలు పరిష్కరించినట్టు వెల్లడి
- మిగిలిన సమస్యల పరిష్కారానికీ కృషి: పల్లా



విశాఖ తిరుమలనగర్‌లో జరిగిన 'అక్షరం అండగా, పరిష్కారమే అజెండాగా...' సభలో ప్రసంగిస్తున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు. వేదికపై 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్య, కార్పొరేటర్ బొండా జగన్, జిలా కమిషనర్ కిశోర్, ఏసీపీ త్రినాథ్, 'ఆంధ్రజ్యోతి' సర్క్యులేషన్ డైరెక్టర్ కె.రామకృష్ణారావు తదితరులు

విశాఖపట్నం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారమే అజెండాగా 'ఆంధ్రజ్యోతి' ముందుకు సాగుతుందని సంస్థ డైరెక్టర్ వేమూరి ఆదిత్య అన్నారు. సోమవారం విశాఖపట్నం జిల్లా గాజువాక నియోజకవర్గ పరిధిలోని తిరుమల నగర్ ఆర్య వైశ్య సామాజిక భవన్‌లో 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదిత్య మాట్లాడారు. పత్రికలు చాలా వరకూ ప్రజల సమస్యలను పాలకుల దృష్టికి తీసుకువెళ్లడం వరకే పరిమితమవుతాయని, 'ఆంధ్రజ్యోతి' మాత్రం అక్కడితో సరిపెట్టుకోకుండా అవి పరిష్కారమయ్యేలా చూడాలనే ఉద్దేశం, లక్ష్యంతో 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమానికి రూపకల్పన చేసినట్టు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు నిర్వహించి ప్రజల సమస్యలను అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి నేరుగా తీసుకువెళ్లే అవకాశం కల్పిస్తున్నామన్నారు. అందులో భాగంగానే ఈ ఏడాది జనవరి 28న తిరుమల నగర్‌లో సదస్సు నిర్వహించామన్నారు. ఆ సదస్సులో స్థానికులు తమ సమస్యలు చెప్పారని, అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. ఆ సమస్యల జాబితా తయారు చేసుకుని వాటి పరిష్కారానికి 'ఆంధ్రజ్యోతి' చొరవ తీసుకుందని చెప్పారు. ఆ రోజు సదస్సులో ప్రజలు లేవనెత్తిన సమస్యల్లో దాదాపు 80 శాతం పరిష్కారమయ్యాయని, మిగిలినవాటి పరిష్కారం కూడా పురోగతిలో ఉందని వివరించారు. ప్రధానంగా అనధికార డంపింగ్ యార్డు మూతపడిందని తెలిపారు. లోఓల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారన్నారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. తిరుమల నగర్‌కు ఆర్టీసీ కొత్త బస్సు ఏర్పాటు చేసిందని చెప్పారు. ఈ ప్రాంత సమస్యల పరిష్కారానికి సహాయ సహకారాలు అందించిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, 87వ డివిజన్ కార్పొరేటర్ బొండా జగన్, ఏపీఐఐసీ జిలా కమిషనర్ అయినవిల్లి కిశోర్, సౌత్ సబ్‌డివిజన్ ఏసీపీ టి.త్రినాథ్, ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు, ఏపీఈపీడీసీఎల్ ఏఈ వీర్రాజు, రెవెన్యూ అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు స్టీల్ ప్లాంటు డిపో నుంచి తిరుమల నగర్ మీదుగా దువ్వాడ రైల్వేస్టేషన్‌కు బస్సు సర్వీస్‌ను పల్లాతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. బస్సు ఎక్కి టికెట్ తీసుకుని కొంతదూరం ప్రయాణించారు. కార్యక్రమంలో సర్క్యులేషన్ డైరెక్టర్ టి.రామకృష్ణారావు, బ్రాంచ్ మేనేజర్ కె.రామకృష్ణారావు పాల్గొన్నారు.

సమష్టిగా పనిచేయాలి: పల్లా

'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' సదస్సులో తిరుమల నగర్ వాసులు లేవనెత్తిన సమస్యలన్నీ పరిష్కరించేందుకు కృషి చేస్తానని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. ప్రజలు లేవనెత్తిన ప్రధాన సమస్యలను 'ఆంధ్రజ్యోతి' చొరవతో సంబంధిత శాఖల అధికారులు పరిష్కరించారన్నారు. మిగిలిన సమస్యలను కూడా పరిష్కారిస్తానన్నారు. ప్రజా సమస్యలను గుర్తించి అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకురావడమే కాకుండా.. అవి పరిష్కారమయ్యే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసిన 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్య సామాజిక స్పృహ అభినందనీయమన్నారు. సమాజంలో ఏ సమస్య పరిష్కారం కావాలన్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా పనిచేయాలని, 'ఆంధ్రజ్యోతి' ప్రారంభించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా'తో అది సులభమవుతుందని అభిప్రాయపడ్డారు. సమాజం పట్ల వేమూరి ఆదిత్యకు ఉన్న అవగాహన తనను ఆకట్టుకుందన్నారు.



ఏఐ హ్యాకథాన్ వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న డీజీపీ హరీశ్

'ఏఐ'తో పోలీసింగ్‌లో విప్లవాత్మక మార్పులు!

- ఈనెల 27 నుంచి 29 వరకు 'ఏఐ హ్యాకథాన్'
- డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వెల్లడి

అమరావతి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మరింత నాణ్యమైన పోలీసు సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా పేర్కొన్నారు. ఏఐ సాంకేతికతను అందిపుచ్చుకుని పోలీసుల పనితీరులో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. జనరేటివ్ ఏఐ, ఏజెంటిక్ ఏఐ ద్వారా సమస్యల్ని అధిగమించి సేవల్లో నాణ్యత పెంచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. అందులో భాగంగా ఈనెల 27న సీఎం చేతుల మీదుగా గుంటూరులోని ఆర్.వి.ఆర్ అండ్ జె.సి ఇంజనీరింగ్ కళాశాలలో 'ఏఐ హ్యాకథాన్' ప్రారంభిస్తున్నామని, ఇది 29 వరకు జరుగుతుందని పేర్కొన్నారు. హ్యాకథాన్‌కు సంబంధించిన వెబ్‌సైట్ https://ai4andhrapolice.-com, లోగోను డీజీపీ సోమవారం మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుల అవసరాల కోసం అధునాతన ఏఐ ప్రాజెక్టుల్ని ఆహ్వానిస్తున్నామని అన్నారు. హ్యాకథాన్‌కు అన్ని రాష్ట్రాల నుంచి ప్రముఖ ఐటీ కంపెనీలు, ఏఐ స్టార్టప్‌లు, ఐటీ అండ్ జనరేటివ్ ఏఐ ప్రొఫెషనల్స్, ఇంజనీరింగ్ విద్యార్థులకు ఆహ్వానం పలుకుతున్నామని తెలిపారు. అధునాతన సాంకేతికత సమర్థ వినియోగం, విచారణలో కచ్చితత్వంతోపాటు నాణ్యత, పోలీసులకు కాలానుగుణంగా ఎదురవుతోన్న సవాళ్ల పరిష్కారానికి సహకారం అందించాలని కోరారు.

మన జోనే 'టాప్'!

- ఏపీకి చెందిన రుత్విక్‌సాయికి 18వ ర్యాంకు
- ప్రతిభ చాటిన విజయనగరం, సిక్కోలు విద్యార్థులు

హైదరాబాద్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)ల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు విడుదలయ్యాయి. పరీక్ష నిర్వాహక సంస్థ ఐఐటీ కాన్పూర్ సోమవారం ఈ ఫలితాలను విడుదల చేసింది. జాతీయ ర్యాంకులతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న 23 ఐఐటీలను 7 జోన్లుగా విభజించి, జోన్ల వారీగా ఫలితాలను ప్రకటించారు. జాతీయస్థాయిలో ఢిల్లీకి చెందిన విద్యార్థి రజిత్ గుప్తా 360 మార్కులకు గాను 332 మార్కులతో ప్రథమ ర్యాంకు సాధించారు. 332 మార్కులతో ఢిల్లీకి చెందిన సక్షం జిందాల్ ద్వితీయ, 330 మార్కులతో ముంబైకి చెందిన మాజిద్ హుస్సేన్ తృతీయ స్థానంలో నిలిచారు. హైదరాబాద్‌కు చెందిన అర్ణవ్ సింగ్ 319 మార్కులతో 9వ ర్యాంకు; 317 మార్కులతో వడ్లమూడి లోకేశ్ 10వ ర్యాంకు సాధించి సత్తా చాటారు. ఈ పరీక్షకు 116 మంది విదేశీ అభ్యర్థులు కూడా హాజరయ్యారు. వారిలో 13 మంది అర్హత సాధించారు. కాగా ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాలను చదివి, మాక్ టెస్ట్ పేపర్లను జాగ్రత్తగా విశ్లేషించడం ద్వారా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో విజయం సాధించామని ప్రథమ, రెండో ర్యాంకర్లు రజిత్ గుప్తా, సక్షం జిందాల్ తెలిపారు. జనరల్ ఈడబ్ల్యూఎస్ విభాగంలో హైదరాబాద్ విద్యార్థి వంగాల అజయ్‌రెడ్డి జాతీయస్థాయిలో 1వ స్థానంలో నిలిచాడు.

హైదరాబాద్ టాప్..

అత్యధికంగా అర్హత సాధించిన జోన్లలో హైదరాబాద్ అగ్రస్థానంలో నిలిచింది. ఐఐటీ హైదరాబాద్ జోన్ నుంచి మొత్తం 12,946 మంది విద్యార్థులు అర్హత సాధించారు. హైదరాబాద్ జోన్‌లో ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కేరళ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి ఉన్నాయి. ఇక, 11,370 మందితో ఢిల్లీ జోన్, 11,226 మందితో ముంబై జోన్ వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. దేశవ్యాప్తంగా మొత్తం 1,80,422 మంది పరీక్షకు హాజరుకాగా.. 54,378(30.13శాతం) మంది అర్హత సాధించారు. హైదరాబాద్ జోన్ నుంచి టాప్-10లో ఇద్దరు విద్యార్థులు ఉండగా, టాప్-100లో 23, టాప్-200లో 57, టాప్-300లో 78, టాప్-400లో 116, టాప్- 500లో 139 మంది ర్యాంకులు సాధించారు. జేఈఈకి దేశవ్యాప్తంగా 14,75,103 మంది హాజరయ్యారు. చివరికి అర్హత సాధించింది కేవ లం 54,378 మా త్రమే. అంటే మొత్తం అభ్యర్థుల్లో కేవలం 3.68% విద్యార్థులే అర్హత సాధించారు.



జ్ఞాన రుత్విక్ సాయితో తండ్రి శంకర్‌నారాయణ

9,404 మంది విద్యార్థినుల అర్హత

జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకు 54,378 మంది అర్హత సాధించగా.. వీరిలో 9,404 మంది విద్యార్థినులు ఉన్నారు. ఖరగ్‌పూర్ జోన్‌కు చెందిన దేవదత్త మాఝీ జాతీయస్థాయిలో 16వ ర్యాంకు సాధించి బాలికల్లో టాపర్‌గా నిలిచారు. హైదరాబాద్ జోన్‌లో కోరికాన రసజ్ఞ టాపర్‌గా నిలిచారు. ఈమె జాతీయ స్థాయిలో 78వ ర్యాంకు సాధించారు. కాగా, మొత్తం అర్హత సాధించిన 54,378 విద్యార్థుల్లో జనరల్ విభాగంలో అత్యధికంగా 17273 మంది ఉన్నారు.



భరత్‌చంద్ర

మన్యం బిడ్డకు 21వ ర్యాంకు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో మన్యం బిడ్డ మెరుపులు కురిపించాడు. పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం గుణానుపురం గ్రామానికి చెందిన పల్ల భరత్‌చంద్ర ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 21వ ర్యాంకు, ఓబీసీ కోటాలో 2వ ర్యాంకు సాధించాడు. జేఈఈ మెయిన్స్-2025లో ఆలిండియా 121వ ర్యాంకు, ఓబీసీ కోటాలో 17వ ర్యాంకు పొందాడు. ఐఐటీ-ముంబైలో కంప్యూటర్ సైన్స్ చేయడం తన లక్ష్యమని భరత్‌చంద్ర తెలిపాడు. కాగా, భరత్‌చంద్ర తండ్రి రామకృష్ణ విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలంలోని మెరైన్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు.

జేఈఈ 'విజయ'నగరం!

విజయనగరం జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. బొబ్బిలికి చెందిన ఆనంద చక్రవర్తి ఆలిండియా స్థాయిలో 118వ ర్యాంక్ సాధించాడు. రామభద్రపురం మండలం ఆరికతోట గ్రామానికి చెందిన జాగాన యోగేశ్వర్ 284వ ర్యాంకు సాధించాడు. బొబ్బిలి నాయుడు కాలనీకి చెందిన పొట్నూరు కార్తీక్ ఆలిండియా స్థాయిలో 419వ ర్యాంకు సాధించాడు. మెంటాడ మండలం పిట్టాడ గ్రామానికి చెందిన రొంగళి కార్తీక్ ఆల్ ఇండియా 526వ ర్యాంక్ పొందారు. రేగిడి మండలం కందిశకి చెందిన మీసాల పవన్‌కుమార్‌నాయుడు 750వ ర్యాంకు సాధించారు. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండలోని వడమ కాలనీలో నివాసం ఉంటున్న కొరికాన రసజ్ఞకు జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఆల్ ఇండియా 78 ర్యాంకు దక్కింది. గరుగుబిల్లి మండలం గొట్టివలసకు చెందిన బోను చాణక్య ఓపెన్ కేటగిరీలో 550 ర్యాంకు, పార్వతీపురం పట్టణానికి చెందిన ద్వారపురెడ్డి బలరాంనాయుడు ఓపెన్‌లో 633వ ర్యాంకు సాధించారు.

సిక్కోలు విద్యార్థికి 18వ ర్యాంకు

శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం దేవాది గ్రామానికి చెందిన ధర్మాన జ్ఞాన రుత్విక్ సాయి.. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జాతీయస్థాయిలో ప్రతిభ చూపారు. 360 మార్కులకుగాను 310 మార్కులు సాధించి జాతీయస్థాయి ఓపెన్ కేటగిరీలో 18వ ర్యాంకు, ఓబీసీ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచారు. రుత్విక్‌సాయి తల్లిదండ్రులిద్దరూ ఉపాధ్యాయులే. కాగా, ఐఏఎస్ కావాలన్నదే తన లక్ష్యమని జ్ఞాన రుత్విక్‌సాయి తెలిపారు.

మరి కొందరికి కూడా..: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లకు చెందిన విక్రమరాజా ఓపెన్ కేటగిరీలో 216వ ర్యాంకు, ఓబీసీలో 30వ ర్యాంకు పొందారు. పొందూరు మండలానికి చెందిన పైడి వెంకట శ్రీవినయ్.. జాతీయస్థాయిలో 334వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 50వ ర్యాంకు సాధించారు.

'డీఎస్సీ'పై జోక్యం చేసుకోం!

- ఈ దశలో 'స్టే' విధించలేం
- అలా చేస్తే.. ఉద్యోగార్థుల ప్రయోజనాలకు తీవ్ర నష్టం
- స్పష్టం చేసిన హైకోర్టు

అమరావతి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): 'మెగా డీఎస్సీ'ని నిలిపివేయాలని కోరుతూ దాఖలైన అనుబంధ పిటిషన్లలో జోక్యం చేసుకోబమని హైకోర్టు స్పష్టం చేసింది. పరీక్షలను నిలుపుదల చేసేందుకు సహేతుక కారణాలు కనిపించడం లేదని పేర్కొంది. ఉద్యోగార్థుల విస్తృత ప్రయోజనాల దృష్ట్యా పరీక్షల నిర్వహణపై స్టే విధించలేమని తెలిపింది. ఇప్పటికే హాల్ టికెట్లు జారీ చేశారని, పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయని పేర్కొంది. ప్రస్తుత పిటిషన్ల ఆధారంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తే ఉద్యోగార్థుల ప్రయోజనం ప్రమాదంలో పడుతుందని తెలిపింది. ఉద్యోగాల భర్తీ విషయంలో విధానపరమైన నిర్ణయం తీసుకొనే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందని స్పష్టం చేసింది. డీఎస్సీ నోటిఫికేషన్ ఆధారంగా ఈ నెల 6 నుంచి నిర్వహించనున్న పరీక్షలను నిలుపుదల చేయాలని కోరుతూ దాఖలైన అన్ని అనుబంధ పిటిషన్లను కొట్టివేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కుంచం మహేశ్వరరావు సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు.



ఇవీ పిటిషన్లు..

1 కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన వి. సాంబశివరావు సహా నలుగురు పిటిషన్లు దాఖలు చేశారు. సీబీఎస్ఈ 10వ తరగతిలో తెలుగు సెకండ్ లాంగ్వేజ్‌గా ఎంచుకున్నామని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌లో టీచర్ పోస్టుల భర్తీకి మొదటి భాషగా తెలుగు చదివి ఉండాలని పేర్కొందని, ఈ కారణంతో తమ దరఖాస్తులను తిరస్కరిస్తున్నారని పేర్కొన్నారు. సీబీఎస్ఈ చదివే విద్యార్థులకు మొదటి భాషగా ఆంగ్లం ఉంటుందని తెలిపారు. తమ దరఖాస్తులను పరిగణనలోకి తీసుకుని, డీఎస్సీ పరీక్షలు రాసేందుకు అనుమతించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు.

1 ప్రభుత్వం 2011లో జీవో 51కి అనుగుణంగా విద్యా సంవత్సరంలో రెండుసార్లు ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) నిర్వహించకుండా స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడాన్ని చట్టవిరుద్ధమైన చర్యగా ప్రకటించాలని కోరుతూ విజయనగరంజిల్లాకు చెందిన ఎం. షరీఫ్ సహా ఆరుగురు హైకోర్టులో పిటిషన్లు వేశారు. బీఈడీ, డీఈడీ చివరి సంవత్సరం చదువుతున్నవారిని డీఎస్సీ పరీక్షలకు అనుమతించాలని కోరారు. పరీక్షకు సిద్ధమయ్యేందుకు కనీసం 90 రోజులు గడువు ఉండేలా నోటిఫికేషన్‌ను రీషెడ్యూల్ చేసేలా అధికారులను ఆదేశించాలని అభ్యర్థించారు. ప్రస్తుత నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కోరారు.

కొన్ని పోస్టులకే అలా..

ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్. ప్రణతి వాదనలు వినిపిస్తూ.. నిర్దిష్ట పోస్టులు తప్ప మిగిలిన పోస్టులకు సీబీఎస్ఈలో మొదటి భాష ఆంగ్లం చదివినవారు కూడా అర్హులేనని తెలిపారు. వయోపరిమితి పెంచాలని కోరుతున్న పిటిషనర్లకు 2024 నోటిఫికేషన్ నాటికే అర్హత లేదన్నారు. ఏడాదికి రెండుసార్లు 'టెట్' నిర్వహించాల్సిన అవసరం లేదని తెలిపారు. దీనిపై 2021, మార్చిలో సవరణ జీవో ఇచ్చారన్నారు. 2024, నవంబరు నుంచి డీఎస్సీ-2025 సిలబస్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని, పరీక్షకు సిద్ధమయ్యేందుకు తగినంత సమయం ఇచ్చామని వివరించారు. 90 రోజుల సమయం ఇవ్వాలనే నిబంధన ఏమీ లేదన్నారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. ఏడాదికి ఒకసారి టెట్ నిర్వహిస్తే సరిపోతుందని 2021, మార్చి 17న ప్రభుత్వం జీవో ఇచ్చిందని తెలిపారు. పరీక్షకు 90 రోజుల గడువు ఇవ్వాలనే హక్కు పిటిషనర్లకు లేదన్నారు.

జగన్‌రెడ్డీ... ఉర్సాపై ఆరోపణలు నిరూపించు లేదా క్షమాపణ చెప్పు

» నిరూపిస్తే మంత్రి పదవికి రాజీనామా: మంత్రి లోకేశ్



అమరావతి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): 'ఉర్సా కంపెనీకి విశాఖలో ఎకరా రూపాయికే భూమి కేటాయించామన్న మాజీ సీఎం జగన్ తన ఆరోపణలను నిరూపించాలి. లేకపోతే యువతకు క్షమాపణ చెప్పాలి' అని మంత్రి లోకేశ్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 'జగన్ ఆరోపణలు నిరూపిస్తే నేను నా మంత్రి పదవికి రాజీనామా చేస్తా. ఐదేళ్ల వైసీపీ విధ్వంస పాలనలో ఒక్క కంపెనీ తీసుకురాకపోగా ఉన్న కంపెనీలను ఇతర రాష్ట్రాలకు తరిమేశారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా మేం కంపెనీలను ఆహ్వానిస్తూ, పెట్టుబడులను తీసుకొస్తుంటే తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదు. రాష్ట్ర యువతకు మంచి ఉద్యోగాలు వస్తుంటే చూసి జగన్ తట్టుకోలేకపోతున్నారు. ఈనో వాడితే కాస్త రిలీఫ్ వస్తుంది' అని లోకేశ్ ఎద్దేవా చేశారు.

ఎస్సీ హక్కుల పరిరక్షణే లక్ష్యం

» ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్



ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న కేఎస్ జవహర్

అమరావతి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ కోసం తన శాయశక్తులా కృషి చేస్తానని ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ అన్నారు. ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లోని ఎస్సీ కమిషన్ కార్యాలయంలో సోమవారం ఆయన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు చైర్మన్‌గా అవకాశం కల్పించిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కూటమి పాలనలో దళితులందరూ ఎంతో సంతోషంగా ఉన్నారని, అందుకు ప్రభుత్వం అనుసరిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే కారణమని చెప్పారు. ఎస్సీల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు. ఆర్టీసీ మాజీ చైర్మన్ వర్ల రామయ్య, ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, ఎమ్మెస్ రాజు, బూర్ల రామాంజనేయులు, ఎమ్మెల్సీ అలపాటి రాజా... జవహర్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ బత్తుల జీవనపుత్రకుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, తంగిరాల సౌమ్య, వేగుళ్ల జోగేశ్వరరావు, పితాని సత్యనారాయణ, శాప్ చైర్మన్ రవినాయుడు తదితరులు పాల్గొన్నారు.

హస్తకళాకారుల ఉన్నతికి కృషి చేస్తా..

» లేపాక్షి చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్



బాధ్యతలు స్వీకరిస్తున్న పసుపులేటి హరిప్రసాద్

విజయవాడ (గాంధీనగర్), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రధానీ నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు స్ఫూర్తితో హస్తకళాకారుల ఉన్నతికి తనవంతు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ (లేపాక్షి) చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ అన్నారు. విజయవాడలోని సంస్థ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హస్తకళలపై ఎంతో మక్కువ కలిగిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తనకు ఈ అవకాశం కల్పించడం తన బాధ్యతలను మరింత పెంచినట్లయిందన్నారు. లేపాక్షి శాఖలను విస్తరించి తద్వారా విక్రయాలు పెరిగేలా కృషి చేస్తానన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. హరిప్రసాద్ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, ఆరణి శ్రీనివాసులు, బొలిశెట్టి శ్రీనివాసులు, జనసేన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను తదితరులు పాల్గొన్నారు.

తెలుగువారు సమున్నతంగా ఎదగాలి

» తెలంగాణ అన్ని రంగాల్లో దూసుకెళ్లాలి

» ప్రజలకు చంద్రబాబు, పవన్ కల్యాణ్, షర్మిల శుభాకాంక్షలు

అమరావతి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రాలుగా వేరైనా తెలుగు ప్రజలు, తెలుగు జాతి ఒక్కటే. తెలుగువారు ఎక్కడున్నా సమున్నతంగా ఎదగాలన్నదే నా ఆలోచన' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర 11వ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఎక్స్‌లో ఆయన పోస్టు చేశారు. 'జనసేన పార్టీకి జన్మనిచ్చిన నేల, నాకు పునర్జన్మను ఇచ్చిన నేల, నాలో ఉద్యమ స్ఫూర్తిని నింపిన నేల, నా తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ దాశరథి కృష్ణమాచార్య కీర్తించిన నేల నా తెలంగాణ' అని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఎక్స్‌లో స్పందిస్తూ... "తెలంగాణ రాష్ట్రంలో 'హస్తమే' అభయ హస్తమై ప్రజా పాలన అందిస్తోంది." అని పేర్కొన్నారు.

గుకేశ్‌కు అభినందనలు: సీఎం

అమరావతి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మన దేశానికి చెందిన చెస్ క్రీడాకారుడు గుకేశ్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ సీఎం చంద్రబాబు ఎక్స్‌లో స్పందించారు. నార్వే చెస్ 2025లో ప్రపంచ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సెన్‌ను ఓడించి చరిత్రాత్మక విజయాన్ని సాధించినందుకు గుకేశ్‌కు సీఎం చంద్రబాబు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

ప్రమాదాల్లో కార్యకర్తల్ని కోల్పోవడం బాధాకరం

» బీమాతో ఆర్థిక భరోసాను అందించడం తృప్తినిస్తోంది: ఎమ్మెల్సీ నాగబాబు



'సుపరిపాలన మొదలై ఏడాది' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జనసేన ఎమ్మెల్సీ నాగబాబు, చిల్లపల్లి శ్రీనివాస్, హరిప్రసాద్

అమరావతి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): 'సామాజిక కార్యక్రమాల్లో, పార్టీ వ్యవహారాల్లో క్రియాశీలకంగా పని చేసే కార్యకర్తలు ఊహించని ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోవడం తీవ్ర బాధను కలిగిస్తుంది. ప్రాణా లు తీసుకురాలేం. కానీ మరణించిన వారి కుటుంబాలకు ప్రమాద బీమా ద్వారా ఆర్థిక భరోసా అందించడం కాసింత తృప్తిగా అనిపిస్తుంది' అని ఎమ్మెల్సీ, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు అన్నారు. రాష్ట్రంలో వివిధ ప్రమాదాల్లో మృతి చెందిన జనసేన పార్టీ కార్యకర్తల కుటుంబాలకు సోమవారం మంగళగిరిలో ఆయన బీమా చెక్కులను అందించారు. 'అధినేత పవన్ కల్యాణ్ కార్యకర్తల బాగు కోసమే ప్రథమంగా ఆలోచిస్తారు. ప్రమాద బీమా కొరకు రూ.కోట్లు తన వ్యక్తిగత సంపాదన వెచ్చిస్తున్నారు. ఈ రోజు దాదాపు 101 మంది కార్యకర్తలకు రూ.5.05 కోట్ల ప్రమాద బీమా చెక్కులను అందించాం' అని నాగబాబు తెలిపారు. ఇప్పటి వరకూ రూ.30 కోట్ల ప్రమాద బీమాను అందించామని ఎమ్మెల్సీ హరిప్రసాద్ తెలిపారు. ఈ నెల 4న పార్టీ రూపొందించిన 'పీడ విరగడై ఏడాది - సుపరిపాలన మొదలై ఏడాది' కార్యక్రమాన్ని జనసేన శ్రేణులంతా ఘనంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, షేక్ రియాజ్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

అమరావతి విమానాశ్రయానికి భూసమీకరణ!

» మొత్తం 40 వేల ఎకరాలు సేకరించాలి

» ల్యాండ్ పూలింగ్‌కే రైతుల మొగ్గు

» కార్యాలయాలన్నీ ఒకేచోట ఉండేలా టవర్ల నిర్మాణం

» అమరావతిపై మాట్లాడే హక్కు జగన్‌కు లేదు

» చీఫ్ ఇంజనీర్ల కమిటీ నిర్ణయం మేరకే రాజధాని నిర్మాణాల ధరలు ఖరారు: మంత్రి

స్పోర్ట్స్ సిటీ, స్మార్ట్ ఇండస్ట్రీకి కూడా: మంత్రి నారాయణ

ఈ మూడింటికీ 10 వేల ఎకరాలు కావాలి



సీఆర్డీఏపై అధికారులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు, పాల్గొన్న మంత్రులు నారాయణ, కేశవ్, అధికారులు

అమరావతి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి రెండో దశలో 40 వేల ఎకరాలు సేకరించాల్సి ఉందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు తరహాలో అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి 5 వేల ఎకరాలు, స్మార్ట్ ఇండస్ట్రీస్ కోసం 2,500 ఎకరాలు, అంతర్జాతీయ క్రీడా నగరానికి ఇంకో 2,500 ఎకరాలు.. వెరసి 10 వేల ఎకరాలు కావాలని తెలిపారు. ఈ మూడింటికీ ఇప్పటికే భూ సమీకరణ చేసిన 34 వేల ఎకరాలు సరిపోవన్నారు. వీటికి కావలసిన భూమిని.. భూసేకరణ చేయాలా లేక భూసమీకరణ (ల్యాండ్ పూలింగ్) ద్వారా తీసుకోవాలా అనే అంశంపై గ్రామ సభలు నిర్వహిస్తూ రైతుల అభిప్రాయాలను సేకరిస్తున్నామని తెలిపారు. వారు భూసమీకరణకే మొగ్గు చూపుతున్నారని.. ఇప్పటికే దాదాపు 24 వేల ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్ ద్వారా ఇచ్చేందుకు పలువురు ముందుకొచ్చారని చెప్పారు. సోమవారం అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో జరిగిన సీఆర్‌డీఏ 48వ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి విలేకరులకు తెలియజేశారు. ప్రభుత్వానికి కావలసిన 10 వేల ఎకరాలకు గాను రైతుల నుంచి దాదాపు 40 వేల ఎకరాలను ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించాల్సి ఉంటుందని, వారికి రిటర్నబుల్ ప్లాట్లు ఇవ్వడానికి, ఇతరత్రా అవసరాలకు భూమి కావాలని గుర్తుచేశారు. ఇప్పటికే అమల్లో ఉన్న ల్యాండ్ పూలింగ్ చట్టంలోని నియమ నిబంధనల మేరకు 217 చదరపు కిలోమీటర్ల వరకే అనుమతి ఉందని, ఈ పరిధిని మరింత పెంచేందుకు అథారిటీ సమావేశంలో ఆమోదం తెలిపినట్లు చెప్పారు. పెట్టుబడిదారులు అమరావతికి రావాలంటే 5 వేల ఎకరాలతో అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు అవసరమని తెలిపారు. రాజధానిలో స్థాపించే విద్య, వైద్య సంస్థలకు ఎడ్యుకేషన్, రిజిస్ట్రేషన్ ఫీజులో సడలింపు ఇవ్వాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నామన్నారు. వచ్చే మూడేళ్లలో అమరావతి కోర్ క్యాపిటల్ ప్రాంతంలోని అన్ని నిర్మాణాలను పూర్తి చేస్తామని తెలిపారు. రెండో దశ భూసమీకరణ కూడా పూర్తి చేసి అభివృద్ధి చేస్తామన్నారు. కోర్ క్యాపిటల్ ఏరియాలో రూ.3.673 కోట్ల అంచనా వ్యయంతో ఐదు అడ్మినిస్ట్రేటివ్ టవర్ల నిర్మాణానికి ఎల్-1 టెండర్లను ఖరారు చేస్తూ సీఆర్‌డీఏ నిర్ణయం తీసుకుందని చెప్పారు. 'జీఏడీ టవర్లు 1,2,3,4 నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ పూర్తయింది. టెండర్లలో ఎల్-1గా నిలిచిన సంస్థలకు లెటర్ ఆఫ్ అగ్రిమెంట్ (ఎల్‌వోఏ) ఇచ్చేందుకు అథారిటీ ఆమోదం తెలిపింది. జీఏడీ టవర్ పనులను రూ.882 కోట్లకు ఎన్‌సీసీ సంస్థ, హెచ్‌వోడీ టవర్లు-1,2 టెండర్లను రూ.1,487 కోట్లకు షాపూర్జీ పల్లోంజీ సంస్థ, టవర్లు-3, 4 పనులను ఎల్ అండ్ టీ సంస్థ రూ.1,303 కోట్లతో దక్కించుకున్నాయి. మొత్తం రూ.3673.44 కోట్లతో ఆయా టవర్ల నిర్మాణ పనులను త్వరలోనే ఆయా సంస్థలు ప్రారంభిస్తాయి. ప్రజలు పలు చోట్లకు తిరగకుండా పాలన సౌలభ్యంగా ఉండేందుకు, పరిపాలనంతా ఒకే చోట జరిగే విధంగా ఈ ఐదు టవర్ల నిర్మాణం తలపెట్టాం. 2014-19 మధ్య కాలంలో రూపొందించిన డిజైన్ల ప్రకారమే పనులు కొనసాగుతాయి' అని స్పష్టం చేశారు.

జగన్ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు..

అమరావతిపై మాట్లాడే నైతిక హక్కు మాజీ సీఎం జగన్‌కు లేదని మంత్రి నారాయణ అన్నారు. నోటికొచ్చినట్లు మాట్లాడుతూ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రాజధాని కోసం 30 వేల ఎకరాలు కావాలని గతంలో అసెంబ్లీలో ప్రకటించిన జగన్ ఇప్పుడు మాట మార్చారు. అమరావతి నిర్మాణంలో టెండర్ల ధరలు పెంచారని అనవసర ఆరోపణలు చేస్తున్నారు. 22 మంది చీఫ్ ఇంజనీర్ల కమిటీ నిర్ణయించిన ప్రకారమే అమరావతి నిర్మాణాల ధరలను ఖరారు చేశాం.. ఇప్పటివరకు హడ్కో రూ.11 వేల కోట్ల రుణం మంజూరుచేసింది. ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) రూ.15 వేల కోట్లు ఇవ్వనున్నాయి. త్వరలో మరికొన్ని బ్యాంకుల ద్వారా రూ.5 వేల కోట్లు వస్తాయి.' అని తెలిపారు.

గ్లోబల్ టెక్ హబ్‌గా ఏపీ

నాస్కామ్ ప్రతినిధులతో చంద్రబాబు

అమరావతి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని గ్లోబల్ టెక్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు చేపట్టాల్సిన అంశాలపై నాస్కామ్ ప్రతినిధి బృందంతో సచివాలయంలో సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు చర్చించారు. 100కే టెక్ అప్రెంటీస్ ప్రోగ్రాం ద్వారా అవసరమైన లక్ష మంది నిపుణులను సమకూర్చుకోవడంపై వారితో సమాలోచనలు జరిపారు. ఈ వివరాలను సీఎం 'ఎక్స్'లో పంచుకున్నారు. 'ఆంధ్ర ఫర్ భారత్' కార్యక్రమంపై నాస్కామ్ ప్రతినిధులతో చర్చించినట్లు పేర్కొన్నారు. సీఎంతో భేటీ అయిన బృందంలో నాస్కామ్ అధ్యక్షుడు రాజేశ్ నంబియార్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ శ్రీనివాసన్ తదితరులు ఉన్నారు. కాగా, విశాఖ, తిరుపతిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డిస్ట్రిక్ట్ టెస్ట్ బెడ్ ఏర్పాటుకు నాస్కామ్ ప్రతిపాదన చేసింది. భూసంబంధిత అంశాలు, వైద్య ఆరోగ్య, విద్యారంగాల్లో ఓపెన్ ఏఐ ల్యాబ్‌లు ఏర్పాటు చేసి పౌరసేవలను అందించవచ్చని వెల్లడించింది. గ్రామీణ టెక్ సొల్యూషన్స్‌కు అవకాశం ఉందని పేర్కొంది.

కొల్లేరుకు మానవీయ పరిష్కారం

» సరస్సును పరిరక్షిస్తూనే స్థానికులకూ న్యాయం

» జిరాయితీ, డీపట్టా రైతుల హక్కులు కాపాడాలి

» ఎమ్మెల్యేలు, అధికారులతో చంద్రబాబు సమీక్ష

అమరావతి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి దోహదపడుతున్న కొల్లేరు సరస్సును పరిరక్షిస్తూనే, ఆ ప్రాంత ప్రజల సమస్యలనూ మానవీయ కోణంలో పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కొల్లేరుపై కోర్టు తీర్పులు, నిబంధనలు, కేంద్ర సంస్థల ఆదేశాలు, స్థానిక పరిస్థితులు, పర్యావరణం, కాంటూరు అంశాలపై ఆ ప్రాంత ఎమ్మెల్యేలు, అధికారులతో సోమవారం అమరావతి సచివాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కొల్లేరు సమస్యను సీఎం దృష్టికి ఎమ్మెల్యేలు తీసుకొచ్చారు. 'కొల్లేరు పరిధిలో మూడు లక్షల మంది ఉన్నారు. కొల్లేరు కాంటూరు పరిధి అంశంలో చాలాకాలంగా వీరు సమస్యలు ఎదుర్కొంటున్నారు. వారి సమస్య పరిష్కారం కోసం 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం చాలా ప్రయత్నాలు చేసింది. నేషనల్ వైల్డ్‌లైఫ్ బోర్డు 20వేల ఎకరాల జిరాయితీ, డీ పట్టా భూములను కొల్లేరు పరిధి నుంచి మినహాయించి, కొత్త సరిహద్దులు నిర్ధారించాలని 2018లో చెప్పింది. ఆ మేరకు సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీకి(సీఈసీ) సిఫారసు చేసింది. అయితే కొందరు అభ్యంతరాలు చెప్పడంతో రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయాన్ని కోరింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారానికి ఎటువంటి ప్రయత్నమూ చేయలేదు" అని వారు సీఎంకు తెలిపారు. ఉప్పుటేరులో ఆక్రమణలు తొలగించాలని, పూడికతీసి, ఆక్రమణలు తొలగించి, నీరు సముద్రంలోకి వెళ్లేలా చేయాలని సూచించారు. ఔట్‌లెట్లు పూర్తిగా క్లియర్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సీఎస్ విజయానంద్, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, పచ్చమట్ల ధర్మరాజు, చింతమనేని ప్రభాకర్, అధికారులు పాల్గొన్నారు.

5న కోటి మొక్కలు నాటాలి: సీఎం

రాష్ట్రంలో పచ్చదనాన్ని మరింత పెంచేందుకు ఈనెల 5న కోటి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని, కలెక్టర్లు, మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులంతా ఈకార్యక్రమంలో భాగస్వాములు కావాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. సోమవారం అమరావతి సచివాలయంలో ఈ అంశంపై సీఎం సమీక్ష నిర్వహించారు. విద్యాసంస్థలు, వైద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండులు, రహదారులకు ఇరువైపులా 'కోటి మొక్కల' కార్యక్రమంలో భాగంగా ప్లాంటేషన్ చేయాలని చంద్రబాబు ఆదేశించారు. కాగా, ఈనెల ఐదో తేదీన అమరావతిలోని అనంతవరంలో జరిగే వన మహోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాల్గొననున్నారు. ఈ కార్యక్రమం కోసం అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్) అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏడీసీఎల్ సీఎండీ లక్ష్మీ పార్థసారథి అనంతవరంలోని నర్సరీ, ఉద్యానవనాలను సోమవారం పరిశీలించారు. మొత్తం రెండు వేల మొక్కలు ఈ కార్యక్రమంలో భాగంగా నాటనున్నారు.

రెండు రోజుల్లో 34 లక్షల కుటుంబాలకు రేషన్ పంపిణీ

» దుకాణాల ప్రారంభంపై లబ్ధిదారుల హర్షం

» ప్రతి బియ్యం బస్తాపైనా క్యూఆర్ కోడ్

» రేషన్ అక్రమ రవాణాకు చెక్: మంత్రి నాదెండ్ల

అమరావతి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు క్యూఆర్ కోడ్‌తో అడ్డుకట్ట వేస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఇక నుంచి రేషన్ షాపులకు తరలించే ప్రతి బియ్యం బస్తాకూ క్యూఆర్ కోడ్ ఉంటుందని, దాని ఆధారంగా అక్రమ రవాణాను అరికట్టవచ్చన్నారు. త్వరలోనే అన్ని రేషన్ షాపుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రతి రేషన్ షాపు దగ్గర క్యూఆర్ కోడ్‌ను అందుబాటులో ఉంచామని, సరుకుల పంపిణీలోగాని, రేషన్ బియ్యం అక్రమ రవాణా అవుతున్నట్లుగాని ప్రజలు గుర్తిస్తే వెంటనే ఆ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. సోమవారం విజయవాడలోని పౌరసరఫరాల శాఖ భవన్‌లో మంత్రి మనోహర్ మీడియాతో మాట్లాడారు. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా చౌక ధరల దుకాణాల ద్వారా పండగ వాతావరణంలో రేషన్ సరుకుల పంపిణీని ప్రారంభించగా.. సోమవారం మధ్యాహ్నం 4 గంటల వరకు డీలర్లు 34.81 లక్షల కుటుంబాలకు సరుకులు అందించారని చెప్పారు. 15.74 లక్షల మంది దివ్యాంగులు, 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు వారి ఇళ్ల వద్దే రేషన్ సరుకులు అందించాలని డీలర్లను ఆదేశించినట్లు తెలిపారు. వారిలో 3,73,062 మందికి ఈ రెండు రోజుల్లోనే సరుకులు అందించారని పేర్కొన్నారు. అయితే, కొన్నిచోట్ల ఈ-పోస్‌లో సాంకేతిక సమస్యలు, సర్వర్లు మొరాయించడంతో సరుకుల పంపిణీకి అంతరాయం ఏర్పడుతోందని, ఈ సమస్యలను కూడా పరిష్కరిస్తామని చెప్పారు. చౌక ధరల దుకాణాల ద్వారా సరుకుల పంపిణీ తమకు ప్రయోజనకరంగా ఉన్నట్లు అన్ని జిల్లాల లబ్ధిదారుల నుంచి తమకు సమాచారం వచ్చినట్టు తెలిపారు. రేషన్ తీసుకోని కార్డుదారులకు డీబీటీ ద్వారా నగదు చెల్లించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని చెప్పారు. దీపం-2 పథకం కింద రెండో ఉచిత గ్యాస్ సిలిండర్లు బుక్ చేసుకున్న లబ్ధిదారులకు కొంతమందికి రాయితీ డబ్బులు జమ కాకపోవడానికి సాంకేతికపరమైన సమస్యలే కారణమని చెప్పారు. త్వరలోనే అందరికీ సబ్సిడీ సొమ్మును జమ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. మూడో విడత ఉచిత సిలిండర్‌కు సంబంధించిన రాయితీ సొమ్మును లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ముందుగానే జమ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

మార్చి నాటికి పేదల ఇళ్లు పూర్తి

» అధికారులకు మంత్రి కొలుసు నిర్దేశం

అమరావతి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న పేదల ఇళ్లను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తిచేయాలని గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అధికారులకు నిర్దేశించారు. సోమవారం ఆయన అన్ని జిల్లాల హౌసింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హౌసింగ్ ఏఈలు ప్రతిరోజూ లే అవుట్లను సందర్శించాలని ఆదేశించారు. గృహ నిర్మాణ సామగ్రిని లబ్ధిదారులకు అందుబాటులో ఉంచాలన్నారు. హౌసింగ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ ఎం. శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తీరానికి పచ్చతోరణం!

975 కిలోమీటర్ల మేర సముద్ర తీరంలో వనాలు

» ఉపాధి హామీ, అటవీ నిధులతో తీరం వెంబడి మొక్కల పెంపకం

» బాపట్ల జిల్లా నుంచి మొదలు

» ఎల్లుండి ప్రారంభించనున్న ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి



మచిలీపట్నంలో సముద్ర తీరానికి రక్షణగా ఉన్న మడ అడవులు

అమరావతి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కోస్తా తీరంలో పర్యావరణ పరిరక్షణకు, భూమి కోతను నిరోధించేందుకు, సునామీ, తుఫానుల బారి నుంచి రక్షించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నేతృత్వంలోని అటవీ, గ్రామీణాభివృద్ధిశాఖల ఆధ్వర్యంలో సముద్రతీర ప్రాంతంలో హరిత వనాన్ని(గ్రీన్ కారిడార్) ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. రాష్ట్రంలో 975 కిలో మీటర్ల మేర విస్తరించి ఉన్న సముద్రతీర ప్రాంతం వెంబడి పలు రకాల మొక్కలను పెంచునున్నారు. తద్వారా ప్రకృతి విపత్తుల నుంచి భూమిని, సముద్ర తీర గ్రామాలను రక్షించనున్నారు. ఈ నెల 5న 'ప్రపంచ పర్యావరణ దినోత్సవం' సందర్భంగా సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ బాపట్ల జిల్లాలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఐటీసీ భద్రాచలం సౌజన్యంతో బాపట్లలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. ఈ ప్రాజెక్టుకు అటవీ శాఖ ద్వారా మొక్కలు పంపిణీ చేసి, ఉపాధి హామీ శ్రామికులతో వాటిని పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా పలు రకాల మొక్కలు పెంచుకునే వెసులుబాటు ఉండటంతో ఈ పథకాన్ని సముద్ర తీర ప్రాంతంలో విరివిగా వినియోగించుకోవాలని నిర్ణయించారు. ప్రతి 10 కిలోమీటర్లకు ఒక నర్సరీని ఏర్పాటు చేసి మొక్కలు.. చెట్లుగా పెరిగే వరకు వాటిని సంరక్షించనున్నారు. ఈ మేరకు ఉపముఖ్యమంత్రి అటవీశాఖ, గ్రామీణాభివృద్ధిశాఖలను సంసిద్ధం చేశారు. దీనికి సంబంధించి అటవీశాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు ఈ ప్రాజెక్టును సమర్థవంతంగా చేపట్టేందుకు వ్యూహాలు రచించారు.

పర్యావరణ సమతుల్యత

మనరాష్ట్రానికి 975 కిలోమీటర్ల సముద్రతీర ప్రాంతం ఓ వరం. దీనిని సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా ప్రకృతి విపత్తులు, తుఫానులు, సునామీల నుంచి తప్పించుకునే అవకాశం ఉంటుందని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. అంతే కాదు.. పర్యావరణ సమతుల్యం కూడా సాధించవచ్చని భావిస్తున్నారు. ఈ వనాల ద్వారా ఇసుక కోత నిరోధించడం, తుఫానులు, సునామీ, ఆటుపోట్లును తట్టుకునేందుకు అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. మొక్కల పెంపకం ద్వారా కార్బన్ డై ఆక్సైడ్ పీల్చుకుని వాతావరణ సమతుల్యం సాధించవచ్చని పేర్కొంటున్నారు. కోస్తా ప్రాంతంలోని మడ అడవులను మరింత విస్తరించడం ద్వారా తీరమంతా పచ్చతోరణంగా మారుతుందని భావిస్తున్నారు. అదేవిధంగా చేపలు, పక్షులు, పలు సముద్ర ఆధారిత జీవులకు ఆశ్రయం కల్పించినట్లువుతుందని పేర్కొంటున్నారు. చేపలు పెరగడం ద్వారా మత్స్యకారుల జీవనాధారం మరింత మెరుగవుతుందని భావిస్తున్నారు. ఎకో టూరిజం పెరిగి స్థానికులకు జీవనోపాధి కలుగుతుందని అంచనా వేశారు. తీరం వెంబడి ఏ ప్రాంతానికి అనువైన మొక్కలను ఆ ప్రాంతంలో పెంచనున్నారు. ఈ మొక్కల పెంపకంలో ఆయా ప్రాంతాల్లోని ప్రజలను కూడా భాగస్వామం చేయనున్నారు.

ఖర్చు తక్కువ-ప్రయోజనం ఎక్కువ


ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన శాఖకు సంబంధించి తక్కువ నిధులతో ఎక్కువ ప్రయోజనం పొందేలా కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నారు. గ్రామ పంచాయతీలకు సంబంధించి తీసుకున్న పలు సంస్కరణలు కూడా ఈ కోవలోకి వస్తాయి. తాజాగా పర్యావరణ సమతుల్యం కోసం మొక్కలు నాటి వాటి ఫలాలు అందుకోవడం ద్వారా 975 కిలో మీటర్ల సముద్రతీర ప్రాంత వాసులకు జీవనోపాధిగా ఈ పథకాన్ని తీర్చిదిద్దనున్నారు. కేంద్రనిధులను వినియోగించుకుని పేదలకు జీవనోపాధి కల్పించే ఈ ప్రాజెక్టుకు అటవీ,గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు రూపకల్పన చేస్తున్నారు.

ప్రాంతానికి అనువుగా మొక్కలు

సముద్ర తీర ప్రాంతంలో ఉప్పునీరు కారణంగా మొక్కలు బతికే అవకాశం తక్కువ. అయితే, ఆయా ప్రాంతాల్లో సముద్ర వాతావరణాన్ని తట్టుకుని బతికే మడ, సరుగుడు, జీడిమామిడి, కొబ్బరి, కోకో, సముద్రపు గడ్డి తదితర మొక్కలు నాటాలని నిర్ణయించారు. 10 కిలోమీటర్లకు ఒక నర్సరీ ఏర్పాటు చేసి మొక్కలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటారు. ఏ గ్రామపరిధిలో ఆ గ్రామ ఉపాధి శ్రామికులు పనిచేసేలా అవకాశం కల్పిస్తారు.

రోడ్డు డైవర్షన్‌లో కాచుకున్న మృత్యువు!

ఆగి ఉన్న పాలవ్యాన్‌ను ఢీకొన్న కారు.. ఐదుగురు మృతి.. తూర్పుగోదావరి జిల్లాలో ఘటన



ఆగి ఉన్న పాలవ్యాన్‌ను ఢీకొన్న కారు

రంగంపేట/రాజమహేంద్రవరం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): రోడ్డు డైవర్షన్ వద్ద ఆగి ఉన్న పాలవ్యాన్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో ఐదుగురు మృతిచెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలంలో సోమవారం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. రాజానగరం మండలం దివాన్‌చెరువు పరిధిలోని రఘునాథపురం గ్రామానికి చెందిన రేలంగి శివన్నారాయణ,రాజమండ్రి రూరల్ మండలం పిడింగొయ్యి పంచాయతీ పరిధిలోని కవలగొయ్యికు చెందిన తీగిరెడ్డి శివ బావాబామ్మర్దులు. శివన్నారాయణకు కవల పిల్లలు వర్షిత, హర్షిత ఉన్నారు. వీరిద్దరికి ఆధార్ అప్‌డేట్ చేసుకోవడం కోసం గత కొద్ది రోజులుగా కాకినాడ కలెక్టరేట్‌కు వెళ్లి వస్తున్నా పనికాలేదు. ఈ క్రమంలో శివన్నారాయణ (40), ఆయన భార్య దేవిలలిత (34), వారి పిల్లలు వర్షిత (13), హర్షిత (13), ఆయన బావమరిది శివ (30), భార్య భవాని (26), కుమార్తె సాన్వి(4) అందరూ కలిసి సోమవారం కారులో మళ్లీ కాకినాడ వెళ్లారు. కాకినాడ బీచ్ వద్ద కాసేపు సరదాగా గడిపి, సాయంత్రం 5 గంటలకు తిరిగి ఇంటికి బయలుదేరారు. రాజానగరం-సామర్లకోట ఏడీబీ రోడ్డు విస్తరణలో భాగంగా రంగంపేట మండలం వడిశలేరు గ్రామం వద్ద ఒక డైవర్షన్ ఉంది. అక్కడే రోడ్డు పక్కన పాల వ్యాన్‌ను ఆపిన డ్రైవర్ పెట్రోల్ బంక్ వద్దకు మంచినీళ్లకు వెళ్లాడు. సుమారు 6 గంటల సమయంలో శివన్నారాయణ కారును వేగంగా నడుపుతూ.. డైవర్షన్ తీసుకునే సమయంలో అక్కడ ఆగి ఉన్న వ్యాన్‌ను ఢీకొట్టాడు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.


SR'S LEGACY CONTINUES!
When dedication meets direction, AIRs are just milestones.
JEE ADVANCED RESULTS-2025
50 YEARS OF BRILLIANCE
All India Rank 8 M.RAVI CHANDRA REDDY R.No. 256015010 (R)
Groomed by SR from School to College
All India Rank 13 V.NAGA SIDDHARTHA R.No. 256196129 (R)
All India Rank 40 P.SAKSHI R.No. 256159038 (R)
All India Rank 47 A.ANUSRI R.No. 256183009 (R)
All India Rank 68 BANAVATH SAI R.No. 256152005 (R)
Groomed by SR from School to College
All India Rank 90 Y.BHARANI SHANKAR R.No. 256196022 (R)
106 G.RAJESH R.No. 256165339 (R)
115 B.VINOD R.No. 256178179 (R)
123 M.VENKATA KOWSIK R.No. 256039003 (R)
204 S.PAVAN R.No. 256168251 (R)
265 A.SANTHOSH R.No. 256179171 (R)
269 B.VAAGDEVI R.No. 256199037 (R)
279 CH.ANSIKA R.No. 256200171 (R)
279 B.NIKHIL R.No. 256192046 (R)
376 G.MANJULA R.No. 256193140 (R)
389 B.GANESH R.No. 256195015 (R)
395 B.RAM CHARAN R.No. 256146476 (R)
438 J.RAJESH R.No. 256146400 (R)
452 D.NAVEEN R.No. 256196136 (R)
464 V.SWARAN NAIK R.No. 256175071 (R)
465 B.D.SHANMUKHA SREE R.No. 256182006 (R)
471 K.M.SATHWIK BHARATH R.No. 256019221 (R)
506 B.RAJENDER R.No. 256195150 (R)
555 K.SANJAY R.No. 256196074 (R)
566 K.GANESH R.No. 256145241 (R)
566 K.SUDHA RANI R.No. 256166596 (R)
567 L.VIGNESWAR R.No. 256014144 (R)
570 M.VENU R.No. 256176184 (R)
594 M.MAHESH NAIK R.No. 256022158 (R)
633 B.ARUN R.No. 256195192 (R)
662 T.TEJAS UDBHAV REDDY R.No. 256018041
698 M.AKHILESH R.No. 256170261 (R)
772 S.BHARGAV R.No. 256131239 (R)
784 MD.KAIF FARMAAN R.No. 256195286 (R)
839 CH.RUCHITH REDDY R.No. 256150019 (R)
867 J.ABHI RAM R.No. 256196108 (R)
886 C.KAMALA VARDHAN R.No. 256146186 (R)
LONG TERM JEE (MAIN & ADVANCED) ADMISSIONS ARE IN PROGRESS 2025-26
HYDERABAD: 8886322296, 9121307474, 9290684090, 8712612424, 8712612422, 8712604778, 8712612435, 8712612425, 8712612433 | WARANGAL: 9642117378 | VIJAYAWADA: 8142111302 | VIZAG: 9052222274, 9154854707 | GUNTUR: 9154854694 | TIRUPATI: 9154854699 | NELLORE: 9154854696 | ANANTHAPURM: 9154854691 | KURNOOL: 9154854695 | NIZAMABAD: 9642117110, 096421 15777 | SRIKAKULAM: 9154854697 | BHIMAVARAM: 9642223762, 7331122579 | RAJAHMUNDRY: 9154854693 | KARIMNAGAR: 9642117335 | NALGONDA: 9573927070 | ONGOLE: 8712609156 | KHAMMAM: 9121155002 | ADILABAD: 9154854690 | KOTHAGUDEM: 9154854692 | NIRMAL: 9642117835 | HOSAPETE: 9154854713.
SR Educational Academy
TELANGANA • ANDHRA PRADESH • KARNATAKA